www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI | పేజీలు: 8 + 4 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 | సంచిక (Issue) : 350

శనివారం | 4-4-2020

శ్రీశార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి రా. 10.31 వరకు తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఆశ్లేష సా. 5.09 తదుపరి మఖ; వర్జ్యం: ఉ. 6.39-8.09, తె. 4.03-5.30; దుర్ముహూర్తం: ఉ. 6.11-7.49; అమృతఘడియలు: మ. 3.39-5.09; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 6.26 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore





మచిలీపట్నంలోని కరోనా క్వారంటైన్ సెంటర్‌ను పరిశీలించేందుకు వెళ్లిన మంత్రి పేర్ని నాని మెడికల్ సూట్ ధరిస్తున్న దృశ్యం

ఇతర వ్యాధులతో ఎందరు ఎంత ఇబ్బంది పడినా సరే! కరోనాను మాత్రం కట్టడి చేయాల్సిందే! ఇదీ... ప్రస్తుత పరిస్థితి. లాక్‌డౌన్ నుంచి నిత్యావసరాలు, అత్యవసర సేవలకు మినహాయింపు ఉంది. కానీ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి చికిత్సలకు మాత్రం మినహాయింపు లేదు. మరి... వారి ఆరోగ్యం సంగతేమిటి?

# అరచేతిలో ప్రాణాలు!

## దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థుల ఇక్కట్లు

- వైద్యం కోసం వేల మంది ఎదురుచూపు
- హైదరాబాద్ వెళ్లేందుకు అనుమతి నిరాకరణ
- ఎన్‌వోసీలు ఇవ్వాలని రోగుల డిమాండ్లు
- పైనుంచి మాకు ఎలాంటి ఆదేశాలు లేవు
- ఎన్‌వోసీ ఇచ్చినా సరిహద్దుల్లో ఆపేస్తారు
- పోలీసు, ఆరోగ్య శాఖల స్పష్టీకరణ
- ప్రత్యామ్నాయాలపై దృష్టిపెట్టని అధికారులు

అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ ప్రభావం ఇతర వ్యాధిగ్రస్థులకు ప్రాణసంకటంగా మారింది. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థుల ప్రాణాలు గాలిలో దీపంలా మారాయి. తలసేమియా, కిడ్నీ, కేన్సర్ రోగుల అవస్థలు వర్ణనాతీతం. ప్రస్తుతం దేశం మొత్తం లాక్‌డౌన్ అమలవుతోంది. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకే బయటకు అనుమతిస్తున్నారు. అది కూడా కేవలం రెండు కిలోమీటర్ల పరిధిలో తిరిగేందుకు మాత్రమే అనుమతి ఉంది. దీంతో రాష్ట్రంలో

మిగతా 7వ పేజీలో...

## లైట్లు ఆపి.. జ్యోతులు

# వెలిగించండి

### రేపు రాత్రి 9 గం.కు 9 నిమిషాలపాటు



- కొవ్వొత్తులు, టార్చ్‌లైట్లు, సెల్ ఫ్లాష్‌లు ఏవైనా
- మరోసారి 'జనతా' స్ఫూర్తి ప్రదర్శిద్దాం
- కరోనా చీకటిని జయించే దృఢ సంకల్పం
- ప్రధాని నరేంద్ర మోదీ వీడియో సందేశం 8

**కరోనాపై పోరులో స్ఫూర్తి నింపండి**

క్రీడాకారులకు మోదీ పిలుపు 6

40 మంది అథ్లెట్లతో వీడియో కాన్ఫరెన్స్

**ఒకేసారి లైట్లు ఆఫ్ చేస్తే**

**గ్రిడ్ కుప్పకూలుతుంది!**

విద్యుత్ నిపుణుల హెచ్చరిక 8

# కరోనా ముట్టడి



| మొత్తం కేసులు | కొత్త కేసులు | మరణాలు |
|---|---|---|
| 164 | 15 | 01 |

మొత్తం మరణాలు: 01


కరోనా భయానికి కడపలో ఇలా..

## రాష్ట్రంలో 164 పాజిటివ్ కేసులు

### తొలి మరణం నమోదు.. చనిపోయిన 4 రోజులకు ప్రకటన

ఒకరోజు 15 మందికి.. నెల్లూరులో 8, విశాఖలో 4, 'తూర్పు'లో 2, కడపలో 1

విశాఖలో ఒకే కుటుంబంలో ముగ్గురికి పాజిటివ్

ముంబై నుంచి వచ్చిన యువకుడి ద్వారా అత్త, బావమరిదికి వ్యాప్తి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రాన్ని కరోనా ముట్టడిస్తోంది. వైరస్ బాధితుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఏపీలో శుక్రవారం 15 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీటితో కలిపి రాష్ట్రంలో మొత్తం బాధితుల సంఖ్య 164కి చేరింది. తాజాగా నెల్లూరులో 8మందికి, విశాఖలో నలుగురికి, తూర్పు గోదావరి జిల్లాలో ఇద్దరికి, కడప జిల్లాలో ఒకరికి వైరస్ సోకింది. ఢిల్లీ వెళ్లి వచ్చినవారితో నెల్లూరు జిల్లాలో వరుసగా మూడోరోజూ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. బుధవారం ఇద్దరికి, గురువారం 21మందికి కరోనా సోకినట్లు నిర్ధారణ కాగా, శుక్రవారం మరో 8మందికి వైరస్ సోకింది. దీంతో జిల్లాలో

మిగతా 7వ పేజీలో...

### చావు కబురు మెల్లగా!

- గతనెల 30వ తేదీన వ్యక్తి మృతి
- మరుసటిరోజే కరోనా నిర్ధారణ?
- జాగ్రత్తలు తీసుకోకుండానే ఖననం
- కరోనా మృతిగా కేంద్రం ప్రకటన
- తప్పనిసరై అంగీకరించిన రాష్ట్రం
- ఆ కుటుంబంలో ఆరుగురికి పాజిటివ్
- మృతుడి భార్యా ఆ లక్షణాలతోనే మృతి

7



### తబ్లీగీతోనే తంటా

- ఆ సమావేశాల్లో పాల్గొన్న వారివల్లే అధికంగా కరోనా పాజిటివ్ కేసులు
- పోలీసు భాష, కౌన్సెలింగ్ మారాలి
- వలంటీర్లతో పేదల ఇంటికే వెయ్యి
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం జగన్

## మతపరమైన సమావేశాలు వద్దు

### మర్కజ్, ఆనంద్ విహార్ ఘటనలతో కరోనా కట్టడికి తీవ్ర విఘాతం

- వైద్యులు, సిబ్బందిపై దాడులు సరి కాదు
- దేశంలో ఏ ఒక్కరూ ఆకలితో ఉండొద్దు
- వలస కూలీలందరికీ ఆహారం అందించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రపతి కోవింద్
- రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి
- ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచన
- రైతులకు అన్ని ఇబ్బందులు తొలగిస్తాం
- పేదలకు పంపిణీపై ప్రత్యేక దృష్టి: గవర్నర్ 2


వీడియో కాన్ఫరెన్స్‌లో గవర్నర్ విశ్వభూషణ్

### 960 మంది వీసాలు రద్దు

తబ్లీగీ విదేశీయులపై కేంద్రం చర్య

యూపీలో నర్సులపై దుష్ప్రవర్తన.. కేసు



జూన్ 30 వరకు..

**డ్రైవింగ్ లైసెన్సుల చెల్లుబాటు**

పర్మిట్లు, ఫిట్‌నెస్‌లకు కూడా 8



ఆలయాల్లోని క్షురకులకు

**10 వేలు అడ్వాన్స్** 3



పెన్షన్ అందకపోయినా

**వచ్చే నెలలో ఇస్తారు** 3

# 'చావు బతుకుల' సమస్య!

న్యూయార్క్‌లో 9/11 తర్వాత అత్యధిక మరణాలు

- అంత్యక్రియలకూ 2 వారాలు వెయిటింగ్
- ఫ్యునరల్ హోమ్స్‌పై తీవ్రమైన ఒత్తిడి
- ఆస్పత్రుల్లో వెంటిలేటర్లకు కరువు
- 90 శాతం అమెరికన్లు లాక్‌డౌన్‌లోనే!
- రెండు వారాల్లో కోటి ఉద్యోగాలు మాయం
- కరోనాపై సమరం కీలక దశకు
- నెలపాటు ఇళ్లలో ఉంటేనే విజయం: ట్రంప్

బతుకు ఒక సమస్య. చావు మరింత సమస్య! చావు బతుకుల మధ్య పోరాడుతున్న వారికి పెను సమస్య! అగ్రరాజ్యం అని అంతా చెప్పుకునే అమెరికా... 'మా ఒక్క పౌరుడి ప్రాణం తృతీయ ప్రపంచ దేశాలకు చెందిన పది మంది ప్రాణాలతో సమానం' అని భావించే అమెరికా... ఇప్పుడు తీవ్ర మానవీయ సంక్షోభంలో చిక్కుకుంటోంది. కొలువులు పోతున్నాయి. మరణాలు పెరుగుతున్నాయి. చనిపోయిన తర్వాత... తగిన మర్యాదలతో అంతిమ వీడ్కోలు పలికేందుకూ ఎదురు చూపులే!

న్యూయార్క్, ఏప్రిల్ 3: ఫోన్ రింగ్ అయ్యింది! చేసే వారెవరో తెలియకపోవచ్చు! కానీ... ఎందుకు చేస్తున్నారో మాత్రం తెలుసు! "మా ఇంట్లో ఒక మరణం! మృతదేహాన్ని తీసుకొస్తున్నాం! అంత్యక్రియలకు సిద్ధం చేయగలరా!".... ఇదే ఆ ఫోన్‌కాల్ సారాంశం! అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఉన్న దాదాపు అన్ని 'అంత్యక్రియల సేవల' (ఫ్యునరల్ హోమ్) కార్యాలయాల్లో

మిగతా 8వ పేజీలో...



వైద్య పరికరాలతో వాషింగ్టన్ విమానాశ్రయంలో దిగిన చైనా విమానం

## కరాళ నృత్యం

- దావానలమై దేశాలకు దడ.. 58 వేల మంది మృత్యువాత
- పదిలక్షలమందికి పాజిటివ్.. 4.1 ట్రిలియన్ డాలర్ల సంపద ఆవిరి
- వృద్ధులకే ఆపదనే అంచనా పటాపంచలు.. యువకులూ బలి 8

## తెలంగాణలో మరో 75 కేసులు

- అన్నీ మర్కజ్ లింకులే.. మహిళ, జీహెచ్ఎంసీ ఉద్యోగి మృతి
- ఇద్దరూ హైదరాబాద్ వారే.. వారిద్దరికీ ఎలా వచ్చిందో తెలియదు
- రాష్ట్రంలో 229కి చేరిన కేసుల సంఖ్య.. 11కు చేరిన మరణాలు

## మాస్కులు హైజాక్

- ఫ్రాన్స్ కోసం సిద్ధమైన మాస్కులు గద్దలా తన్నుకుపోయిన అమెరికా
- షాంఘై ఎయిర్ పోర్టులో ఘటన.. మూడు రెట్లు ఎక్కువ డబ్బు ఎర
- ఆరోపణల్లో నిజం లేదన్న అమెరికా ప్రభుత్వం

**స్థలం :** షాంఘై విమానాశ్రయం

**సమయం :** ఏప్రిల్ 3వ తేదీ ఉదయం



**విమానం రాక:** అప్పుడే బీజింగ్ నుంచి ఓ విమానం వచ్చింది. దాని నిండా లక్షలాది మాస్కులతో కూడిన బండిల్స్ ఉన్నాయి. ఇవన్నీ మెడికల్, పారామెడికల్ సిబ్బంది కోసం తయారు చేసిన ఎన్-95 తరహా కట్టుదిట్టమైన మాస్కులు. కరోనా ధాటికి వందల మంది పౌరులను కోల్పోతున్న ఫ్రాన్స్ వీటి కోసం ఆర్డరిచ్చింది. ఇవి పారిస్‌కు వెళ్లాల్సి ఉంది.

**ఏం జరిగింది:** టర్మాక్ మీదకు విమానం ఆగగానే అంతలో ఓ నలుగురు వ్యక్తులు ఆ విమానం దగ్గరకు ప్రవేశించారు. అందులోని చైనా అధికారులతో మాట్లాడారు. ఫ్రాన్స్ ఇస్తానన్న డబ్బు కంటే మూడు రెట్లు ఎక్కువ ఇస్తాం... ఇవన్నీ మాకు ఇచ్చేయండి... అని బేరం మొదలెట్టారు. కానీ చైనా అధికారులు మొదట దీనికి అంగీకరించలేదు. ఆ తరువాత మరికాస్త ఎక్కువ సొమ్ము ఎరజూపారు. అయినా ఒప్పుకోలేదు. డబ్బు కట్టలు ఎత్తిచూపుతూ మరీ వెంటపడ్డారు. చివరకు అమెరికా నుంచి ఉన్నతస్థాయిలో ఒత్తిళ్లు వచ్చాయి. మా దగ్గరే కేసులెక్కువ. ఫ్రాన్స్‌లో కంటే మా దేశంలోనే చైనీయులు ఎక్కువ మంది ఉన్నారు. మీరు మొదట సహకరించాల్సినది మాకే' అని

మిగతా 8వ పేజీలో...



ఇంటి నుంచే

**టోఫెల్, జీఆర్ఈ** 2



లాఠీ భయంతో

**ఆగిన గుండెలు**

పోలీసులు వస్తున్నారని పరుగెడుతూ పశ్చిమలో ఇద్దరు గుండెపోటుతో మృతి 3



వరల్డోమీటర్ ప్రకారం శుక్రవారం రాత్రి 11:30 గంటలకు

| ప్రభావిత దేశాలు | అమెరికా | ఇటలీ | చైనా | స్పెయిన్ | జర్మనీ | ఇరాన్ | బ్రిటన్ | ఇండియా | ప్రపంచం | తెలంగాణ | ఏపీ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| కొత్త కేసులు | 20,629 | 4,585 | 31 | 5,645 | 5,044 | 2,715 | 4,450 | 226 | 64,896 | 75 | 15 |
| మరణాలు | 6,786 | 14,681 | 3,322 | 10,935 | 1230 | 3,294 | 3605 | 72 | 58,110 | 11 | 1 |
| బాధితులు | 2,65,506 | 1,19,827 | 81,620 | 1,17,710 | 89,838 | 53,183 | 38,168 | 2,567 | 10,79,961 | 229 | 164 |



**రూ.లక్షకే వెంటిలేటర్**

హైదరాబాద్ ఐఐటీ ఆవిష్కరణ 2



పరంజ్యోతి

# సత్యాన్ని వదిలితే భగవంతుని వదిలినట్లే



సత్యమేవ జయతే నానృతమ్
సత్యేన పంథా వితతో దేవయానః
యేనా క్రమంతి ఋషయో హి ఆప్తాకామా
యత్ర తత్సత్యస్య పరమం నిధానమ్

..అని ముండకోపనిషత్తు చెబుతోంది. సత్యమే జయిస్తుంది. అబద్ధం గెలవదు. ఋషులంతా ఆ సత్యమార్గం ద్వారానే పరమాత్మను చేరుకోగలిగారని దీని అర్థం. భారతంలో కూడా శకుంతల దుష్యంతునితో.. మంచినీళ్లతో నిండిన నూరు బావుల కన్నా ఒక దిగుడుబావి మేలు.. అలాంటి నూరు బావుల కంటే ఒక యజ్ఞం మేలు.. అలాంటి నూరు యజ్ఞాల కంటే ఒక కొడుకు.. అలాంటి నూరుగురు కొడుకుల కంటే ఒక సత్య వాక్యం మేలు అని హితవు చెబుతుంది. భగవంతుడు సత్యస్వరూపుడు. సత్యాన్ని వదిలితే, భగవంతుని వదిలినట్లే! అందుకే శ్రీరామకృష్ణులు కాళీ మాత ముందు సర్వం అర్పిస్తూ.. 'అమ్మా! ఇదిగో నీ జ్ఞానం, ఇది నీ అజ్ఞానం, నీ ఖ్యాతి - అపఖ్యాతి ఇదిగో' అన్నాడే కానీ 'ఇదిగో నీ సత్యం-ఇదిగో నీ అసత్యం' అని అనలేదు. సత్యాన్ని వదిలితే భగవంతుని వదిలినట్లేనని గుర్తుచేశారు. 'దైవాధీనంతు జగత్సర్వం.. సత్యాధీనంతు దైవం' అని సూక్తి. ఈ జగత్తు సర్వం దైవాధీనమయితే, ఆ దైవం సత్యాధీనమై ఉంటాడని దీని అర్థం. దేవతలను సైతం భువికి దింపే శక్తి సత్య నిష్ఠకు ఉందనడంలో సందేహం లేదు. ఇది చరిత్ర నిరూపించిన సత్యం. యుగాలు, తరాలు మారినా సత్యవ్రతుల చరిత్ర సుస్థిరమైనది. సత్య హరిశ్చంద్రుడు సత్యానికి ప్రతిరూపం. తన సర్వస్వాన్నీ కోల్పోయినా హరిశ్చంద్రుడు సత్యాన్ని వీడలేదు. అతని సత్యవ్రతానికి దేవతలు సైతం జోహార్లు అర్పించారు. అలాగే.. బలిచక్రవర్తి కూడా సత్యానికి, ధర్మానికి నిలబడిన రాజు. కనుకనే తాను పాతాళానికి వెళ్లవలసి వస్తుందని తెలిసినా సత్యధర్మంతో వామనుడి మూడో అడుగును తన శిరస్సున ఉంచమన్నాడు. సత్యనిష్ఠుల గొప్పతనం అది. అందుకే వారు చరిత్రలో అమరులయ్యారు.

కలియుగంలో సత్యపాలనే నిజమైన తపస్సు. సత్యాన్ని అంటిపెట్టుకొని మన విధులను నిర్వర్తించడమే మహా తపస్సవుతుంది. ఈ తపస్సును ఆచరించిన వాడే భగవంతుని చూడగలుగుతాడు. అలాంటివారు పిలిస్తే భగవంతుడు పలుకుతాడు. భక్తతుకారాం, రామదాసు వంటివారు ఇందుకు ఉదాహరణలు. మనిషి జీవితంలో యవ్వనం, సౌందర్యం, డబ్బు, పేరు ప్రతిష్ఠల వంటివన్నీ అశాశ్వతాలే. శాశ్వతంగా నిలిచేది సత్యం మాత్రమే. 'సత్యమేవ పదం'.. సత్యమే ఏకైక మార్గము. సత్యమే భగవంతుడు. సత్యమునందే ధర్మం సుప్రతిష్ఠమై ఉంటుంది. సర్వ వేదాల సారం సత్యస్వరూపము. సత్యం ద్వారానే పరమపదం ప్రాప్తిస్తుందని సర్వదా గ్రహించాలి. సత్యపదమే మానవ జీవిత లక్ష్యంగా ఎంచుకోవాలి. సత్యనిష్ఠను పాటించేవారి కష్టాలు అశాశ్వతాలు. అసత్యాలు చెప్పేవారి సుఖాలు శాశ్వతంగా నిలవవు. సత్యమే ఎప్పటికైనా జయిస్తుంది. అలాంటి సత్యనిష్ఠకు కట్టుబడి ఉండడానికి కావాల్సింది అభ్యాసం, పెద్దల ఆశీర్వాదం, పురాణ పఠనం, సత్సాంగత్యం.

- పరాంకుశం శ్రీనివాసమూర్తి, 9493455256

# 960 మంది వీసాలు రద్దు

- 'తబ్లీగీ' విదేశీయులపై కేంద్రం చర్య
- యూపీలో నర్సుల పట్ల తబ్లీగీ కార్యకర్తల దుష్ప్రవర్తన
- ఆరుగురిపై ఎన్ఎస్ఏ కేసు
- దేశంలో 2 రోజుల్లో 647 కేసులు
- అన్నీ తబ్లీగీ జమాత్ వల్లే: కేంద్రం

న్యూఢిల్లీ/ఘజియాబాద్/ఇండోర్, ఏప్రిల్ 3: నిబంధనలు ఉల్లంఘించి మర్కజ్ ప్రార్థనల్లో పాల్గొన్నందుకు బ్లాక్‌లిస్టులో పెట్టిన 960 మంది తబ్లీగీ జమాత్ విదేశీ కార్యకర్తల వీసాలను కేంద్రం రద్దు చేసింది. వీరిలో నలుగురు అమెరికన్లు, తొమ్మిది మంది బ్రిటన్, ఆరుగురు చైనా జాతీయులని కేంద్ర హోంశాఖ అధికారులు శుక్రవారం వెల్లడించారు. వీరంతా టూరిస్టు వీసాలతో భారత్‌కు వచ్చి.. మర్కజ్ ప్రార్థనల్లో పాల్గొన్న విషయం తెలిసిందే. కాగా, వీరిలో ఇప్పటికే 300 మందికిపైగా కరోనా పాజిటివ్‌గా తేలింది. వీరే కాకుండా తబ్లీగీ జమాత్ విదేశీయుల్లో పలువురు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నట్లు, 379 మంది ఇండోనేషియన్లు, 110 మంది బంగ్లాదేశీయులు, 63 మంది మయన్మార్, 33 మంది శ్రీలంక పౌరులతోపాటు ఇతర దేశాల వారు పెద్దసంఖ్యలో ఉన్నారన్నారు. అయితే మరో 360 మంది విదేశీయులు సరిహద్దులను మూసివేయడానికి ముందే వెళ్లినట్లు తెలిపారు.

## నర్సుల పట్ల అసభ్య ప్రవర్తన..

కరోనా రక్కసి బారి నుంచి బాధితులను కాపాడేందుకు ప్రాణాలకు తెగించి చికిత్స అందిస్తున్న నర్సుల పట్ల ఉత్తరప్రదేశ్‌లో తబ్లీఘీ జమాత్ కార్యకర్తలు అసభ్యకరంగా ప్రవర్తించారు. ఘజియాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో క్వారంటైన్‌లో ఉన్న కార్యకర్తల్లో కొందరు బట్టలు విప్పేసుకొని తిరుగుతూ, అసభ్యకరమైన పాటలు పాడుతూ, సైగలు చేస్తూ తమ పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తిస్తున్నారని వారికి సేవలందిస్తున్న నర్సులు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనను ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్రంగా పరిగణించారు. ఆరుగురు తబ్లీగీ సభ్యులపై జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ) కింద కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. వారిని మరోచోట ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డుకు తరలిస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు ఇండోర్‌లో వైద్య సిబ్బందిపై దాడి చేసిన ఘటనకు సంబంధించి నలుగురు వ్యక్తులపై పోలీసులు ఎన్ఎస్ఏ కేసులు నమోదు చేశారు. ఇక శుక్రవారం కనౌజ్‌లోని ఓ మసీదు వద్ద ప్రార్థనలు చేసేందుకు గుంపుగా వెళ్తున్నవారిని పోలీసులు అడ్డుకోగా.. వారు దాడికి పాల్పడటంతో ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. మరోవైపు ఢిల్లీలోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న తబ్లీగీ కార్యకర్తలు వైద్య సిబ్బందికి సహకరించడం లేదంటూ పలువురు వైద్యులు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు.

## ఆ సమావేశం వల్లే పెరిగిన కేసులు..

గడచిన రెండు రోజుల్లో దేశంలోని 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 647 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు, ఇవన్నీ తబ్లీగీ జమాత్ సమావేశం వల్లే సంభవించాయని కేంద్ర ఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీ లవ్ అగర్వాల్ తెలిపారు. ఇక గడచిన 24 గంటల్లో 12 కరోనా మరణాలు సంభవించగా.. వాటిలో కొన్ని తబ్లీగీకి సంబంధించినవి ఉన్నాయన్నారు. మొత్తంగా దేశంలో ఇప్పటివరకు 2301 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు, 157 మంది కోలుకోగా.. 56 మంది మృతి చెందినట్లు వెల్లడించారు. రాజస్థాన్‌లోని టోంక్ ప్రాంతంలో కరోనా పీడితుల సంఖ్య పెరగడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ బృందం అక్కడికి చేరుకుందని లవ్ అగర్వాల్ చెప్పారు. నిజాముద్దీన్ మర్కజ్‌ను ఖాళీ చేయించడానికి 5 రోజులు పట్టిందన్నారు.

# మతపరమైన భేటీలు వద్దు

- మర్కజ్, ఆనంద్ విహార్ ఘటనలతో కరోనా కట్టడికి విఘాతం
- వైద్యులు, ఆరోగ్య సిబ్బందిపై దాడులు సరి కాదు
- గవర్నర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రపతి కోవింద్
- రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి : ఉపరాష్ట్రపతి వెంకయ్య



గవర్నర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న రాష్ట్రపతి కోవింద్

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కరోనా వ్యాప్తి నేపథ్యంలో మత పెద్దలతో చర్చించి మతపరమైన సమావేశాలు నిర్వహించకుండా చొరవ తీసుకోవాలని అన్ని రాష్ట్రాల గవర్నర్లకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. కరోనాను కట్టడి చర్యలపై అన్ని రాష్ట్రాల గవర్నర్లతో శుక్రవారం రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి కోవింద్ మాట్లాడుతూ... నిజాముద్దీన్ మర్కజ్‌లో తబ్లీగీ జమాత్, ఢిల్లీలోని ఆనంద్ విహార్‌లో వలస కార్మికులందరూ గూమిగూడిన ఘటనలు ఆందోళన కలిగించాయని తెలిపారు. కరోనాను అరికట్టడానికి చేపడుతున్న చర్యలకు ఈ రెండు ఘటనలు ఆటంకం కలిగించాయని అభిప్రాయపడ్డారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది, పోలీసులపై దాడులకు పాల్పడడం సరికాదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో ఏ ఒక్కరూ ఆకలితో ఉండరాదని, అందరికీ ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్లకు దిశానిర్దేశం చేశారు. భౌతిక దూరం పాటించడంలో రాజీ పడొద్దని తేల్చిచెప్పారు. కాగా, కరోనాపై పోరాటానికి సంఘీభావంగా ఆదివారం రాత్రి 9 గంటలకు లైట్లు ఆపేసి దీపాలు వెలిగించాలంటూ ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును కోవింద్ సమర్థించారు. దేశ ప్రజలు చూపుతున్న సహనానికి రాష్ట్రపతి అభినందనలు తెలిపారు. అనంతరం ఉపరాష్ట్రపతి వెంకయ్య మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలు పాటించేలా ఆధ్యాత్మికవేత్తలు, మతపెద్దలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక సభలు నిర్వహించకుండా నచ్చజెప్పాలని, వినకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలంతా ఇళ్లలోనే మతపరమైన ప్రార్థనలు చేసుకోవాలని కోరారు. పంటకోతలు, వ్యవసాయ ఉత్పత్తులు, ధాన్యం సేకరణ, నిల్వ తదితర అంశాలపై శ్రద్ధ చూపాలని, రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. పలు చోట్ల డాక్టర్లు, వైద్య సిబ్బందిపై జరుగుతున్న దాడులను వెంకయ్య ఖండించారు. వలస కార్మికులకు కల్పిస్తున్న సదుపాయాల గురించి ఆయన గవర్నర్లను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కేంద్ర రాష్ట్రాలు శాయశక్తులా కృషి చేస్తున్నాయని, సమాజం కూడా వారికి భోజనం, వసతి కల్పించడాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు.

### కరోనా ఎఫెక్ట్ వీడియోకాల్‌లోనే పూజలు

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మీరు ఆన్‌లైన్ పేమెంట్స్ చేసి ఉంటారు. ఆన్‌లైన్ పెళ్లిచూపుల ఘటనలు చూసి ఉంటారు. కానీ.. ఆన్‌లైన్ పూజ గురించి విన్నారా? కరోనా ప్రభావంతో పూజారులు ఎవరింటికీ వెళ్లే పరిస్థితి లేదు. కానీ చాలా కుటుంబాలకు పుణ్యతిథుల్లోనో, పండుగ రోజుల్లోనో కచ్చితంగా పూజాకార్యక్రమాలు నిర్వహించుకోవాలనే సెంటిమెంట్లు ఉంటాయి. అలాంటి వారంతా ఇప్పుడు టెక్నాలజీని ఆశ్రయిస్తున్నారు. తాజాగా శ్రీరామనవమి రోజున ఇళ్లల్లో పూజలకు గాను, వాట్సాప్ వీడియోకాల్‌లోనే భక్తులు పూజలు కానిచ్చేశారు. పంతులుగారి మంత్రోచ్చారణ ఇటువైపు, పూజ అటువైపు టకటకా జరిపోయాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఇక పూజ పూర్తైన తర్వాత, దక్షిణ కూడా ఆన్‌లైన్‌లోనే పంతులుగారి ఖాతాలోకి చేరిపోతోంది.

## లోకం తీరు




| ఎండాకాలం | | |
|---|---|---|
| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
| గుంటూరు | 35.9 | 25.2 |
| విజయవాడ | 37.8 | 25.4 |
| రాజమండ్రి | 39.0 | 19.0 |
| హైదరాబాద్ | 39.4 | 26.4 |
| కడప | 41.0 | 24.0 |
| కర్నూలు | 40.2 | 28.3 |



### దేశంలో మందుల కొరత లేదు

దేశంలో మందులు, వైద్య పరికరాలకు ఎలాంటి కొరత లేదు. గడిచిన 5 రోజుల్లో 15.4 టన్నుల మందులు, ఇతర ముఖ్యమైన వైద్యపరికరాలను 62 ఉడాన్ విమానాల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలించాం. వైద్య ఉపకరణాల ఉత్పత్తి కోసం 200 యూనిట్లు పనిచేస్తున్నాయి.

- సదానంద గౌడ, కేంద్రమంత్రి



### సమర్థవంతంగా సరిహద్దుల మూసివేత

లాక్‌డౌన్ సమయంలో దేశ ఈశాన్యంలోని 5,500 కిలోమీటర్ల సరిహద్దులను సమర్థవంతంగా మూసివేశాం. ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖలో వంద శాతం పనులు ఈ-ఆఫీస్ ద్వారానే జరుగుతున్నాయి. శాఖ సిబ్బంది ఒక రోజు వేతనాన్ని పీఎం కేర్స్ ఫండ్‌కు విరాళంగా ఇచ్చారు.

- జితేంద్ర, కేంద్ర మంత్రి

### పార్శిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలు షురూ

సికింద్రాబాద్/హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొవిడ్-19 మహమ్మారిని కట్టడి చేసేందుకు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసిన నేపథ్యంలో నిత్యావసర సరుకుల రవాణాకు ఎటువంటి అంతరాయం కలుగకూడదనే ధ్యేయంతో దేశంలోని పలు నగరాలకు దక్షిణ మధ్య రైల్వే పార్శిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించింది. గురువారం సికింద్రాబాద్ నుంచి హౌరాకు ప్రత్యేక పార్శిల్ ఎక్స్‌ప్రెస్ రైలు కాజీపేట, విజయవాడ, రాజమండ్రి, అనకాపల్లి మీదుగా బయలుదేరింది. రైల్వే అధికారులు, సిబ్బంది సమష్టి కృషి వల్ల 3005 ప్యాకేజీలతో 91.5 టన్నుల లోడ్‌తో ప్రత్యేక పార్శిల్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది.

### స్ట్రోక్ బాధితులకు వ్యాయామమే శ్రీరామరక్ష

వాషింగ్టన్, ఏప్రిల్ 3 : ఇప్పటికే బ్రెయిన్ స్ట్రోక్ బారినపడిన వారు ఆరోగ్యవంతంగా జీవించాలంటే రోజూ తేలికపాటి శారీరక వ్యాయామం చేయాలని అమెరికాలోని ఇల్లినాయిస్ వర్సిటీ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వాకింగ్, ఇంటి పనులు, గార్డెనింగ్ వంటి వాటికి రోజులో కనీసం మూడు గంటలు వెచ్చించడం మేలని చెబుతున్నారు. ఈవిధంగా చేసేవారి ఆరోగ్య స్థితిగతులు.. బద్ధకంగా ప్రవర్తించి ఒకేచోటుకు పరిమితమయ్యే వారికంటే మెరుగ్గా ఉంటాయన్నారు. 30 మంది స్ట్రోక్ బాధితుల శారీరక కదలికలను యాక్సెలరోమీటర్లతో వారంపాటు అధ్యయనం చేసిన అనంతరం ఈమేరకు సూచనలు చేశారు.

### హైడ్రాక్సి క్లోరోక్విన్, అజిత్రోమైసిన్‌లతో గుండెకు ముప్పు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 : కరోనా చికిత్సకు మలేరియా నిరోధక ఔషధం హైడ్రాక్సి క్లోరోక్విన్, యాంటీబయాటిక్ అజిత్రోమైసిన్‌లను కలిపి వాడవచ్చంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి ప్రముఖ వైద్యనిపుణుల దాకా చెబుతున్నారు. అయితే ఈ ప్రకటనలతో విభేదిస్తూ అమెరికాలోని ఒరెగాన్ హెల్త్ అండ్ సైన్స్ వర్సిటీ, ఇండియానా వర్సిటీ శాస్త్రవేత్తల సంయుక్త బృందం ఓ అధ్యయన నివేదికను విడుదలచేసింది. ఆ రెండు ఔషధాలను కలిపి వినియోగిస్తే రోగుల గుండె కొట్టుకునే రేటు ఒక్కసారిగా అదుపుతప్పే అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు. ప్రధానంగా కరోనా ఇన్ఫెక్షన్ బారినపడిన హృద్రోగులకు ఈ మందులను అందించడం మంచిదికాదని సూచించారు.



### ఈ నెల 7న.. 'సూపర్ మూన్' దర్శనం

వాషింగ్టన్, ఏప్రిల్ 3: రానున్న పున్నమిరోజు(ఈ నెల 7)న చందమామ సూపర్‌మూన్‌గా కనిపించనున్నాడు. చంద్రుడు తన కక్ష్యలో తిరిగే క్రమంలో భూమికి అతి దగ్గరగా వచ్చినప్పుడు సాధారణం కంటే 7% శాతం పెద్దగా, 15% ఎక్కువ ప్రకాశవంతంగా కనిపిస్తాడు. అందుకే.. ఆ రోజున కనిపించే చందమామను 'సూపర్‌మూన్' అని పిలుస్తారు. ఉత్తర అమెరికాలాంటి ప్రాంతాల్లో 'పింక్‌మూన్' అని, ఇతర దేశాల్లో స్ప్రౌటింగ్ గ్రాస్ మూన్, ది ఎగ్ మూన్, ద ఫిష్‌మూన్ అని పిలుస్తుంటారు. కాగా.. భారత్‌లో సూపర్‌మూన్ కనిపించకపోవచ్చని.. ఈ సారి చంద్రుడు భూమికి దగ్గరగా వచ్చినప్పుడు భారత్‌లో సమయం 8వ తేదీ ఉదయం 8.05గా ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

### ఇంటి నుంచే టోఫెల్, జీఆర్ఈ పరీక్షలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: విదేశాల్లోని ప్రముఖ వర్సిటీల్లో ప్రవేశాలకు నిర్వహించే టోఫెల్, జీఆర్ఈ అభ్యర్థులు ఇంటివద్ద నుంచే పరీక్షలకు హాజరు కావొచ్చని ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్ (ఈటీఎస్) వెల్లడించింది. కరోనా ఉధృతి తగ్గే వరకు ఈ నిర్ణయం అమలులో ఉంటుందని తెలిపింది. విద్యార్థులు తమ వెసులుబాటును బట్టి పరీక్ష సమయాన్ని ఎంచుకోవచ్చని సూచించింది.

### ముప్పు గుప్పిట విశాఖ

- హాట్‌స్పాట్‌ల జాబితాలో పేరు
- ఆంధ్రాకు ప్రమాద ఘంటికలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి వల్ల ముప్పు ఉన్న ప్రాంతాల జాబితాలో విశాఖపట్నం జిల్లా చేరింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 20 హాట్‌స్పాట్‌లను గుర్తించింది. పెరిగిన వైరస్ తీవ్రత రీత్యా ఇప్పుడు కొత్తగా ఎనిమిది రాష్ట్రాల పరిధిలో మరికొన్ని జిల్లాలను గుర్తించగా, విశాఖ జిల్లా అందులో చేరడం రాష్ట్రంలో ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి ప్రీతీ సూడాన్ శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. ఈ జాబితాలో విశాఖ జిల్లాతోపాటు బిహార్‌లోని ముంగేర్, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, ఢిల్లీలోని న్యూఢిల్లీ, హరియాణాలోని పరీదాబాద్, జమ్మూకశ్మీర్ లో జమ్ము, తమిళనాడులోని కోయంబత్తూర్, కన్యాకుమారి, పశ్చిమ బెంగాల్‌లో నడియా, హూగ్లీలను ఉన్నట్లు వివరించారు. ఇదిలాఉండగా, గత 2 రోజులుగా 14 రాష్ట్రాల్లో పాజిటివ్ కేసులు 647కు పెరగడానికి ఢిల్లీలో జరిగిన తబ్లీగీ జమాత్ సమావేశాలే కారణమని కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ వెల్లడించారు.

# రూ. లక్షతో వెంటిలేటర్ తయారీ

- ఆవిష్కరించిన హైదరాబాద్ ఐఐటీ



ఐఐటీహెచ్ ఆవిష్కరించిన వెంటిలేటర్

సంగారెడ్డి, పటాన్‌చెరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కరోనా చికిత్సలో వెంటిలేటర్లు విరివిరిగా అవసరపడుతున్న తరుణంలో హైదరాబాద్ ఐఐటీ పరిశోధనా విభాగం చవకైన వెంటిలేటర్‌ను ఆవిష్కరించింది. కేవలం రూ.లక్షతో ఆధునిక హంగులతో ఈ వెంటిలేటర్‌ను రూపొందించారు. ఐఐటీహెచ్ బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ హెల్త్‌కేర్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఏయిరో బయోసిస్ ఇన్నోవేషన్ అనే స్టార్టప్ విభాగం జీవన్‌లైట్ పేరుతో ఈ వెంటిలేటర్‌ను తయారు చేసింది. ప్రస్తుతం ఉపయోగిస్తున్న వెంటిలేటర్లతో పోల్చితే జీవన్‌లైట్‌కు ఆధునిక హంగులు ఉన్నాయని హెచ్ ఐఐటీ డైరెక్టర్ బీఎస్.మూర్తి అన్నారు. వెంటిలేటర్‌ను మొబైల్ యాప్‌తో అనుసంధానించి రోగికి దూరంగా ఉంటూ చికిత్స నిర్వహించే వెసులుబాటు ఉందన్నారు. విద్యుత్తులేని ప్రాంతాల్లో కూడా లిథియం అయాన్ బ్యాటరీల ద్వారా ఐదు గంటల వరకు ఉపయోగించుకునే అవకాశం ఉందన్నారు. రిమోట్ సాయంతో నిర్వహించవచ్చునని ఐఐటీహెచ్ బయోమెడికల్ విభాగం అధిపతి ప్రొఫెసర్ రేణుజాన్ పేర్కొన్నారు. ప్రభుత్వాలు, పారిశ్రామిక సంస్థలు ముందుకొచ్చి పెద్ద ఎత్తున వెంటిలేటర్లను ఉత్పత్తి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. పల్మనాలజీ (ఊపిరితిత్తుల విభాగం), క్రిటికల్ కేర్ చికిత్స వైద్య నిపుణుల సూచనల మేరకు జీవన్‌లైట్‌ను ఆధునీకరించామని ఏయిరోబయోసిస్ స్టార్టప్ ప్రారంభకులు రాజేశ్ తంగవేలు, సిరిల్‌అంథోనీ వివరించారు. కాగా ఐఐటీ-రూర్కీకి చెందిన పరిశోధకులు కేవలం రూ.30వేలతో పోర్టబుల్ వెంటిలేటర్‌ను అభివృద్ధి చేశారు.

# బాలకృష్ణ రూ.1.25కోట్ల విరాళం

## ఏపీ, తెలంగాణలకు చెరి రూ.50 లక్షలు.. సీసీసీకి రూ.25 లక్షలు



టీ మంత్రి కేటీఆర్‌కు విరాళం అందజేస్తున్న బాలకృష్ణ

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కరోనా మహమ్మారిపై పోరాటానికి తమ వంతు చేయూతనివ్వడానికి దాతలు ముందుకు వస్తూనే ఉన్నారు. తాజాగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ రూ.2 కోట్లు ప్రకటించారు. పీఎం కేర్స్ నిధికి రూ. కోటి, టీసీఎంఆర్ఎఫ్‌కు రూ.50 లక్షలు, ఏపీసీఎంఆర్ఎఫ్‌కు రూ.50 లక్షలు బ్యాంకు ద్వారా బదలాయించారు. సినీ హీరో నందమూరి బాలకృష్ణ రూ.1. 25 కోట్లు విరాళంగా ప్రకటించారు. ఇందులో రూ.50 లక్షలు ఏపీసీఎంఆర్ఎఫ్‌కు, రూ.50 లక్షలు తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇచ్చారు. తెలుగు సినీ కార్మికుల సహాయార్థం రూ.25 లక్షల చెక్కును అందించారు. ముఖ్యమంత్రి సహాయనిధికి గంగవరం పోర్టు తరపున రూ.3 కోట్లు విరాళాన్ని పోర్టు ఛైర్మన్ డి.వి.ఎస్.రాజు, పోర్టు సీఈవో, మాజీ డీజీపీ సాంబశివరావు శుక్రవారం సీఎం జగన్‌కు చెక్ అందించారు. అదేసమయంలో పోర్టులో వాటాదారుగా ఉన్న ప్రభుత్వానికి రావాల్సిన మధ్యంతర డివిడెండ్ రూ.16.25 కోట్ల చెక్‌ను కూడా సీఎంకు అందించారు.

**బెంగళూరు:** బెంగళూరులోని పీఈఎస్ వర్సిటీ చాన్సెలర్ ఎం.ఆర్.దొరస్వామి రూ.5 కోట్ల విరాళాన్ని సీఎం యడియూరప్పకు శుక్రవారం అందజేశారు. సీఎం సహాయ నిధికి 3కోట్లు, పీఎం కేర్స్‌కు 2 కోట్లు ఇచ్చారు.

### క్వారంటైన్ పూర్తయింది: శ్రద్ధా శ్రీనాథ్

కరోనా వైరస్ గురించి తనపై వస్తున్న వార్తలను జెర్సీ ఫేం శ్రద్ధా శ్రీనాథ్ ఖండించారు. ఇటీవల విమాన ప్రయాణం చేసిన నేపథ్యంలో తనను హోం క్వారంటైన్‌లో ఉండాలని కర్ణాటక ఆరోగ్యశాఖ ఆదేశించిందన్న వార్తల్లో నిజంలేదని ఆమె ట్విటర్‌లో తెలిపారు. "గతనెల హైదరాబాద్ నుంచి చెన్నై విమాన ప్రయాణం చేశాను. నేను ఇంటికి చేరాక కర్ణాటక ఆరోగ్యశాఖ వారు ఎవరూ నా దగ్గరకు రాలేదు. నా కజిన్ ఒకరు డాక్టర్ కావడంతో తన సూచనల మేరకు ముందు జాగ్రత్తగా 14 రోజుల స్వీయ నిర్బంధంలో ఉన్నా. మార్చి 29 నాటికి నా క్వారంటైన్ పూర్తయింది" అని శ్రద్ధా ట్వీట్ చేశారు.



### నిఖిల్ పెళ్లి వాయిదా

కరోనా, లాక్‌డౌన్ కారణంగా తన పెళ్లిని వాయిదా వేసుకున్న హీరో నితిన్ బాటలో మరో హీరో నిఖిల్ కూడా నడిచారు. ఈ నెల 16న డాక్టర్ పల్లవీశర్మతో జరగాల్సిన తన పెళ్లిని ఆయన వాయిదా వేసుకున్నారు.

### కరోనాతో బ్రిటిష్ హాస్య నటుడు లార్జ్ మృతి

బ్రిటిష్ నటుడు ఎడ్డీ లార్జ్ (78) కరోనా కారణంగా శుక్రవారం లండన్‌లో కన్నుమూశారు. గుండె పోటు రావడంతో ఆయన ఆస్పత్రిలో చేరారు. అక్కడే ఆయనకు కరోనా సోకింది. మృత్యువుతో పోరాడి, చివరకు గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. హాస్యనటుడిగా 1962లో కెరీర్ ప్రారంభించిన లార్జ్ దాదాపు 28 ఏళ్ల పాటు తన నటనతో ప్రేక్షకుల్ని అలరించారు.

# వైద్యమూ, ధైర్యమూ కాపాడాయి

## 'ఆంధ్రజ్యోతి'తో కరోనాను జయించిన యువకుడి మాట

ఒంగోలు నగరం, ఏప్రిల్ 3 : "కరోనా లక్షణాలు కనిపించగానే కలవరపడొద్దు. ప్రాణాలు పోతాయని కంగారు అసలే వద్దు.. పారిపోవద్దు. ఆస్పత్రిలో చేరండి. పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జి కండి".. కరోనా మహమ్మారిని జయించిన ఒక విజేత అనుభవం ఇది! పాజిటివ్‌గా నమోదై చికిత్స అనంతరం కోలుకుని ఆస్పత్రి నుంచి గురువారం డిశ్చార్జి అయిన ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన 23 ఏళ్ల యువకుడు తన మనోగతాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుతున్నారు. 'లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న నేను గత నెల 10వతేదీన అక్కడి బయల్దేరి 12వతేదీన ఒంగోలు వచ్చాను. నాలుగురోజుల తర్వాత జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు కనిపించాయి. వెంటనే రిమ్స్ వైద్యులను సంప్రదించాను. వారు నన్ను ఐసోలేషన్ వార్డుకు తరలించి పరీక్షలు నిర్వహించారు. గత నెల 18న నాకు పాజిటివ్ వచ్చిందని చెప్పారు. ఒక్కరోజు కాస్త ఆందోళనకు గురయ్యాను. అయితే వైద్యులు మనోధైర్యం కల్పించారు. మందులు, ఆహారం సమయానికి ఇస్తూ చికిత్స అందించారు. క్రమంగా కోలుకొన్నాను. కరోనా మనల్ని ఏమీ చేయదు. తగిన చికిత్స తీసుకుంటే కొద్ది రోజులకే సాధారణ స్థితికి రావచ్చు. ఎవరికైనా కరోనా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలే కానీ కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించ కూడదు. అది ఆ వ్యక్తితోపాటు మన చుట్టుపక్కల ఉన్న మన వారికి, బంధువులకు, సమాజానికి కూడా చేటు తెస్తుంది. కరోనా భయంకరమైన వ్యాధి కాదు. ప్రభుత్వం సూచించిన విధంగా భౌతిక దూరం పాటించటం ద్వారా వైరస్ నుంచి కాపాడుకోవచ్చు. ఇప్పటికే ఆ వైరస్ లక్షణాలు ఉన్నాయనుకునే వారు వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఈ కారణంగానే నేను కొద్ది రోజులకే కోలుకున్నాను" అని తెలిపారు

# 25 పేద దేశాలకు 14 వేల కోట్లు

- ఆర్థిక సాయానికి ప్రపంచబ్యాంకు ఆమోదం
- అత్యధికంగా ఇండియాకే రూ. 7 వేల కోట్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: కరోనా నియంత్రణ చర్యలకు గాను ప్రపంచ బ్యాంకు గురువారం 25 పేద దేశాలకు రూ.14 వేల కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించడానికి ఆమోదం తెలిపింది. ఇందులో అత్యధికంగా రూ.7 వేల కోట్లకు పైగా నిధులను భారత్‌కే కేటాయిస్తున్నట్లు బ్యాంకు అధ్యక్షుడు డేవిడ్ మల్‌పాస్ తెలిపారు. 15 నెలల్లో అన్ని దేశాలకు కలిపి రూ.12.20 లక్షల కోట్లను అందిస్తామన్నారు. కాగా.. కరోనాపై నకిలీ వార్తల కట్టడికి రూ. 49 కోట్లు సమకూరుస్తామని గూగుల్ ప్రకటించింది. ఈ మొత్తాన్ని ఫ్యాక్ట్ చెకర్లకు, నకిలీ వార్తల కట్టడికి కృషి చేస్తున్న ఎన్జీవోలకు అందజేస్తామని తెలిపింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం పీఎం కేర్స్ ఫండ్‌కు తన వేతనం నుంచి రూ. లక్ష విరాళం ఇచ్చారు. ఫ్రీడం ఆయిల్ తయారీదారు జెమినీ ఎడిబల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పీఎం కేర్స్ ఫండ్‌కు రూ. 50 లక్షల విరాళాన్ని ప్రకటించింది.

## వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

తిరుమల, ఏప్రిల్ 3: శ్రీవారి ఆలయంలో శుక్రవారం రాత్రి శ్రీరామ పట్టాభిషేక ఉత్సవం వైభవంగా జరిగింది. సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను రంగనాయకుల మండపానికి తీసుకొచ్చి సర్వాంగ సుందరంగా అలంకరించి విశేష సమర్పణ చేశారు. అనంతరం బంగారు వాకిలి చెంత అర్చక స్వాములు శ్రీరామపట్టాభిషేకాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.



## హంస వాహనంపై జగదభిరాముడు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 3: ఒంటిమిట్టలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజు శుక్రవారం కోదండరాముడు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం సుప్రభాతం, ఆలయ శుద్ధి, ఏకాంత సేవ అనంతరం హంస వాహనంపై సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. రామాలయంలో వాహనాలను ఓ చోట ఉంచి ఉత్సవమూర్తులను వాటిపై కొలువుదీర్చి, ఆగమశాస్త్ర ప్రకారం పూజలు నిర్వహించారు. కోదండరాముడి బ్రహ్మోత్సవాలను రామాలయ ప్రాంగణంలో టీటీడీ అధికారులు, అర్చకుల సమక్షంలో నిరాడంబరంగా నిర్వహిస్తున్నారు.

## ఆలయాల్లోని క్షురకులకు 10వేలు అడ్వాన్స్: వెలంపల్లి



అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో పనిచేస్తున్న క్షురకుల(నాయీబ్రాహ్మణులు, దళితులు)కు రూ.10వేలు అడ్వాన్స్‌గా ఇవ్వనున్నట్లు దేవదాయశాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. లాక్‌డౌన్ వల్ల ఆలయాల్లోకి భక్తులను అనుమతించడం లేదని, దీంతో తలనీలాలు తీస్తూ జీవనం సాగిస్తున్న క్షురకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాష్ట్రంలోని ఎనిమిది ప్రధాన ఆలయాల్లో 517 మంది, 80 చిన్న ఆలయాల్లో 451 మంది క్షురకులు భక్తులకు సేవలందిస్తూ ఉపాధి పొందుతున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తమ కుటుంబాలను ఆదుకోవాలని క్షురకులు దేవదాయశాఖ మంత్రిని కోరారు. వారి అభ్యర్థనపై స్పందించిన మంత్రి రూ.10వేలు ఇవ్వాలని నిర్ణయించారు. పరిస్థితులు చక్కబడిన తర్వాత ఈ మొత్తాన్ని నెలవారీ వాయిదాల్లో ఆలయాలు తీసుకుంటాయని తెలిపారు.

# కరోనా కల్లోలం

## రైతులకు ఇబ్బంది కలగనివ్వం



- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతితో వీసీలో గవర్నర్

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు ఇలాంటి ఇబ్బందీ రానివ్వకుండా తగిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి సిఫారసు చేస్తానని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం విక్రయాల సీజన్ కొనసాగుతున్నందున రైతులకు ఎలాంటి ఇబ్బదులూ లేకుండా చూడాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించగా... గవర్నర్ ఈ మేరకు బదులిచ్చారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య శుక్రవారం అన్ని రాష్ట్రాల గవర్నర్లతో కొవిడ్-19 నియంత్రణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ధాన్యం విక్రయాలు, ఇతర వాణిజ్య పంటల విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా తీసుకుంటున్న చర్యలపై వెంకయ్య ఆసక్తి చూపించారు. గవర్నర్ మాట్లాడుతూ... రైతులు తమ వ్యవసాయ కార్యకలాపాలను చేసుకునేలా కొన్ని పరిమితులతో లాక్‌డౌన్ నుంచి మినహాయింపు ఇచ్చామన్నారు. అయితే భౌతిక దూరం పాటిస్తూ పనులు చేసుకునేలా ప్రచారం చేస్తున్నామన్నారు.

### పెన్షన్ అందకపోయినా వచ్చే నెలలో ఇస్తాం: ద్వివేది

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాజిక పెన్షన్‌దారులు ఈ నెలలో పెన్షన్లు తీసుకోలేకపోతే వారందరికీ వచ్చే నెలలో ఈ నెల పెన్షన్‌తో కలిపి ఇస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది ట్విటర్‌లో ప్రకటించారు. కొంతమంది ఇతర రాష్ట్రాల్లో వారి బంధువుల వద్దకు వెళ్లి ఉండటంతో పెన్షన్లు పొందలేకపోయారని, అలాంటి వారికి వచ్చే నెలలో ఈ పెన్షన్‌తో కలిపి ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు.

### అధికారంలోకి వచ్చినా 420 బుద్ధులే: లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వైద్యులకు కేటాయించిన మాస్కులను వైసీపీ నేతలు దారి మళ్లించారంటూ మీడియాలో వచ్చిన కథనాలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ శుక్రవారం ట్విటర్‌లో స్పందించారు. "జగన్ బాటలోనే వైసీపీ నాయకులు నడుస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా 420 బుద్ధులు వదులుకోలేకపోతున్నారు. వీఐపీలమంటూ వైసీపీ నేతలు వైద్యులకు ఇచ్చిన మాస్కులు కొట్టేయ్యడం దారుణం. వైసీపీ నాయకులు బాగుంటే చాలు... ప్రజలు, వైద్య సిబ్బంది ఏమైపోయినా ఫర్లేదు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఎంతో మంది దాతలు ముందుకొచ్చి ప్రభుత్వానికి సహాయం అందిస్తున్నా ప్రభుత్వం మాత్రం అరకొర నిధులు విడుదల చేయడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కరోనా నివారణకు నిధుల్లేవని అధికారులు లేఖలు రాసే స్థితి వచ్చిందంటే ఎంత ఘోరమైన పరిస్థితి ఉందో అర్థం చేసుకోవచ్చు" అని లోకేశ్ ట్వీట్ చేశారు.

### ఆయుధాలు లేకుండా యుద్ధమా!: పవన్

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):"ఆయుధాలు లేకుండా సైనికులను యుద్ధం చేయమనడం సబబు కాదు. అలాగే ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకుండా వైద్య సిబ్బందిని కరోనాను అరికట్టడానికి వినియోగించడం సరికాదు. వైద్య సిబ్బంది ప్రాణాలతో చెలగాటం ఆడడం న్యాయమా? వైద్య సిబ్బందికి పీపీఈ (పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్)లను అందుబాటులో ఉంచకపోవడం దారుణం" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ వైసీపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

### డిగ్రీ సిలబస్‌లో 'కరోనా': విద్యావేత్తల సూచన

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ మహమ్మారితో పాటు కొత్తగా వ్యాపిస్తున్న అంటువ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా డిగ్రీ సిలబస్‌లో ప్రత్యేక పాఠ్యాంశాన్ని చేర్చాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ప్రస్తుతం డిగ్రీ సిలబస్‌లో కేవలం ఉద్యోగావకాశాల కల్పన, వృత్తివిద్యా నైపుణ్య శిక్షణ ఇవ్వడం వంటి అంశాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతోన్న డిగ్రీ సీబీసీఎస్ కోర్సు స్ట్రక్చర్‌లో 10 ఫౌండేషన్ కోర్సులు ఉన్నాయి. వాటిల్లో ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ ఒకటి. ఈ సబ్జెక్టులో కరోనా వైరస్‌పై అవగాహన కల్పించే విధంగా పాఠ్యాంశాలను చేర్చాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు అంటున్నారు.

### పూర్తి జీతాలు చెల్లించాలి: సీపీఐ రామకృష్ణ

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): "కోత విధించకుండా తక్షణమే ఉద్యోగులకు పూర్తి జీతాలు చెల్లించాలి. గత ఏడాది కన్నా రూ.30 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వద్ద అధికంగా ఉన్నాయని ఉద్యోగ సంఘాల లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వం వద్ద అదనపు నిధులు ఉన్నప్పటికీ వేతనాల్లో కోత విధించడ సరికాదు" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి లేఖ రాసినట్లు ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

### ఉద్యోగులకు పూర్తి జీతం ఇవ్వాలి: సీఎంకు కన్నా లేఖ

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మార్చి నెలకు సంబంధించిన పూర్తి వేతనం చెల్లించాలని ప్రభుత్వానికి బీజేపీ సూచించింది. కరోనా సాకు చూపుతూ ఉద్యోగుల జీతాల్లో కోత పెట్టేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దిగ్భ్రాంతి కలిగించిందని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

### వైద్య సిబ్బందిపై దాడి చేసిన వారిని శిక్షించాలి: కేవీపీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కరోనా బాధితులకు వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బందిపై దాడులకు దిగిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు ప్రభుత్వాన్ని కోరారు. వైద్య సిబ్బంది, ఆస్పత్రులపై జరిగే దాడులకు వ్యతిరేకంగా దేశంలోనే తొలిసారిగా దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 2007లో ప్రత్యేక చట్టం చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

### మాధ్ ద్వీపంలో సిక్కోలు జాలర్లు

- రక్షించాలని కేంద్రానికి, మహారాష్ట్ర సీఎంకు చంద్రబాబు లేఖ

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ముంబై తీరంలోని మాధ్ ద్వీపంలో చిక్కుకున్న 60మంది తెలుగు జాలర్లను వెంటనే రక్షించి, వారి స్వస్థలం శ్రీకాకుళం జిల్లాకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే, కేంద్ర హోంశాఖ కార్యదర్శికి ఆయన వేర్వేరుగా లేఖలు రాశారు. మాధ్ ద్వీపంలో ఉండిపోయిన 60మంది మత్స్యకారుల్లో 48మంది వివరాలను లేఖలో పొందుపర్చారు.

### మానసిక సమస్యలకు ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్

ఏయూ క్యాంపస్ (విశాఖపట్నం), ఏప్రిల్ 3: కరోనా వ్యాప్తి నేపథ్యంలో ప్రజలకు మానసిక సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నదని, వారికి ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చి పరిష్కార మార్గాలు చూపుతామని ఆంధ్ర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు తెలిపారు. తనతోపాటు దేశవ్యాప్తంగా 26 మంది సైకాలజిస్టులు ఉదయం 9నుంచి రాత్రి 9గంటల వరకు, అత్యవసరమైతే 24 గంటలూ అందుబాటులో ఉంటామని, తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఇందుకోసం 9393101813, 9948087331, 9439282343, 9666674944, 9246993099 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### వి.కోటలో ఎమ్మెల్యే లాక్‌డౌన్ ఉల్లంఘన

వి.కోట(చిత్తూరు), ఏప్రిల్ 3: రాష్ట్ర వ్యాప్తంగా కరోనా వ్యాప్తిని నిరోధించేందుకు ప్రభుత్వం లాక్‌డౌన్‌ను అమలు చేస్తోంది. అయితే, అధికార పార్టీకి చెందిన నాయకుడు మాత్రం దీనిని ఉల్లఘించడం, ఓ నిర్మాణానికి ఆఘమేఘాలపై ప్రారంభోత్సవం చేయడం తీవ్ర వివాదానికి దారితీసింది. చిత్తూరు జిల్లా వి.కోటలో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నిర్మించిన కల్వర్టును పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ తన అనుచరులు, మద్దతుదారులతో వచ్చి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధికారులు పాల్గొనడంపైనా విమర్శలు వచ్చాయి. ఇదంతా టీవీ చానెళ్లలో ప్రసారమవడంతో ఎమ్మెల్యే శుక్రవారం కల్వర్టు వద్దకు వచ్చి మీడియాను ఉద్దేశించి 'అమ్మా.. అబ్బకు.. పుట్టి ఉంటే..' అంటూ అసభ్య పదజాలంతో దూషించారు. ఎమ్మెల్యే తీరుపై మీడియా ప్రతినిధులు కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
www.scr.indianrailways.gov.in

టెండరు ప్రకటన నం.B/E.EGS/21/2019-20 తేది: 11.03.2020కు
సవరణ నం.B/E.29/I/EGS/22/2019-20 తేది: 03.04.2020

క్ర.సం. 1. టెండరు నం.:-B/E.29/I/EGS/77/2019-20 తేది: 11.03.2020
ముగింపు తేది: 03.04.2020న 15.00గం.కు.
సవరణ వివరాలు:- పై టెండరు నంబరుకు టెండరు తెరుచుటకు ముగింపు తేది: 03.04.2020 నుండి 20.04.2020వరకు వాయిదా వేయబడినదని గమనించగలరు.
డివిజనల్ రైల్వే మేనేజర్ (ఎలక్ట్రికల్), విజయవాడ
A0462

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్స్ డౌనలోడింగ్ కొరకు వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in దర్శించండి.


## పట్టణాల్లో నిరంతర నిఘా

- పరిశీలన, పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు
- కరోనా కట్టడికి పురపాలక శాఖ ప్రణాళిక

అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో కరోనా వైరస్ కట్టడికి పురపాలక శాఖ ప్రణాళిక రూపొందించింది. కోవిడ్-19 వ్యాప్తి నిరోధం, నియంత్రణ, వ్యాధిగ్రస్థులకు మెరుగైన చికిత్స అందించడం ఇందులో ప్రధానాంశాలు. ఈ ప్రణాళికను రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల కమిషనర్లు, జిల్లా నోడల్ అధికారులు, పర్యవేక్షణాధికారులు, రీజినల్ డైరెక్టర్- అప్పిలేట్ కమిషనర్లందరూ తు.చ. తప్పకుండా పాటించాలని ఆదేశిస్తూ పురపాలక శాఖ కమిషనర్-డైరెక్టర్ విజయ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఈ ప్రణాళిక ప్రకారం.. క్షేత్రస్థాయి నుంచి పై వరకు ఎక్కడికక్కడ పకడ్బందీ పర్యవేక్షణ, పరిస్థితులకు అనుగుణంగా తక్షణమే స్పందించేందుకు మూడు స్థాయిల్లో నిఘా-పరిశీలన, పర్యవేక్షణ బృందాలను నియమిస్తారు. ప్రాథమిక, మాధ్యమిక, పురపాలక ఆరోగ్య-నిఘా బృందాలుగా వీటిని పిలుస్తారు. ఇవి తమకు నిర్దేశించిన ప్రదేశాల్లో ప్రతి రోజూ పర్యటిస్తూ.. కరోనా వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తిస్తాయి. హోం ఐసొలేషన్‌లో ఉన్న వారి వివరాలు, గతంలో వారితో కలసిన వారిని గుర్తించడం, భౌతిక దూరాన్ని ప్రజలు పాటిస్తున్నదీ లేనిదీ నిత్యం గమనిస్తుంటాయి. వారి ఆదేశాలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకుంటా యి. ప్రాథమిక బృందాలకు ఒక్కొక్క వార్డు సచివాలయ ప్రాంతాన్ని పరిధిగా నిర్ణయించారు. మాధ్యమిక బృందాలకు.. ఎన్నికలు జరగబోతున్న వార్డు ఏరియాను నిర్దేశించారు. గ్రేటర్ విశాఖ, విజయవాడ, గుంటూరు నగర పాలక సంస్థల్లో ఒక్కో డివిజన్‌కు ఒక్కో మాధ్యమిక బృందాన్ని నియమిస్తారు. ఇతర నగర పాలక సంస్థల్లో రెండేసి డివిజన్లకు ఒకటి.. పురపాలక సంఘాల్లో 3 నుంచి 5 వార్డులకు ఒకటి చొప్పున ఉంటాయి. ఇక పురపాలక ఆరోగ్య-నిఘా బృందాలకు సంబంధిత మున్సిపాలిటీ మొత్తాన్నీ పరిధిగా నిర్ణయించారు. ప్రాథమిక బృందాల్లో వార్డు ఆరోగ్య కార్యదర్శి, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, వార్డు వలంటీర్లు, 'మెప్మా' రిసోర్స్ పర్సన్లు (మురికి వాడల కోసం), స్పెషల్ షెల్టర్ సెంటర్లు, మురికివాడల నోడల్ ఆఫీసర్లు సభ్యులుగా ఉంటారు. మాధ్యమిక టీముల్లో డాక్టర్, హౌస్ సర్జన్ (అవసరమైన పక్షంలో), పారా మెడికల్ ఉద్యోగులు, వార్డు కోఆర్డినేటర్లు (ప్రధానంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు) ఉంటారు. పురపాలక ఆరోగ్య-నిఘా బృందాల్లో మున్సిపల్ కమిషనర్, డీఎంహెచ్‌వో డిప్యూట్ చేసిన ప్రోగ్రాం ఆఫీసర్- సీనియర్ డాక్టర్, సబ్ కలెక్టర్- ఆర్డీవో- తహసిల్దార్, డీఎస్పీ- సీఐలు సభ్యులు. ఈ టీముల వివరాలను వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలందరికీ తెలియజేస్తారు.

# రైతు గోడు పట్టదా?

ధాన్యం, పండ్లు ఎక్కడివక్కడే.. రైతులు తల్లడిల్లుతున్నారు.. ఖరీఫ్ దిగుబడిలో 30% వారి వద్దే

- ఆదుకోవడానికి ఇకనైనా యంత్రాంగాన్ని కదిలించాలి
- ముఖ్యమంత్రికి చంద్రబాబు లేఖ
- పోలీసులు సంయమనం పాటించాలి
- టీడీపీ అధినేత సూచన



అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో ధాన్యం.. తోటల్లో పండ్లు.. కళ్ల ముందే నిలిచిపోవడం చూసి రైతులు తల్లడిల్లుతున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. వారిని ఆదుకోవడానికి తక్షణం ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిలించాలని ముఖ్యమంత్రి జగన్‌కు శుక్రవారం లేఖ రాశారు. 'రబీలో 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఖరీఫ్ ధాన్యంలో 30 శాతం ఇంకా రైతుల వద్దే ఉండిపోయింది. వరి కోత యంత్రాల అద్దెలు బాగా పెరిగిపోయాయి. ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలి. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో పట్టుగూళ్ల సాగు చేసే రైతులకు ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి లక్షన్నర వరకూ నష్టంవచ్చే పరిస్థితి ఏర్పడింది. ప్రకాశం జిల్లాలో 78 మిలియన్ కిలోల పొగాకు నిల్వలు పేరుకుపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో పడిపోయింది. ప్రభుత్వం ప్రకటించిన ధరలు ఒక్క చోట కూడా లభించడం లేదు. తక్షణం ఫీడ్ అందుబాటులోకి తేవడంతోపాటు ఆక్వా ఉత్పత్తులకు సరైన ధర వచ్చేలా చూడాలి. అరటి, బొప్పాయి ధరలు పడిపోయాయి. మామిడి కోయడానికి కూలీలు లేక రవాణా లేక మార్కెట్లు మూతపడి రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. టమాటాకు కిలోకు రూ.రెండు కూడా రావడం లేదు. చీనీ, పుచ్చ, కర్బూజ వంటి రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. వీరందరిని ప్రభుత్వం ఆదుకోవాలి' అని అందులో కోరారు.

### నిర్వీర్యం చేసిన జోనే..

టీడీపీ హయాంలో పెట్టారన్న కారణంతో నిర్వీర్యం చేసిన విశాఖ మెడ్ టెక్ జోనే ఇప్పుడు దిక్కయిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'దేశంలో మొట్టమొదటి మెడ్‌టెక్ జోన్‌గా దీనిని ఏర్పాటు చేశాం. సూది నుంచి సీటీ స్కానింగ్ యంత్రం తయారీ వరకూ వంద సంస్థలను దీనిలో నెలకొల్పాం. కానీ ఈ ప్రభుత్వం గత 11 నెలలుగా దీనిని నిర్లక్ష్యం చేసింది. ఒక్క మన రాష్ట్రంలోనే వైద్య సిబ్బందికి 30 వేల వ్యక్తిగత రక్షణ పరికరాలను సమకూర్చాల్సి ఉంది. వాటిని కూడా తయారు చేసే అవకాశం ఈ జోన్‌లో ఉంది. ఇప్పటికైనా దీనిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవడానికి ప్రభుత్వం ముందుకు రావాలి' అని సూచించారు. లాక్‌డౌన్‌తో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడిందని.. దానిని సొమ్ము చేసుకోవడానికి కొందరు దళారులు, వ్యాపారులు బ్లాక్ మార్కెట్ విక్రయాలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని అన్నారు. ప్రజలకు ఇళ్ల వద్దే నిత్యావసరాలు, కూరగాయలు, పండ్లు చౌక ధరలకు అందించాలని, ఇందుకు ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలని సూచించారు. దేశమంతా విపత్కర పరిస్థితుల్లో ఉంటూ రాష్ట్రంలో ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాల మాఫియా తన కార్యకలాపాలు ఆపలేదని మర్శించారు. లాక్‌డౌన్‌కు ప్రధాని పిలుపు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇసుక తవ్వకాలకు అనుమతి ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందని, ద్విచక్ర వాహనాలపై తిరిగేవారిని ఆపేసుతన్న పోలీసులు.. వందల లారీల్లో వెళ్తున్న ఇసుక, గ్రావెల్, మట్టిని ఎందుకు ఆపడం లేదని నిలదీశారు. లాక్‌డౌన్ సమయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, అదే సమయంలో పోలీసులు కూడా సంయమనం పాటించాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

### ఉపద్రవంలోనూ కాసుల పంట

- ప్రజారోగ్యం కన్నా వైసీపీ నేతలకు ఆదాయ ఆర్జనే ముఖ్యమైంది
- బాబు వీడియో కాన్ఫరెన్స్‌లో టీడీపీ నేతలు

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): "కరోనా ఉపద్రవంలోనూ వైసీపీ నేతలు కాసుల పంట పండించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కృష్ణా, తూర్పు గోదావరి, చిత్తూరు జిల్లాల్లో అధికార పార్టీ నేతలు ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ మైనింగ్, రవాణాలో మునిగి తేలుతున్నారు. వారికి ప్రజారోగ్యం కంటే ఆదాయ ఆర్జనే ముఖ్యంగా మారింది" అని టీడీపీ నేతలు విమర్శించారు. ఆ పార్టీ అధినేత చంద్రబాబు శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నేతలు ఈ విమర్శ చేశారు. రేషన్, పింఛను పంపిణీలనూ వైసీపీ నేతల చేతుల మీదుగా వలంటీర్లు చేస్తున్నారనీ, నిబంధనలు వారికి పట్టడం లేదని విమర్శించారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో కాన్పు నిరాకరించిన ఘటనను మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ హిదాయత్ చెప్పారు. కరోనా పేరుతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు సాధారణ సేవలు నిలిపివేయడం సరికాదని, దీనిపై అధికారులతో మాట్లాడాలని పార్టీ నేతలకు చంద్రబాబు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా వరి కోత యంత్రాల కొరత, ధాన్యం కొనుగోళ్ళ సమస్యలను టీడీఎల్పీ ఉప నేత అచ్చెన్నాయుడు వివరించారు. ప్రకాశం జిల్లాలో పొగాకు కొనుగోలు సమస్యపై పార్టీ సీనియర్ నేత నూకసాని బాలాజీ వివరించారు. ఉద్యానవన పంటల కొనుగోళ్ళ సమస్యలను రాయలసీమ నేతలు తెలిపారు.

## అడుగడుగునా ఒప్పందాల ఉల్లంఘన!



- కరోనా కంటే అధికారంలో ఉన్న మానసిక రోగితో ప్రమాదం
- 108వ రోజు కొనసాగిన అమరావతి రైతుల ఆందోళనలు



గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ కంటే.. అధికారంలో ఉన్న మానసిక రోగితోనే ఈ సమాజానికి ఎక్కువ ప్రమాదమని అమరావతి ప్రాంత రైతులు అన్నారు. ఈ ప్రభుత్వం తమతో చేసుకున్న ఒప్పందాలను అడుగడుగునా ఉల్లంఘిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతిని ఏకైక రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఇక్కడి రైతులు చేస్తున్న ఆందోళనలు 108వ రోజూ కొనసాగాయి.

### ఇంటింటా మార్మోగిన నినాదాలు..

కరోనా వ్యాప్తి నివారణలో భాగంగా ఆంక్షలు అమలవుతున్నాయి. దీంతో రైతులు ఎవరి ఇంట్లో వారు కూర్చొని అమరావతి రాజధానిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సమేతంగా ఆందోళన కొనసాగించారు.

### వార్తా ప్రసారాల్లో కనిపిస్తే ఖబర్దార్..

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల్లో భాగంగా రాజధాని గ్రామాల్లో ఆంక్షలు శుక్రవారం మరింత కఠినతరం చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసు అధికారులు కరోనా వ్యాప్తి పెరిగిపోతున్న తరుణంలో ఉద్యమం కొనసాగించడం సరికాదన్నారు. వార్తప్రసారాల్లో, వార్తా పత్రికల్లో కనపడిన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

### కొనసాగించిన 'అమరావతి వెలుగు'

రాజధానిపై ప్రభుత్వ తీరు మార్చుకోవాలంటూ రాత్రి 7.30 గంటలకు విద్యుత్ నిలిపి కొవ్వుతులు వెలిగించి 'అమరావతి వెలుగు' పేరిట రాజధాని మహిళలు చేస్తున్న నిరసన ప్రదర్శన శుక్రవారం కూడా కొనసాగింది. రాత్రి 7.30 నుంచి 7.35 వరకు గ్రామ కూడళ్లల్లో మహిళలు, రైతులు కొవ్వొత్తులు పట్టుకొని నిలబడి 'జై అమరావతి' నినాదాలు చేశారు.

## వాళ్లని వీధుల్లోనే వదిలేద్దామా?



- ఉండటానికి గూడేలేని పట్టణ పేదలు
- కరోనాకాలంలో ఈ దీనులకు రక్షణేది?
- నైట్ షెల్టర్లుంటే కొంతమేరకు ఊరట
- సర్కారు నిర్లక్ష్యంతో ఆ నీడ అంతంతే
- ఉన్న దగ్గరా కనీస వసతులూ కరువు
- మంత్రి చెప్పినా కదలని అధికారులు

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ కాలంలో సామాజిక దూరం పాటిస్తూ ఇళ్లలో ఉంటే చాలు! కరోనాపై యుద్ధం చేసినట్టే! గడప దాటకపోవడమే దేశానికి మనం చేసే సేవ! ఇంత వరకు నయమేగానీ, అసలు గూడే లేని వేలాది మంది పట్టణ పేదలు పరిస్థితి ఏమిటనేది ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది. అటు రాజ భవంతుల్లాంటి వాటిల్లో ఉండే వారికీ, ఇటు ఓమాదిరి, సామాన్య గృహాల్లో నివసించే వారికీ కరోనా సోకుతోంది. ఈ పరిస్థితుల్లో అసలు ఎలాంటి నీడా లేని పట్టణ నిరాశ్రయుల రక్షణ ఎలాగనేది ఆందోళన రేపుతోంది. ఇప్పటిదాకా వారిపై కరోనా పంజా పడలేదు. భవిష్యత్తులోనూ పరిస్థితి ఇలాగే ఉంటుందని చెప్పలేమని, ఒక వేళ అదే జరిగితే చోటుచేసుకొనే నష్టం అపారంగా ఉంటుందని వైద్య నిపుణులు ఆందోళన చెందుతున్నారు. కానీ, దీనిపై ముందే అప్రమత్తం చేయాల్సిన పురపాలక శాఖ మాత్రం ఆ విషయమే పెద్దగా పట్టనట్టు వ్యవహరిస్తున్నదన్న విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రంలో నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు కలిపి మొత్తం 110 పట్టణ స్థానిక సంస్థలు (యు.ఎల్.బి.) ఉన్నాయి. వీటిల్లో కొన్ని వేలమంది నిరాశ్రయులు నివసిస్తుంటారు. ఆదాయం అంతంతమాత్రమే కావడంతో వలస వచ్చిన వారిలో పలువురితోపాటు భిక్షకులు, అనాథల్లో అత్యధికులకు రోడ్లే ఆవాసం. అసలే పోషకాహారం లేక అల్లాడే వీరు సహజంగానే పలు వ్యాధులకు చాలా సులభంగా గురవుతారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని పట్టణ నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించి, వారు కూడా ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందాలన్న లక్ష్యంతో కేంద్రం 'అర్బన్ నైట్ షెల్టర్ల'ను దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో నెలకొల్పేలా చూసింది. ప్రతి పట్టణంలోనూ ఏర్పాటు చేయాలని కేంద్రం సూచించిన ఒక్కో షెల్టర్‌లో కనీసం 30 మంది నుంచి 60, 70 మందికి ఆశ్రయం కల్పించాలన్నది యోచన. కానీ, మన రాష్ట్రంలో 110 యూఎల్‌బీలు ఉంటే.. వాటి పరిధిలో దాదాపు 60 మాత్రమే నైట్ షెల్టర్లున్నాయి. పోనీ ఉన్నవైనా బాగున్నాయా అంటే అదీ లేదు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఏమాత్రం లేనందున ఈ షెల్టర్లలో కనీస వసతులు గానీ, పారిశుద్ధ్యంగానీ, భద్రతగానీ కాగడా వేసి వెతికినా కనిపించవు. ఇక అన్నార్థులకు అందించాల్సిన ఆహారం గురించి చెప్పాల్సిన పనే లేదు. దీంతో ఒక్కసారి ఈ షెల్టర్లలో ఉన్న వారు ఆ తర్వాత మళ్లీ వాటి వైపు చూస్తే ఒట్టు! అవసరమైతే దోమలు, అపరిశుభ్రతతో నిండి నిద్రకు ఏమాత్రం అనుకూలంగాని దుర్భర ప్రదేశాల్లోనైనా గడుపుతారే తప్ప ఈ నైట్ షెల్టర్లు 'మాకొద్దు బాబాయ్' అని దండాలు పెడుతున్నారు. రాష్ట్ర పురపాలక శాఖ ఉన్నతాధికారులకు ఏ నగరం లేదా పట్టణంలో ఈ నైట్ షెల్టర్లు ఎక్కడ ఉన్నాయనే విషయమే తెలియకపోవడం ఈ వ్యవహారంలో అసలు కొసమెరుపు!

### షెల్టర్లపై బొత్సకు తలో సంఖ్య!

కొన్ని నెలల క్రితం నైట్ షెల్టర్లపై మంత్రి బొత్స సత్యనారాయణ సమీక్షించారు. విజయనగరంలో నెట్ షెల్టర్ ఎక్కడ ఉందని బొత్స ప్రశ్నించారు. దీనిపై అధికారులు వేర్వేరు సమాధానాలిచ్చారు! ఇదే పరిస్థితి ఇతర నగరాలు, పట్టణాల్లోని నైట్ షెల్టర్ల గురించి ప్రశ్నించినప్పుడూ ఎదురైంది! దీంతో మంత్రి దీనిపై దృష్టి సారించాలని, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ అక్కడికక్కడే ఆదేశించారు.

## లాఠీ భయంతో ఆగిన గుండెలు

**పోలీసులు వస్తున్నారని పరుగెడుతూ.. పశ్చిమలో ఇద్దరు వ్యక్తులు గుండెపోటుతో మృతి**

పాలకొల్లు/గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 3: కరోనా లాక్‌డౌన్ నిబంధనలు అతిక్రమిస్తున్నవారు పోలీసుల భయంతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. పశ్చిమ గోదావరిజిల్లాలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు వస్తున్నారనే భయంతో పరుగెడుతూ శుక్రవారం ఇద్దరు వ్యక్తులు గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయారు. పాలకొల్లులోని ఎల్ఆర్ పేటలో ఉదయం 8-30 గంటలకు టిఫిన్ దుకాణం తెరచి ఉందన్న సమాచారంతో పోలీసులు సైరన్ మోగించుకుంటూ అటుగా వచ్చారు. పోలీసులు రావడం చూసి, టిఫిన్ చేస్తున్న వారు పరుగెత్తారు. యాండ్ర రామాంజనేయులు(57) సమీపంలోని కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలోకి పరుగెత్తి మెట్ల వద్ద ఆయాసంతో కింద కూర్చున్నారు. కొద్ది సేపటికే ఆయన గుండెపోటుతో మృతి చెందారు. మరోఘటనలో కరోనా కర్ఫ్యూలో భాగంగా చింతలపూడి మండలం వెంకటాపురానికి పోలీసులు వెళ్లారు. రామాలయం వద్ద కూర్చున్న రైతులు పరుగుదీయగా పసుపులేటి భాస్కరరావు(55) ఒక ఇంట్లోకివెళ్లి స్పృహ తప్పి పడిపోయారు. చింతలపూడి ఆసుపత్రికి తీసుకురాగా మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు.

### విజయనగరంలో వినూత్న దండన

దుకాణాలు తెరిచిన వ్యాపారులతో విజయనగరంలో మొదటి హెచ్చరికగా కరోనా నిబంధనలు తెలిపే ప్లకార్డులు పోలీసులు పట్టించారు.

## నిత్యావసరాల వాహనాలకే అనుమతి

- బాపట్ల ఘటనపై విచారణ : డీజీపీ

విజయవాడ/జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సరిహద్దు రాష్ట్రాల్లో నుంచి అత్యవసర, నిత్యావసర వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నామని రాష్ట్ర డీజీపీ గౌతం సవాంగ్ చెప్పారు. రాష్ట్ర సరిహద్దు గరికిపాడు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి నుంచే శ్రీకాకుళం, నాగార్జున సాగర్, పలమనేరు, విజయనగరం, సాలూరు, ఇచ్ఛాపురం, తూర్పుగోదావరి, కర్నూలు, అనంతపురం చెక్‌పోస్టుల్లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఢిల్లీలోని సమావేశంలో పాల్గొన్న వారి కారణంగానే సమస్య పెద్దదైందని, వారిని గుర్తించటంతోపాటు వారితో సంచరించిన వారిని కూడా గుర్తించి క్వారంటైన్ చేస్తున్నామన్నారు. బాపట్లలో పోలీసులు కొట్టిన నేపథ్యంలో ఓ యువకుని ఆత్మహత్య ఉదంతంపై విచారణ జరుగుతోందని, నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



గరికపాడు చెక్‌పోస్టు వద్ద ఆరా తీస్తున్న డీజీపీ

## 14 నుంచి ధాన్యం కొనుగోళ్లు

- మధ్యాహ్నం ఒంటిగంటవరకు వ్యవసాయ పనులకు అనుమతి
- మంత్రుల బృందం నిర్ణయం

అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రైతాంగాన్ని ఆదుకునేందుకు గ్రామాల్లో ఈ నెల 14వ తేదీ నుంచే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని మంత్రుల బృందం నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. కరోనా నియంత్రణపై ఆళ్లనాని నేతృత్వంలో ఏర్పాటైన మంత్రుల బృందం శుక్రవారం ఇక్కడి ఆర్ అండ్ బీ భవనంలో సమావేశమై కరోనా నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, లాక్‌డౌన్ అమలు, నిత్యావసరాల పంపిణీ వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సత్వర వైద్యపరీక్షల నిర్వహణకోసం ర్యాపిడ్ టెస్టింగ్ పరికరాలు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. రేషన్ దుకాణాల వద్ద రద్దీని తగ్గించేందుకు ఇంటింటికి కూపన్‌లు ఇవ్వాలని నిర్ణయించారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు వ్యవసాయ పనులకోసం అనుమతించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## మరో తప్పుడు నిర్ణయం

దేశం యావత్తూ కరోనా భయంలో నిండా మునిగి, ఇళ్ళకు పరిమితమై ఉన్న కాలంలో, కశ్మీర్ విషయంలో కేంద్రం మరో అడుగు ముందుకు వేసి, స్థానికత నిర్వచనాన్ని తిరగరాసింది. మొన్నటివరకూ ఆ రాష్ట్రం చట్టాల్లో ఉన్న 'పర్మెనెంట్ రెసిడెన్స్' అన్న పదాన్ని కేంద్రం బుధవారం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ 'డొమిసైల్'గా మార్చింది. జమ్మూకశ్మీర్‌లో ఎవరైతే పదిహేనేళ్ళకు పైబడి నివసిస్తారో వారంతా ఇకపై స్థానికులే. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ ఉద్యోగులు, బ్యాంకులు ఇత్యాది సంస్థల్లో రాష్ట్రంలో పదేళ్లు పనిచేస్తే చాలు, వారు స్థానికులు కావడంతో పాటు వారి పిల్లలకు కూడా ఆ హోదా సహజంగానే దఖలుపడుతుంది. ఇలా గతంలో పనిచేసిన వారు కూడా స్థానికతను పొందవచ్చు. దేశంలోని మిగతా ప్రాంతాలకు చెందిన విద్యార్థుల విషయంలో కేంద్రం మరింత ఉదారంగా వ్యవహరించింది. ఏడేళ్ళపాటు అక్కడ చదువుకొని, పది లేదా పన్నెండో తరగతి పరీక్ష రాస్తే చాలు వారికి స్థానికత చేకూరుతుంది. ఈ గెజిట్ నోటిఫికేషన్ చూడగానే కశ్మీర్ నాయకులు చాలామందికి పాలస్తీనా విషయంలో ఇజ్రాయెల్ అనుసరించిన వ్యూహం గుర్తొచ్చింది.

ఎనిమిదినెలల క్రితం కశ్మీరీలతో, వారి నాయకులతో ఎటువంటి సంప్రదింపులు చేయకుండా, రాష్ట్రాన్ని ఒక్కసారిగా సైన్యంతో దిగ్బంధించి 370 అధికరణను, ఆర్టికల్ 35–ఎ ను రద్దుచేస్తూ దానిని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చివేసిన గాయం ఇంకా మానకముందే కేంద్రం తీసుకున్న ఈ కొత్త నిర్ణయాన్ని కశ్మీరీ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఆగ్రహంతో ఉన్న ప్రజలు లాక్‌డౌన్ కారణంగా రోడ్లమీదకు రావడం లేదు కానీ, సామాజిక మాధ్యమాల ద్వారా ఈ నిర్ణయాన్ని తప్పుబడుతున్నవారిని మాత్రం పోలీసులు వెంటాడుతున్నారు. ఏడాది క్రితం వరకూ ఈ రాష్ట్రంలో బయటివారికి ఇక్కడి ఉద్యోగాలు అందుకొనే, భూములు పొందే అవకాశం లేని విషయం తెలిసిందే. మహారాజా హరిసింగ్ కాలం నాటి చట్టాలతో స్థానికతను నిర్వచించుకొనే హక్కు కూడా దానికే ఉండేది. కేంద్రపాలిత ప్రాంతంగా అవతరించిన తరువాత, స్థానికతను తిరగరాసిన ఈ కొత్త నోటిఫికేషన్‌తో దేశంలోని అన్ని ప్రాంతాలవారూ క్రమంగా కశ్మీర్‌లో స్థిరపడేందుకు వీలుపడుతుంది. కశ్మీరీలకు నాలుగోతరగతి ఉద్యోగాల్లో మాత్రమే కోటా ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం. పోలీసు డిపార్టుమెంట్‌లో కానిస్టేబుల్ మినహా మిగతా పై స్థాయి ఉద్యోగాలు, కశ్మీర్ యూనివర్సిటీల్లో హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, డీన్‌లు, ప్రభుత్వ సెక్రటరీలు ఇంకా ఇలా అనేకానేక పదవులు ఇక బయటివారికే దక్కుతాయని అర్థం. ఒక్కముక్కలో చెప్పుకోవాలంటే, ఇంతకాలం కశ్మీరీలకే పరిమితమైన సర్కారీ వ్యవస్థలో ఇకపై స్థానికేతరులు నిండిపోవడానికి ఇది వీలుకల్పిస్తుంది. ఇక వలసదారులు పునరావాస కమిషనర్ వద్ద తమ పేర్లు రిజిస్టర్ చేసుకుంటే చాలు, కాలానికి సంబంధించిన పరిమితులేవీ వారికి వర్తించవు. ఇది ప్రధానంగా కశ్మీరీ పండిట్లను దృష్టిలో ఉంచుకొని చేసిన సవరణ అంటున్నారు.

మానసికంగా ఎంతో దెబ్బతిని ఉన్న కశ్మీరీలమీద ప్రభుత్వం ప్రయోగించిన మరో అస్త్రం ఇది. 370 అధికరణ రద్దుతో ఇక, వెలుపలి వారిని తరలించే పని ఆరంభమవుతుందనీ, తమ భూములు, వనరులు, ఉద్యోగాలు వారు తన్నుకుపోయి స్థానికులను మైనారిటీలను చేసే కుట్ర జరుగుతుందని కశ్మీరీలు అనుమానించారు, భయపడ్డారు. కానీ, కశ్మీరీలకు వాస్తవాలు విప్పి చెప్పి, ఓదార్పు అందించే పేరిట కేంద్రమంత్రులు వరుసపెట్టి అక్కడ పర్యటనలు చేసి, అటువంటి దుష్ప్రచారాలు ఎంతమాత్రం నమ్మవద్దన్నారు. స్థానికత చట్టాలను తిరగదోడేది లేదనీ, ఎప్పటికీ కశ్మీరీలే స్థానికులని చెప్పివచ్చారు. కశ్మీరీలు ఆ హామీలు నమ్మినా లేకున్నా ఇప్పుడు ప్రభుత్వం చేసింది మాత్రం నమ్మకద్రోహమే. గతంలో స్థానికతను ధృవీకరించే అధికారం జిల్లా మేజిస్ట్రేట్‌కు మాత్రమే ఉంటే, ఇప్పుడు తహసీల్దార్ కూడా దానిని కట్టబెట్టారు. నాలుగో తరగతి ఉద్యోగాల్లో కోటా వినా, మిగతా అన్ని స్థాయి ఉద్యోగాల్లోనూ తాము అవకాశాన్ని కోల్పోవడం కశ్మీరీలకు ఆగ్రహాన్ని కలిగించక మానదు. కశ్మీర్ ఇంతకాలమూ ఎంతో కోల్పోయిందని ప్రసంగాలు దంచి, ఆగస్టు 5 నిర్ణయం వారి శ్రేయస్సు కోసమేనని నమ్మబలికిన కేంద్రపాలకులు, ఇప్పుడు రాష్ట్ర నాయకులంతా నిర్బంధంలో ఉండగా తీసుకున్న ఈ కొత్త నిర్ణయంతో తమ గత చర్యలన్నీ కశ్మీరీల ప్రయోజనం కోసం కాదని తేల్చిచెప్పేశారు. ఉన్న ఆ కాస్తంత సానుకూలత కూడా తుడిచిపెట్టేశారు.

## ఖైదీలందరినీ విడుదల చేయాలి

కరోనా వైరస్ నుంచి పౌరుల జీవించే హక్కును కాపాడటానికి ప్రభుత్వం ప్రజలందరినీ స్వీయ నిర్బంధంలోకి తీసికెళ్లింది. ఇది ప్రత్యేక పరిస్థితి. జీవించే హక్కులో అంతర్భాగమైన స్వేచ్ఛ ప్రధానమా, లేక జీవించడం ప్రధానమా? అంటే.. బతికుంటేనే స్వేచ్ఛ కదా! అనే వాదన దిశగా ప్రభుత్వం కరోనా నియంత్రణ చర్యలు తీసుకుంటోంది. దీని న్యాయాన్యాయాలతో సంబంధం లేకుండా ఇది ఇప్పటి అవసరమని ప్రజలంతా కట్టుబడ్డారు. ప్రభుత్వం పాటిస్తున్న ఈ సూత్రాన్ని ఖైదీలకు కూడా అన్వయించాలి. నేరారోపణలతో స్వేచ్ఛను నియంత్రించి నిందితులను ప్రభుత్వం జైళ్లలో పెట్టింది. ఆధారాలు ఉన్నా లేకున్నా కేవలం నేరారోపణలతోనే జైళ్లలో ఎందరో ఉన్నారు. అలాగే శిక్షలు అనుభవిస్తున్న వాళ్లూ జైళ్లలో ఉన్నారు. స్వేచ్ఛకన్నా బతుకు ముఖ్యమని ప్రభుత్వం ఈ సందర్భంలో అనుకున్నట్లయితే ఖైదీలను ప్రత్యేకంగా నిర్బంధించాల్సిన అవసరం లేదు. జైళ్లలో ఖైదీలకు కరోనా అంటుకోకుండా నిరోధించడం సాధ్యం కాదు. ఒకవేళ జైళ్లలో కరోనా సోకితే రిమాండ్ ఖైదీలు, శిక్షపడిన ఖైదీలు, జైలు సిబ్బంది వ్యాధిగ్రస్తులవుతారు. భారీ ఎత్తున చనిపోతారు. అట్లాగే వైరస్ కూడా ప్రబలిపోతుంది.

మన దేశంలో జైళ్ల సామర్థ్యానికి మించి 114 శాతం అధికంగా ఖైదీలు ఉన్నట్లు 2019 నాటి భారతీయ న్యాయ నివేదిక స్పష్టం చేస్తోంది. ఈ సగటు లెక్క ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగా ఉంది. ఒకేచోట ఇంత సాంద్రతతో మనుషులు నిర్బంధంలో ఉండటం ఇప్పుడెంత ప్రమాదమో చెప్పనవసరం లేదు. జైలు సామర్థ్యానికి తగినట్లే ఖైదీలు ఉన్నా అక్కడి వాతావరణం వాళ్ల జీవించే హక్కుకు విఘాతం కలిగిస్తుంది. ఖైదీలు కూడా దేశ ప్రజలే. ప్రభుత్వం కరోనా బారి నుంచి ప్రజల బతుకు విషయంలో తీసుకొనే జాగ్రత్తలు ఖైదీలకు కూడా వర్తింపజేయాలి. కాబట్టి కరోనా సమస్య పూర్తిగా తీరే వరకు వారిని బైటనే ఉంచాలి. ఆ తర్వాతనే న్యాయ, శిక్షా ప్రక్రియలను కొనసాగించాలి.



రాజకీయ ఖైదీల విషయంలో కూడా ఇదే వైఖరి తీసుకోవాలి. మావోయిస్టు రాజకీయ సంబంధమైన ఆరోపణలతో దేశంలో ఎందరో జైళ్లలో ఉన్నారు. వీళ్లలో ఎక్కువమంది రాజకీయ భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసిన కారణంగానే నిర్బంధాన్ని అనుభవిస్తున్నారు. మానవ జాతినే సవాలుచేసే ముప్పు ముంచుకొచ్చిన కరోనా సందర్భంలో రాజకీయాలకు అతీతంగా మనుషులందరం కలిసి దీనిని ఎదుర్కోవాలని ప్రభుత్వాలు చెబుతున్నాయి. సిఎఎ వంటి ప్రభుత్వ చట్టాలను వ్యతిరేకించిన వాళ్ళ దగ్గరి నుండి భీమాకొరేగావ్ కేసులో నిందితులుగా ఉన్న తొమ్మిది మంది వరకు ఎంతో మంది రాజకీయాల కారణంగానే జైళ్ళలో ఉన్నారు. వీరిలో వరవరరావు ఎనభై ఏళ్ల వయోభారంతో ఏడాదిన్నరగా జైలులో ఉన్నారు. ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి వారికి కరోనా ముప్పు ఎక్కువ. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొనే ప్రపంచ ఆరోగ్య సంస్థ ఖైదీలందరినీ విడుదల చేయాలని ప్రపంచ దేశాలకు సిఫారసు చేసింది. ఇందులో భాగంగానే మనదేశంలోని కొన్ని రాష్ట్రాలు ఖైదీలను విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశాయి. సుప్రీంకోర్టు కూడా ఖైదీలను విడుదల చేసే విషయమై రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అయితే అందులో ఏడు సంవత్సరాల లోపు శిక్ష పడిన ఖైదీలను, ఏడు సంవత్సరాల లోపు శిక్షా నేరాలు ఆరోపించబడిన అండర్ ట్రయల్ ఖైదీలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పడం వల్ల ఈ పరిధిలోకి సాయిబాబా గాని, భీమా కోరేగాం నిందితులు గానీ, దేశవ్యాప్తంగా ఊపా కింద అరెస్టు కాబడిన వందలాది రాజకీయ ఖైదీలు గానీ వచ్చే అవకాశం లేదు. అంటే ఈ విపత్తు సమయంలో కూడా రాజకీయ కక్ష సాధింపు కొనసాగుతుంది.

> *మన దేశంలో జైళ్ల సామర్థ్యానికి మించి 114 శాతం అధికంగా ఖైదీలు ఉన్నట్లు 2019 నాటి భారతీయ న్యాయ నివేదిక స్పష్టం చేస్తోంది. ఒకేచోట ఇంత సాంద్రతతో మనుషులు నిర్బంధంలో ఉండటం ఇప్పుడు కరోనా సమయంలో ఎంత ప్రమాదమో చెప్పనవసరం లేదు.*

ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో కోర్టుల్లో విచారణ కూడా సాగడం లేదు కాబట్టి, రిమాండ్ ఖైదీలను జైళ్లలో ఉంచడమంటే వాళ్లను కరోనా వైరస్‌కు అప్పగించినట్లే. వాళ్లు నేరం చేశారని నిర్ధారించకముందే వాళ్లను శిక్షించినట్టు అవుతుంది. తెలంగాణలో విప్లవ రచయితల సంఘం కార్యదర్శి, రచయిత కాశీం సహా గత ఆర్నెల్లలో అరెస్టు చేసిన రచయితలు, మేధావులు, ప్రజా సంఘాల బాధ్యులకు సంబంధించిన బెయిళ్ల విచారణ కూడా సాధ్యం కాదు. ఇది న్యాయ సూత్రాలకు కూడా విరుద్ధం. కాబట్టి వారి జీవించే హక్కును కాపాడటానికి తక్షణం జైళ్ల నుంచి విడుదల చేయాలి. ఈ సూత్రం కేవలం రిమాండ్ ఖైదీలకే కాకుండా కింది కోర్టుల్లో శిక్షపడి అప్పీలు తేలకుండా జైళ్లలో ఉన్న ఖైదీల విషయంలోనూ వర్తిస్తుంది. ప్రొ.సాయిబాబా తీవ్ర అనారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కరోనా బెడద తీరేదాకా జైలు నుంచి గృహ నిర్బంధానికి తరలించాలి. దేశ ప్రజలందరూ కరోనా విపత్తు వల్ల గృహ నిర్బంధంలో ఉన్న స్థితిలో ఖైదీలను కూడా ఇళ్ళకు పరిమితం చేయవచ్చు. ఈ దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. న్యాయస్థానాలు కూడా ఇందులో జోక్యం చేసుకొని అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

*ప్రొఫెసర్ హరగోపాల్, ఊసా, ఖాదర్ మొహియుద్దీన్, కె.శ్రీనివాస్, ఎన్.వేణుగోపాల్, యాకూబ్, శిలాలోలిత, కుప్పిలి పద్మ, పాశం యాదగిరి, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, తెలకపల్లి రవి, కె.శివారెడ్డి, నామాడి శ్రీధర్, ఎస్.కాత్యాయని, గుంటూరు లక్ష్మీనరసయ్య, బమ్మిడి జగదీశ్వరరావు, కాసుల లింగారెడ్డి, సిద్ధార్థ కట్టా, వై.కరుణాకర్, ఇబ్రహీం నిర్గుణ్, జుగాష్‌విలీ, చిగురుపాటి భాస్కరరావు, ప్రసాదమూర్తి, ఎమ్వీ రమణ, దాసరి శ్రీనివాస్, కందేడి బాల్‌రెడ్డి, సి.వనజ, ఎమ్ఎన్.రావుణ్ణి, వంగపల్లి పద్మ, బ్రహ్మచారి కొలగాని, ఎమ్.ప్రకాశ్; శ్రీకాంత్ మహరాజ్, బిల్లా మహేందర్, ప్రత్తిపాటి అశ్వనీకుమార్, శివరామకృష్ణ, జంపన్న జినుగ.*

**వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా**
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు 70, జుబిలీ హిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

# మహాయుద్ధంలో మానవుడే విజేత

■ పి. చిదంబరం



'పళని' పలుకు

> *సమకాలీన ప్రపంచంలో 'శక్తిమంతులయిన' నాయకులకు కొదవేమీ లేదు. అయితే వారిలో ఏ ఒక్కరూ కరోనా వైరస్ వ్యాప్తిని ఎందుకు అరికట్టలేకపోతున్నారు? కరోనా మహమ్మారిపై మానవాళి అంతిమంగా విజయం సాధిస్తుందా? మానవాళి జయించి తీరుతుంది. నియంతలు, క్రూర పాలకుల నుంచేగాక అలా రాజ్యాధికారాలను చెలాయించాలని ఆరాటపడుతున్న వారినుంచి కూడా మానవాళి తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సంరక్షించుకుంటుంది. ఇది తథ్యం.*

కరోనా వైరస్ లేదా కొవిడ్ 19 ప్రతాపానికి 205 దేశాలు అల్లకల్లోలమవుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. సృష్టిలోని అతి సూక్ష్మ జీవి వైరస్. జీవి జీవకణాల్లో మాత్రమే అది తనను తాను పునరుత్పత్తి చేసుకొంటుంది. బాక్టీరియాతోసహా సృష్టిలోని ప్రతిజీవిని వైరస్‌లు సోకుతాయి

కొత్త కరోనా వైరస్ కారణంగా ప్రబలిన ఒక మహా అంటువ్యాధికి కొవిడ్ 19 అని ప్రపంచ ఆరోగ్య సంస్థ నామకరణం చేసింది. ఈ 'కొత్త' వైరస్ జాడను తొలుత గుర్తించింది లీ వెన్లియాంగ్ అనే ఒక చైనీస్ డాక్టర్. గత డిసెంబర్‌లో ఆయన ప్రప్రథమంగా కరోనా వైరస్ గురించి ప్రపంచానికి వెల్లడించాడు. అయితే చైనా ప్రభుత్వం ఆయన్ని నానా వేధింపులకు గురిచేసింది! దురదృష్టవశాత్తు డాక్టర్ లీ సైతం కొవిడ్ 19 బారిన పడ్డాడు. 2020 ఫిబ్రవరి 7న మరణించాడు. అప్పుడు ఆయన వయస్సు 33 సంవత్సరాలు (డాక్టర్ లీ మరణానంతరం ఆయన పట్ల తాము వ్యవహరించిన తీరుకు చైనా అధికారులు క్షమాపణలు చెప్పారు). ఈ కీర్తిశేషుడు గుర్తించిన కొత్త వైరస్ 100 రోజులలోగానే భయంకర దావానలంలా ధరిత్రి నలుమూలలకీ వ్యాపించింది. ఏ దేశ సరిహద్దులనూ ఎంత శక్తిమంతమైన సైన్యమూ కొవిడ్ 19ని నిలువరించలేదు. జాతీయ సరిహద్దులను ఈ సూక్ష్మ క్రిమి గుర్తించదు గాక గుర్తించదు. కుల మతాలు, జాతి, జెండర్, పుట్టిన ప్రదేశం, సామాజిక వర్గం ప్రాతిపదికన ఏ స్త్రీ, పురుషుడి పట్ల అది ఎలాంటి వివక్ష చూపదు. భారత రాజ్యాంగంలోని 14, 15 అధికరణలను కరోనా వైరస్ పరిపూర్ణంగా గౌరవిస్తుంది, కాకపోతే ఒక అహేతుక రీతిలో!

ఈ భూమిపై అత్యంత శక్తిమంతమైన వ్యక్తి (అని ఎంతో మంది అంటున్న) అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సైతం తన ప్రజలను కరోనా మహమ్మారి బారిన పడకుండా రక్షించడంలో నిస్సహాయుడైపోయారు. ఏప్రిల్ 3న ఈ వ్యాసం రాస్తున్న సమయానికి అమెరికాలో కరోనా వ్యాధిగ్రస్తుల సంఖ్య 2,13,600కి మించిపోయింది. కరోనా వైరస్ కారణంగా అమెరికాలో సంభవించే మరణాలసంఖ్య హీనపక్షం 1,00,000 నుంచి 2,40,000 మధ్య వుండగలదని అంచనా. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యం సైతం కరోనాను ఏమీ చేయలేకపోతోంది. అమెరికా కూడబెట్టుకున్న అపార సిరిసంపదలు కొవిడ్ 19 నెదుర్కొనే విషయంలో నిష్ప్రయోజనమైపోతున్నాయి. డాలర్ విలువ పెరిగింది. అయితే 'బలహీన' యూరో లేదా యువాన్ వలే 'బలమైన' డాలర్ కూడా కరోనా ముందు శక్తిహీనమైపోయింది.

ప్రపంచవ్యాప్తంగా అనేకమంది ప్రభుత్వాధినేతలు (ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైనవారు, ప్రజాస్వామ్యేతర మార్గాలలో అధికారాన్ని కైవశం చేసుకున్నవారు) ప్రజల సమ్మతితో పాలించాలని కాకుండా, అధికారాన్ని చెలాయించేందుకు ఆరాటపడుతున్నారు. 'ప్రతి ఒక్కరిపైన, ప్రతి దానిపైన అధికారాన్ని చెలాయించేంతవరకు ఒక రాజు సంతృప్తి చెందడని' సమకాలీన పాశ్చాత్య విజ్ఞుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఇది నిండు సత్యం. దురదృష్టవశాత్తు సమకాలీన ప్రభుత్వాధినేతల విషయంలో కూడా ఇదొక పరిపూర్ణ సత్యం. రబ్బర్ స్టాంప్ పార్లమెంటులు, ఆశ్రిత న్యాయ స్థానాలు, సానుకూలంగా వ్యవహరించే ప్రభుత్వ సంస్థలు, మాట జవదాటని అధికారగణం, గూఢచారులు, రాజకీయ ప్రత్యర్థులను ఎటువంటి ఆరోపణలు లేకుండానే నెలలు, సంవత్సరాలు తరబడి జైళ్లలో నిర్బంధించడం మొదలైనవన్నీ బోలు చర్యలే.

యావత్ప్రపంచమూ ఒక బందీఖానాగా మారిపోవడమూ, తాము ఒకే కారాగారంలోవున్నట్టు పీడకులు, పీడితులూ తెలుసుకోవడం విచిత్రంగా లేదూ? పీడకులైన పాలకులకు మీరీ విషయాన్ని గుర్తు చేయండి. మీరు లాక్‌డౌన్‌లో వున్నారు గనుక మీరు ఆడగల ఒక ఆటను సూచిస్తాను. ప్రపంచ భౌగోళిక పటంనొకదాన్ని డౌన్‌లోడ్ చేసుకోండి. మీ కుటుంబ సభ్యులలో ఎవరినైనా ఒకో దేశాన్ని గుర్తించమని అడగండి. వారిని ఒక ప్రశ్న అడగండి: నీవు గుర్తించిన దేశం ఎటువంటి అభియోగాలు మోపకుండా ప్రజలను జైళ్ళలో నిర్బంధించిందా? ఇవిగో మీకు లభించే సమాధానాలు. దక్షిణ అమెరికా ఖండంతో ప్రారంభమవుతాం.




**వెనిజువెలా:** దేశాధ్యక్షుడు నికోలస్ మదురోకు విధేయంగా వ్యవహరించే ఈ దేశ న్యాయవ్యవస్థ 30మంది ప్రతిపక్ష నాయకులకు పార్లమెంటరీ సభ్యత్వ హక్కులను రద్దు చేసింది. మరి కొంతమంది ప్రవాసానికి వెళ్ళిపోయారు లేదా జైలులో మగ్గిపోతున్నారు.

ఆఫ్రికాలో పరిస్థితులు మరింత ఘోరంగా వున్నాయి.

**ఇథియోపియా:** 2018లో అబియి అహ్మద్ ప్రధానమంత్రి అయ్యాడు. పొరుగుదేశం ఎరిట్రియాతో సుస్థిర శాంతిని నెలకొల్పాడు. నోబెల్ శాంతి పురస్కారాన్ని పొందాడు. 2019లో ఇంటర్నెట్‌పై సంపూర్ణంగా ఆంక్షలు విధించాడు. చట్ట విరుద్ధంగా 64మంది హత్యకు గురయ్యారని, కనీసం 1400మంది ఎటువంటి అభియోగాలు లేకుండా జైలుపాలయ్యారని ఒక ఎన్‌జిఓ వెల్లడించింది.

**టాంజనియా:** ప్రతిపక్ష ఎంపీలు, ప్రభుత్వాన్ని విమర్శించే జర్నలిస్టులను దేశాధ్యక్షుడు జాన్ మగుఫలి ఆదేశాలపై అరెస్ట్ చేశారు. వివిధ మీడియా సంస్థలను మూసివేయించారు. భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసేవారిని అణచివేసేందుకు జాన్ మగుఫలి చట్టాలను తీసుకు వచ్చాడు.

ఐరోపాలో మిశ్రమ పరిస్థితులు కన్పిస్తాయి. ఆ ఖండంలో దృఢమైన ప్రజాస్వామ్య వ్యవస్థలు వర్ధిల్లుతున్నాయి. అయితే అక్కడ ఇటువంటి దేశాలు కూడా వున్నాయి:

**హంగరీ:** కార్యనిర్వాహక, శాసన, న్యాయవ్యవస్థల అధికారాలన్నిటినీ ప్రధానమంత్రి విక్టర్ అర్బాన్ తన చేతుల్లో కేంద్రీకరించుకున్నాడు. ఆయన ప్రభుత్వం సెంట్రల్ యూరోపియన్ యూనివర్శిటీని మూసివేసింది. ఇంటర్నెట్‌పై పన్ను విధించింది. తలుచుకున్న విధంగా డిక్రీల జారీ ద్వారా పాలించే అధికారాలను సైతం నాలుగురోజుల క్రితం విక్టర్ సాధించుకున్నాడు.

**రష్యా:** తాను మళ్ళీ దేశాధ్యక్షుడుగా ఎన్నికయ్యేందుకు వీలు కల్పించే రాజ్యాంగ సవరణకు ఆమోదం పొందడంలో అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విజయవంతమయ్యారు. దీనిపై మాస్కోలో వేలాది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలుపగా పోలీసులు రెండువేలమందికి పైగా నిరసనకారులను నిర్బంధంలోకి తీసుకున్నారు. పలువురిపై క్రిమినల్ కేసులు మోపారు. రాజకీయ ప్రత్యర్థుల అరెస్ట్, పోలీస్ అధికారుల హింసాకాండ, బాలల నిర్బంధం, తల్లిదండులకు బెదిరింపులు రష్యాలో నేడు నిత్యకృత్యాలైపోయాయి. రష్యాలో 200మందికి పైగా రాజకీయ ఖైదీలువున్నారు.

ఆసియా ఖండంలో కొన్ని దేశాలను ప్రజాస్వామ్య దేశాలుగా చెప్పే పరిస్థితి లేదు.

**థాయిలాండ్:** ప్రధానమంత్రి ప్రయుత్ చాన్ ఓ చా ప్రభుత్వం 2019లో అధికారానికి వచ్చింది. దరిమిలా రాజకీయ కార్యకర్తలపై భౌతికదాడులు ముమ్మరమయ్యాయి. మానవ హక్కుల కార్యకర్తలు అదృశ్యమవ్వడం ప్రారంభమయింది. పౌర హక్కుల అణచివేత తీవ్రమయింది.

**కంబోడియా:** 2018 పార్లమెంటరీ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా జరగలేదు. ప్రధాన ప్రతిపక్షాన్ని నిషేధించారు. పలువురు ప్రతిపక్ష నాయకులను జైళ్ళకు పంపించారు లేదా నిర్బంధ ప్రవాసానికి పంపించారు. మీడియా, పౌర సమాజ సంస్థలపై ఆంక్షలు విధించారు. అన్ని స్థానాలలోనూ పాలకపక్షమే విజయం సాధించింది.

ఈ పరిస్థితులు మీకు నిరాశానిస్పృహలను కలిగిస్తున్నాయి కదూ? అయినా మీరు ఒక ప్రశ్న వేసుకోవాలి. సమకాలీన ప్రపంచంలో 'శక్తిమంతులైన' నాయకులకు కొదవేమీ లేదు. అయితేవారిలో ఏ ఒక్కరూ కరోనా వైరస్ వ్యాప్తిని ఎందుకు అరికట్ట లేకపోతున్నారు? కరోనా మహమ్మారిపై మానవాళి అంతిమంగా విజయం సాధిస్తుందా? ఇటువంటి సందేహానికి తావులేదని, మానవాళి ఈ సంక్షోభాన్ని సంపూర్ణంగా అధిగమిస్తుందని ప్రముఖ తమిళకవి వైరముత్తు విశ్వసిస్తున్నారు. కరోనా వైరస్ పై ఆయన ఒక అందమైన కవిత రాశారు. దాని స్వేచ్ఛానువాదమిది: 'అణువు కంటే చిన్నది/ అణు బాంబు కంటే భయంకరమైనది/ నిశ్శబ్దంగా ప్రవేశిస్తుంది/ యుద్ధం లేకుండా సమస్తాన్ని వినాశనం చేస్తుంది.... మానవుడు కరోనా వైరస్‌ను నిర్మూలిస్తాడు/ ఆ మహమ్మారిని జయిస్తాడు'. అవును, కరోనా వైరస్‌పై యుద్ధంలో మానవాళి జయించితీరుతుంది. నియంతలు, క్రూర పాలకుల నుంచేగాక అలా రాజ్యాధికారాలను చెలాయించాలని ఆరాటపడుతున్న వారినుంచి కూడా మానవాళి తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సంరక్షించుకుంటుంది. ఇది తథ్యం.

*(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)*

# కరోనా అనంతర జీవితం

మానవాళి ఇప్పుడు ఒక ప్రపంచ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. బహుశా, మన తరంలో అతి పెద్ద ఉత్పాతమిది. వచ్చే కొద్ది వారాల్లో ప్రజలు, ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలే, రాబోయే సంవత్సరాలలో చాలవరకు ప్రపంచాన్ని తీర్చిదిద్దనున్నాయి. అవి, కేవలం మన ఆరోగ్య భద్రతా వ్యవస్థలనే కాదు, మన ఆర్థిక కార్యకలాపాలను, రాజకీయాలు, సంస్కృతిని కూడా సరికొత్తగా రూపొందిస్తాయి. మనం ఆ నిర్ణయాలను సత్వరమే, నిర్ణయాత్మకంగా అమలుపరిచితీరాలి. మన చర్యల దీర్ఘకాలిక పర్యవసానాలను కూడా మనం పరిగణనలోకి తీసుకోవాలి. ప్రత్యామ్నాయాల మధ్య ఒక దాన్ని ఎంచుకునేటప్పుడు మనకు మనం కొన్ని ప్రశ్నలు విధిగా వేసుకుని తీరాలి. అవి: తక్షణ ముప్పును ఎలా అధిగమించగలం? ప్రస్తుత ప్రళయం సమసిపోయిన తరువాత మనం ఎటువంటి ప్రపంచంలో నివసించనున్నాము? అవును, తుఫాను వెలుస్తుంది. ప్రశాంతత నెలకొంటుంది. విపత్తు ముట్టడి నుంచి మానవాళి బయటపడుతుంది. మనలో చాలా మందిమి సజీవంగా వుంటాము, సందేహం లేదు. అయితే మనం ఒక విభిన్న లోకంలో జీవించనున్నాము.

ప్రతి ఒక్కరూ ఇంటి నుంచే పని చేస్తున్నప్పుడు, ఒకే చోట భౌతిక దూరాన్ని పాటిస్తూ సంభాషించుకుంటున్నప్పుడు జరిగేదేమిటి? పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు ఆన్‌లైన్ విద్యాలయాలయినప్పుడు సంభవించేదేమిటి? మామూలు సమయాలలో ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు, విద్యా వ్యవస్థలు ఇటువంటి ప్రయోగాలకు ససేమిరా అంటాయి. అయితే ఇవి సాధారణ రోజులు కావు. ప్రస్తుత సంక్షోభాన్ని అధిగమించేందుకు మనం ఏ మార్గాన్ని అనుసరించాలి? సంపూర్ణాధికార రాజ్య నిఘాను ఆమోదించడమా లేక పౌర సాధికారతను పెంపొందించడమా? జాతీయవాద అహమికతో ఒంటరితనంతో ఉండిపోవడమా లేక వసుధైక సంఘీభావంతో వ్యవహరించడమా? ఈ ప్రత్యామ్నాయాలలో మనం వేటిని అనుసరించాలి? వివేకవంతమైన నిర్ణయాన్ని తీసుకునేందుకు వాటి గురించి క్లుప్తంగా తెలుసుకుందాం. కరోనా మహమ్మారిని నిలువరించేందుకు సకల జన సమూహాలు నిర్దిష్ట మార్గదర్శకాలు విధిగా అనుసరించాల్సిన అవసరమున్నది. దీన్ని సాధించేందుకు రెండు మార్గాలున్నాయి. ఒకటి ప్రభుత్వాలు ప్రజల కదలికలను నిరంతరం గమనిస్తూ, నిబంధనలను ఉల్లంఘించినవారిని కఠినంగా శిక్షించడం. సమాజంలోని ప్రతి ఒక్కరిపై నిరంతర నిఘా వుంచడం ప్రభుత్వాలకు నేడు సుసాధ్యంగా వున్నది. ఇది మానవాళి చరిత్రలో ఒక అపూర్వ పరిణామం. కరోనా వైరస్‌పై పోరులో పలు ప్రభుత్వాలు ఇప్పటికే అధునాతన నిఘా సాధనాలను నియోగించాయి. చైనా ఇందుకొక ఎన్నదగిన ఉదాహరణ. 21వ శతాబ్ది ప్రభుత్వాలు నిఘాకార్యకలాపాలకు వ్యక్తులపైగాక సర్వవ్యాప్తంగా వుండే సెన్సర్లు, శక్తిమంతమైన అల్గోరిథమ్స్‌పై ఆధారపడుతున్నాయి.

ఇటీవలి సంవత్సరాలలో వ్యక్తుల ప్రైవసీపై పెద్ద పోరాటం జరుగుతోంది. కరోనా వైరస్‌పై పోరు ఈ పోరాటానికి పరాకాష్ఠగా చెప్పవచ్చు. ప్రైవసీ, ఆరోగ్యం మధ్య ఒకదాన్ని కోరుకోమంటే ప్రజలు నిస్సందేహంగా ఆరోగ్యాన్నే కోరుకుంటారు. సంపూర్ణాధికార రాజ్య నిఘా వ్యవస్థలను నెలకొల్పడం ద్వారా కాకుండా పౌరులకు సాధికారత కల్పించడం ద్వారానే మనం కరోనా మహమ్మారిపై విజయవంతంగా పోరాడగలుగుతాము. పౌర సాధికారత కల్పించడమనేది కరోనాను నిలువరించేందుకు జనసమూహాలు విధిగా నిర్దిష్ట మార్గదర్శకాలను అనుసరించేలా చేసేందుకు దోహదం చేసే మార్గం. కరోనాను నిలువరించడంలో దక్షిణా కొరియా, తైవాన్, సింగపూర్‌లు గణనీయమైన ఫలితాలను సాధించాయి. ఈ దేశాలు విస్తృతస్థాయిలో ప్రజలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాయి; ఆ పరీక్షల ఫలితాలను దాపరికం లేకుండా వెల్లడించాయి. సమస్యపై మెరుగైన అవగాహన వున్న పౌరుల తోడ్పాటు వల్లే ఆ ప్రయత్నాలు సఫలమయ్యాయి. చెప్పవచ్చేదేమిటంటే ప్రజలు నిర్దేశిత మార్గదర్శక సూత్రాలను అనుసరించేలా చేసేందుకు కేంద్రీకృత పర్యవేక్షణ, కఠిన శిక్షలు మాత్రమే ఏకైక మార్గం కాదు. ప్రజలకు వైజ్ఞానిక వాస్తవాలను చెప్పినప్పుడు, ఆ వాస్తవాలను చెప్పిన ప్రభుత్వాధికారులను విశ్వసించినప్పుడు పౌరులు స్వచ్ఛందంగా అనివార్య మార్గదర్శకాలను పాటిస్తారు. తమపై ఎలాంటి నిఘా లేకుండానే వారు సరైన విధంగా వ్యవహరిస్తారని చెప్పవచ్చు.

అటువంటి ఆచరణ స్థాయిని, స్వచ్ఛంద సహకారాన్ని సాధించాలంటే మీకు నమ్మకం అవసరం. ప్రజలు సైన్స్‌ను విశ్వసించాలి; ప్రభుత్వాధికారులను విశ్వసించాలి; మీడియాను విశ్వసించాలి. గత కొద్ది సంవత్సరాలుగా బాధ్యతారహిత రాజకీయవేత్తలు ఉద్దేశపూర్వకంగా సైన్స్‌లో నమ్మకాన్ని సడలింపచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు ఈ బాధ్యతారహిత రాజకీయవేత్తలే, సరైన పనిచేస్తారని ప్రజలను విశ్వసించలేమనే వాదన చేస్తున్నారు. ఇటువంటి వాదనలతో వారు నిరంకుశాధికార పాలనను తీసుకువచ్చే ప్రమాదం ఎంతైనా వున్నది.

సంక్షోభ సమయంలో మనుషుల ఆలోచనలు కూడా వేగంగా మారిపోతాయి. మీ తోబుట్టువులతో మీరు తీవ్రంగా విభేదిస్తుండవచ్చు. అయితే సంక్షోభ సమయంలో వారిలో మీకు ఆకస్మికంగా విశ్వాసం కలుగుతుంది. మైత్రీ భావం పెంపొందతుంది. పరస్పరం సహాయం చేసుకుంటారు. నిఘా వ్యవస్థలను అభివృద్ధిపరిచే బదులు, సైన్స్, పబ్లిక్ అథారిటీస్, మీడియాలో ప్రజలు విశ్వాసాన్ని పెంపొందించాలి. ఇందుకు సమయం మించిపోలేదు కొత్త సాంకేతికతలను కూడా ఉపయోగించుకోవాలి. అయితే వీటిని పౌరులకు సాధికారత కల్పించడానికే ఉపయోగించాలి. కరోనా మహమ్మారి నిర్మూలన మన పౌర ధర్మాలకు ఒక ప్రధాన పరీక్ష. మరి రాబోయే రోజుల్లో మనలో ప్రతి ఒక్కరూ కుట్ర సిద్ధాంతాలు, స్వార్థపరులైన రాజకీయ వేత్తల వాదనలను త్రోసిపుచ్చి వైజ్ఞానిక సమాచారాన్ని ఆరోగ్య భద్రతా నిపుణులను విశ్వసించాలి. సరైన నిర్ణయం తీసుకోవడంలో విఫలమైతే విలువైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను మనం కోల్పోతాము. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోల్పోవడానికి ఆమోదించడం అనుచితమవుతుంది. కరోనాను నిలువరించేందుకు పౌరులకు సాధికారత కల్పించే మార్గాన్నే మనం అనుసరించాలి.






> *ప్రతి సంక్షోభమూ ఒక అవకాశమే. ప్రపంచ అనైక్యత వల్ల ఏర్పడే తీవ్ర ప్రమాదాన్ని మానవాళి గుర్తించేందుకు కరోనా మహమ్మారి తోడ్పడగలదని ఆశిద్దాం. జాతీయవాద అహమికతో ఒంటరిగా ఉండిపోవడమో లేక వసుధైక సంఘీభావంతో వ్యవహరించడమో మానవాళి సత్వరమే నిర్ణయం తీసుకోవాలి. సమష్టిగా పోరు జరపకపోతే కరోనా కల్లోలం సుదీర్ఘ కాలం కొనసాగడం ఖాయం. వసుధైక సంఘీభావ మార్గాన్ని ఎన్నుకుంటే అది కరోనాపై యుద్ధానికేగాకుండా భావి మహమ్మారులు, ఉపద్రవాల పైనా విజయదుందుభి మోగించడానికి తోడ్పడగలదు.*

మరి జాతీయవాద అహమికతో ఒంటరిపాటుగా ఉండిపోవడం, వసుధైక సంఘీభావం.. ఈ రెంటిలో దేన్ని ఎంచుకోవాలో చూద్దాం. కరోనా మహమ్మారి మాత్రమే కాదు, దాని పర్యవసానమైన ఆర్థిక సంక్షోభం కూడా ప్రపంచ సమస్యే. అంతర్జాతీయ సహకారం ద్వారా మాత్రమే ఆ సమస్యలను సమర్థంగా పరిష్కరించుకోగలం. కరోనా వైరస్‌ను నిర్జించాలంటే తొట్టతొలుత ఆ విషక్రిమి సంబంధిత సమాచారాన్ని అంతర్జాతీయంగా పంచుకోవాల్సిన అవరమున్నది. ఈ విషయంలో వైరస్‌లకు లేని ఒక మహా సానుకూలత మానవులకు ఉన్నది. చైనాలోని ఒక కరోనా వైరస్, అమెరికాలోని ఒక కరోనా వైరస్ మానవులకు ఏ విధంగా సంక్రమించాలనే విషయమై పరస్పరం సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోలేవు. అయితే కరోనా వైరస్‌ను ఎలా ఎదుర్కోవాలనే విషయమై అమెరికాకు చైనా విలువైన పాఠాలు చెప్పగలదు. మిలన్‌లో ఒక ఇటాలియన్ డాక్టర్ ఒక తెల్లవారుజామున కనిపెట్టిన ఔషధంతో అదే రోజు సాయంత్రానికి ఇరాన్‌లో వేలాది కరోనా వ్యాధిగ్రస్తులను కాపాడడం సాధ్యమవుతుంది. బ్రిటన్ ప్రభుత్వం పలు విధానాలలో దేన్ని అనుసరించాలనే విషయమై తటపటాయిస్తున్నప్పుడు, నెలరోజుల క్రితం అటువంటి సందిగ్ధతనే ఎదుర్కొన్న దక్షిణ కొరియా నుంచి ప్రయోజనకరమైన సలహాలను పొందగలదు ఇవి జరగాలంటే అంతర్జాతీయ సహకార స్ఫూర్తి, పరస్పర విశ్వాసం ఎంతైనా అవసరం.

కరోనాకు సంబంధించిన సమాచారాన్ని అన్ని దేశాలు ఇతర దేశాలతో స్వేచ్ఛగా పంచుకోవాలి. ఇతర దేశాల అనుభవాల నుంచి నేర్చుకునేందుకు వాటి సలహా సూచనల కోసం వినయపూర్వకంగా అభ్యర్థించాలి. వైద్య పరికరాలను మరీ ముఖ్యంగా టెస్టింగ్ కిట్లు, శ్వాసక్రియా సాధనాల ఉత్పత్తి, పంపిణీకి అంతర్జాతీయ స్థాయిలో సమష్టి ప్రయత్నాలు జరగాలి. ఏ దేశానికాదేశం స్థానికంగా తయారు చేసుకోవడం కాకుండా, అంతర్జాతీయ స్థాయి సమష్టి ప్రయత్నాలలో భాగమయితే ప్రాణాంతక కరోనా వ్యాధిని అరికట్టేందుకు అవసరమైన వైద్య పరికరాలను, ఔషధాల ఉత్పత్తిని మరింత వేగవంతంగా చేసేందుకు దోహదం జరుగుతుంది. వాటిని అన్ని దేశాల వారికీ అందుబాటులోకి తీసుకురావడం కూడా సుసాధ్యమవుతుంది, యుద్ధకాలంలో కీలక పరిశ్రమలను జాతీయీకరణ చేసిన విధంగానే కరోనా వైరస్‌పై మానవ సమరానికి, ముఖ్యమైన ఉత్పత్తి సాధనాలను మానవీయీకరణ చేయడం కూడా చాలా ముఖ్యం. కరోనా కేసులు స్వల్పంగా వున్న దేశం విలువైన వైద్య పరికరాలను అవి అవసరమైన మరో పేద దేశానికి పంపించాలి. అలాగే ఆ దేశానికి ఏమైనా అత్యవసరమయినప్పుడు మిగతా దేశాలు దానిని ఆదుకోవాలి. వైద్య సిబ్బందిని కూడా అంతర్జాతీయంగా ఉపయోగించుకోవాలి. కరోనా కేసులు తక్కువగా ఉన్న దేశాలు తమ వైద్య సిబ్బందిని ఆ మహమ్మారితో అతలాకుతలమవుతున్న దేశాలకు పంపించాలి బాధితులను ఆదుకోవడానికే కాదు, వ్యాధి నివారణలో విలువైన పాఠాలు నేర్చుకునేందుకు, అనుభవాలు సమకూర్చుకునేందుకు కూడా ఇలా చేయడం విశేషంగా తోడ్పడుతుంది.

ఆర్థిక రంగంలో కూడా అంతర్జాతీయ సహకారం చాలా ముఖ్యం. ఈ ప్రపంచీకరణ యుగంలో ప్రతి ప్రభుత్వమూ తన సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తే పరిస్థితులు అస్తవ్యస్తమవుతాయి. సంక్షోభం మరింతగా విషమిస్తుంది. కరోనా కట్టడికి ప్రపంచ స్థాయి కార్యాచరణ పథకం అవసరం. దాన్ని సత్వరమే రూపొందించి అమలుపరచాలి. ప్రయాణాలపై కూడా అంతర్జాతీయ ఒప్పందానికి రావాలి. నెలల తరబడి అంతర్జాతీయ ప్రయాణాలను రద్దుచేయడం ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు. కరోనాపై యుద్ధానికి అది ఆటంకమవుతుంది. కనీసం కొంతమంది ఆవశ్యక వ్యక్తులు–శాస్త్రవేత్తలు, డాక్టర్లు, జర్నలిస్టులు, రాజకీయవేత్తలు, వ్యాపారవేత్తలు–ఇతర దేశాలకు ప్రయాణించడానికి అనుమతించాలి. ప్రయాణీకులకు స్వదేశంలోనే ప్రీ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణ తరువాతే విమానం ఎక్కేందుకు అనుమతించేలా ఒక అంతర్జాతీయ ఒప్పందాన్ని కుదుర్చుకోవాలి. దురదృష్టవశాత్తు ప్రస్తుతం ఏ దేశమూ పైన పేర్కొన్న విషయాలలో దేనినీ పాటించడం లేదు. అంతర్జాతీయ సమాజం ఒక ఉమ్మడి వైకల్యం బారినపడింది. కొన్ని వారాల క్రితమే ప్రపంచ నాయకులు అత్యవసరంగా సమావేశమై ఒక కార్యాచరణ పథకాన్ని రూపొందించి వుండవలసింది. కానీ అలా జరగలేదు ఇంతకుముందు సంభవించిన అంతర్జాతీయ సంక్షోభాలలో (2008 ఆర్థిక మాంద్యం, 2014 ఎబోలా మహమ్మారి) అమెరికా నాయకత్వ పాత్ర వహించింది. అయితే ప్రస్తుత సంక్షోభంలో అమెరికా తన నాయకత్వ పాత్రను త్యజించింది. అమెరికా త్యజించిన నాయకత్వ స్థానాన్ని ఇతర దేశాలు భర్తీచేయాలి. లేనిపక్షంలో కరోనాపై యుద్ధం మరింత కఠినతరమూ, అసాధ్యమైపోతుంది. అంతేగాక అంతర్జాతీయ సంబంధాలపై అది రాబోయే చాలా సంవత్సరాల వరకు విషపూరిత ప్రభావాన్ని నెరపుతుంది. అయితే ప్రతి సంక్షోభమూ ఒక అవకాశమే. ప్రపంచ అనైక్యత వల్ల ఏర్పడే తీవ్ర ప్రమాదాన్ని మానవాళి గుర్తించేందుకు కరోనా మహమ్మారి తోడ్పడగలదని ఆశిద్దాం.

మానవాళి సత్వరమే ఒక నిర్ణయాన్ని తీసుకోవల్సిన అవసరమున్నది. అనైక్యతా మార్గంలో ప్రయాణించడమా లేక వసుధైక సంఘీభావ పథాన్ని అనుసరించడమా? అనైక్యతా మార్గంలోనే కొనసాగితే కరోనా కల్లోలం మరెంతో కాలం కొనసాగడమేగాక భవిష్యత్తులో మరింత భయంకరమైన సంక్షోభానికి కారణం కాగలదు. వసుధైక సంఘీభావ మార్గంలో వెళ్ళడానికి నిర్ణయించుకుంటే అది కరోనాపై యుద్ధానికే గాకుండా భవిష్యత్తులో మానవాళిపై విరుచుకుపడే మహమ్మారులు, ఉపద్రవాలపైన కూడా విజయదుందుభి మోగించడానికి తోడ్పడగలదు.

■ యువల్ నోఅ హరారీ

*(వ్యాసకర్త చరిత్రకారుడు, ఇజ్రాయిల్ పౌరుడు. ఆయన సుప్రసిద్ధ పుస్తకం 'సేపియన్స్' తెలుగుతో సహ పలు ప్రపంచ భాషలలోకి అనువదితమయింది. ఇది లండన్ 'ఫైనాన్షియల్ టైమ్స్'లో వెలువడిన వ్యాసానికి సంక్షిప్త, స్వేచ్ఛానువాదం.)*

ఆదర్శం



ఇప్పుడంతా 'లాక్‌డౌన్'. ఈ ఆపత్కాలంలో రెక్కాడితే కానీ డొక్కాడని రోజు కూలీల అవస్థలు ఇక చెప్పనలవికావు. ఎక్కడా పని లేదు... పట్టెడన్నం పుట్టడం లేదు. వారి ఆకలి బాధలు అర్థం చేసుకున్నాడు కేరళకు చెందిన 25 ఏళ్ల యువ రైతు యదు ఎస్. బాబు. ఒకటిన్నర ఎకరంలో తాను పండించిన పంటనంతా కూలీలకు ఉచితంగా పంచి... ఆదర్శంగా నిలిచాడు.

# పంటంతా పేదలకు పంచుతున్నాడు

"నా చుట్టుపక్కలవారు ఆకలితో అలమటిస్తుంటే... నాకున్న సౌకర్యాలతో విలాసాలు చేసుకొంటూ కూర్చోలేను. ఈ విపత్కర పరిస్థితుల నుంచి బయటపడడానికి మనం ఏమేం చేయగలమో అవన్నీ చేయాలి"... ఇది యదుబాబు మాట. నిజమే... భారమంతా ప్రభుత్వంపై నెట్టేసి కూర్చుంటే కుదరదు. దేశమే కాదు... కరోనా వైరస్ దెబ్బకు ప్రపంచమంతా అల్లాడుతున్నవేళ, ఎవరికి వారు తమ వంతు మద్దతునందించాలి. చేతనైన సాయం చేయడం బాధ్యతగా భావించాలి. కేరళ ఇడుక్కి జిల్లాలోని అనక్కర గ్రామంలో నివసించే యదుబాబు ఆలోచన కూడా ఇదే. అందుకే కంటితో చూసి వదిలేయకుండా మనసుతో స్పందించాడు.

ముఖ్యంగా కూరగాయలు, ఇతర రోజువారీ ఉత్పత్తులకు పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకలపై కేరళ ఆధారపడుతుంది. కరోనా ప్రభావంతో రాష్ట్రాల సరిహద్దులు మూసేయడంతో కేరళకు దిక్కుతోచని పరిస్థితి. దీంతో చాలామంది దినసరి కూలీలు పస్తులతో పడుకోవాల్సి వస్తుంది. ఇది గమనించిన యదుబాబు కొందరి ఆకలైనా తీర్చాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా రసాయన ఎరువులు వాడకుండా తన ఒకటిన్నర ఎకరంలో పండించిన కూరగాయలన్నింటినీ వారికి పంచుతున్నాడు.

**ఎక్కువ ధర ఇస్తామన్నా...**

"పురుగు మందులు, రసాయన ఎరువులు వేయకుండా కూరగాయలు పండిస్తున్నా. చాలామంది వ్యాపారులు వచ్చి తమకు పంట అమ్మమని అడిగారు. ఎక్కువ డబ్బులు కూడా చెల్లిస్తామన్నారు. కానీ నేను వారికి అమ్మనని చెప్పాను. ఈ లాక్‌డౌన్ సమయంలో అనేకమంది పేద కూలీలు ఆకలితో అవస్థలు పడుతున్నారు. అలాంటి వారందరికీ 'అమ్మక్కొరుమ్మ' స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచితంగా కూరగాయలు అందిస్తున్నాను" అని చెప్పాడు యదుబాబు. సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ఈ యువకుడు చురుగ్గా పాల్గొంటాడు. పన్నెండేళ్లుగా అనాథలు, అభాగ్యులు, వృద్ధులను ఆదుకొంటోంది 'అమ్మక్కొరుమ్మ' స్వచ్ఛంద సంస్థ. కరోనాతో విలవిల్లాడుతున్న కేరళలో ఇంటింటికి నిత్యావసరాలు చేర్చడానికి నిరంతరం శ్రమిస్తోందీ సంస్థ. వందకు పైగా ఇళ్లకు సరుకులు పంపిణీ చేసింది. ఆ సంస్థతో కలిసి పనిచేస్తున్నాడు ఈ యువ రైతు.

**నాన్న స్ఫూర్తితోనే...**

తోటి వయసువారంతా చదువు అయిపోగానే ఆరంకెల ఉద్యోగాల కోసం కార్పొరేట్‌ల దారి పడుతుంటే... యదుబాబు మాత్రం మాతృభూమిని వదిలి అడుగు బయటకు వెయ్యలేదు. కారణం... అతడికి మంచి అవకాశాలు రాక కాదు... వ్యవసాయంపైనున్న మక్కువతో! మెరైన్ సైన్స్‌లో డిగ్రీ పట్టా పొందిన ఈ కుర్రాడికి మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు వెతుక్కొంటూ వచ్చాయి. అయితే వాటన్నింటినీ తిరస్కరించాడు. యదుబాబు తండ్రి రిటైర్డ్ బ్యాంక్ ఆఫీసర్. ఆయన కూడా వ్యవసాయం చేస్తారు. అదే ఎన్జీఓ కోసం పనిచేస్తున్నారు. నాన్న స్ఫూర్తితోనే వ్యవసాయం బాటపట్టాడు యదుబాబు.



**వ్యవసాయాన్ని ఆస్వాదిస్తున్నాడు...**

'కావాలనుకొంటే మంచి జీతంతో ఉన్నతమైన కొలువులో స్థిరపడగలిగేవాడినే! అయితే వ్యవసాయం చేయాలన్న నా కోరిక అటువైపు వెళ్లనివ్వలేదు. ఇందులో ఎంత కష్టముందో, ఇది ఎంతపెద్ద బాధ్యతో తెలుసు... కానీ నాకు ఇంతకు మించిన సంతృప్తి, ఆనందం మరెక్కడా దొరకవనీ తెలుసు" అంటాడు యదుబాబు. అందుకే డబ్బు సంపాదనే ధ్యేయంగా కాకుండా... స్వచ్ఛమైన, హానికరం కాని ఉత్పత్తులు అందివ్వాలని సంకల్పించాడు. అతడికి ఉన్న పొలంలో వివిధ రకాల బీన్స్, బీట్‌రూట్, కాకర, వంకాయ పండిస్తున్నాడు. వాటితోపాటు ఏలకులు, మిరియాలు సాగు కూడా చేస్తున్నాడు. యదుబాబు తోట నుంచి వారానికి 100 కేజీల కాయగూరలు దిగుబడి అవుతాయి. ఇప్పుడు వాటన్నింటినీ ప్యాకింగ్ చేసి... నలభైకి పైగా ఇళ్లకు ఉచితంగా సరఫరా చేస్తున్నాడు.

ఈ సమయంలో అధికమొత్తంలో సంపాదించుకొనే అవకాశం ఉన్నా, దాన్ని వదులుకొని, కూరగాయలను పేదలకు పంచుతున్న యదుబాబు పెద్ద మనసు... మరింతమందికి స్ఫూర్తి మంత్రం కావాలని ఆశిద్దాం.

---

టెక్ గురు

# ట్రాక్ కరోనా!

**ట్రాకింగ్.. ట్రాకింగ్! దేశవ్యాప్తంగా ఇప్పుడు వినిపిస్తున్న పదం ఇది. కరోనా సోకిన వ్యక్తి ఎక్కడెక్కడో తిరిగాడో గుర్తించి, వారి కుటుంబ సభ్యులను, వారికి సన్నిహితంగా మెలిగిన వారిని అప్రమత్తం చేయడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాయి. అయితే టెక్నాలజీని ఉపయోగించుకుంటే కరోనా సోకిన వారిని ఈజీగా ట్రాక్ చేసే వీలుంది. అదెలా అంటే...!**



తాజాగా గూగుల్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా తమ వినియోగదారుల లొకేషన్ డేటాను పబ్లిక్ డొమైన్లో పెడుతున్నట్లు ప్రకటించింది.

అనేక చోట్ల కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తిని, అతని కుటుంబ సభ్యులను ఆరా తీసి, ఎక్కడెక్కడ తిరిగారో సమాచారాన్ని సేకరిస్తున్నారు. అయితే ఈ విధంగా అడిగి తెలుసుకోవటం ద్వారా నిక్కచ్చి సమాచారం లభించే అవకాశం ఏమాత్రం లేదు. ఇటీవల మతపరమైన కార్యక్రమంలో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్లి వచ్చిన ఒక వ్యక్తి కదలికల రిపోర్టు పరిశీలించినప్పుడు అందులో ఉదయం 7 గంటలకు ఢిల్లీలో ట్రెయిన్ దిగినట్లు, ఏడున్నరకు అల్పాహారం సేవించినట్లు.. ఇలా అంచనా సమయాలు మాత్రమే నమోదు చేయడం జరిగింది. ఈ తరహా సమాచారం వల్ల సరిగ్గా అదే సమయంలో ఆ ప్రదేశంలో ఉన్న ఇతరులను అప్రమత్తం చేయడం చాలా కష్టం.

**గూగుల్ మ్యాప్స్ ద్వారా!**

దీనికి బదులుగా గూగుల్ మ్యాప్స్‌లో అంతర్గతంగా ఉన్న ఓ అద్భుతమైన సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఆండ్రాయిడ్ మరియు ఐఓఎస్ ఫోన్లు ఈ మధ్య దాదాపు ప్రతి ఒక్కరి దగ్గర ఉంటున్నాయి. అందులో కచ్చితంగా గూగుల్ మ్యాప్స్ ఉంటుంది కాబట్టి ఇది గతంలో ఒక వ్యక్తి ఎక్కడెక్కడ తిరిగారన్న సమాచారాన్ని పూర్తి కచ్చితత్వంతో అందిస్తుంది. గూగుల్ మ్యాప్స్ ప్రత్యేకంగా మనం ఎనేబుల్ చేయాల్సిన పనిలేకుండానే లొకేషన్ డేటాను టైమ్‌లైన్‌లో జాగ్రత్తగా భద్రపరుస్తుంది. ఎవరికైతే కరోనా పాజిటివ్ వస్తుందో ఆ వ్యక్తి అనుమతితో అతని ఫోన్లో గూగుల్ మ్యాప్స్‌లోని టైమ్‌లైన్ డేటాని అధికారులు సేకరించాలి. దాంట్లో గత రెండు మూడు సంవత్సరాలుగా అతను ఎక్కడ ఎక్కడ తిరిగారో కూడా సమాచారం ఉంటుంది. పాజిటివ్ వచ్చిన వ్యక్తి, ఆ లక్షణాలు బయట పడక ముందు గత పదీ పదిహేను రోజులుగా ఏయే ప్రదేశాల్లో తిరిగారన్న సమాచారాన్ని మొదట సేకరించాలి.



**అందరికీ అందుబాటులో...**

ఇప్పుడు ప్రభుత్వాలు ఇలా వివిధ రకాలుగా సేకరించిన సమాచారం మొత్తాన్నీ ఒక అధికారిక వెబ్‌సైట్‌లో ఒక డేటాబేస్ రూపంలో దేశ ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా పెట్టాలి. పేషెంట్‌కి ఇబ్బంది కలగకుండా ఉండడం కోసం అతని పేరుకు బదులుగా 'పేషెంట్ 1', 'పేషెంట్ 2' వంటి పేర్లు తగిలించవచ్చు. అప్‌లోడ్ చేయబడిన డేటాతో పాటు, అతను తిరిగిన ప్రదేశాలను ఎవరైనా సులభంగా వెతికి పట్టుకునే విధంగా ట్యాగ్స్ జత చేయాలి. ఉదాహరణకు, అమీర్‌పేట, బేగంపేట, కూకట్‌పల్లి వంటి ట్యాగ్స్ తగిలించడం ద్వారా ప్రయోజనం ఉంటుంది.

**పౌరులు ఎలా జాగ్రత్త వహించాలి?**

ఇప్పుడు పబ్లిక్‌గా ఉన్న సమాచారాన్ని దేశంలో ఎవరైనా వినియోగించుకోవచ్చు. రాము అనే వ్యక్తి మార్చి 15న ఉదయం 9:12 నిమిషాలకు అమీర్‌పేటలో ఉన్నాడు అనుకోండి. అతను పబ్లిక్ డేటాబేస్‌లో అమీర్‌పేట అని వెదకడం ద్వారా కొన్ని ఫలితాలు వస్తాయి. అందులో ఉదయం 9:12 నిమిషాల టైమ్‌స్టాంప్ చూసుకుని ఆ సమయంలో కరోనా పేషెంట్లు ఎవరైనా సరిగ్గా తను ఉన్న గూగుల్ మ్యాప్స్ అక్షాంశ రేఖాంశాలకు 50 మీటర్ల దగ్గరలో ఎవరైనా ఉన్నారేమో చాలా సులభంగా గుర్తించవచ్చు. ఈ పద్ధతి ద్వారా కరోనా వైరస్ సోకిన వ్యక్తికి గతంలో తమకు తెలియకుండా ఎవరైతే సమీపంగా సంచరించారో వారు అప్రమత్తమయ్యే అవకాశం ఉంది.

**గూగుల్ సైతం...**

తాజాగా గూగుల్ సంస్థ కూడా ప్రపంచ వ్యాప్తంగా తమ వినియోగదారుల లొకేషన్ డేటాను పబ్లిక్ డొమైన్లో పెడుతున్నట్లు ప్రకటించడం హర్షించదగినది. కరోనా వైరస్ పేషెంట్ అనుమతితో సంబంధం లేకుండా వివిధ ప్రభుత్వాలు ఆయా వ్యక్తుల లొకేషన్ డేటాను గూగుల్ నుంచి ఇప్పుడు సులభంగా సేకరించవచ్చు. తద్వారా సరిగ్గా అదే ప్రదేశంలో సంచరించిన వారిని అప్రమత్తం చేయొచ్చు.

**గుర్తించిన తర్వాత!**

పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వ్యక్తుల గత కదలికల గురించి తెలుసుకోవడానికి పై పద్ధతులు ఉపయోగపడితే, వైరస్ నిర్ధారణ తర్వాత అతని కదలికలపై నిఘా పెట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం 'ఆరోగ్యసేతు' అనే యాప్‌ను తీసుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ ట్రాకింగ్ అప్లికేషన్స్ అందిస్తున్నాయి. వీటిలో జియో ట్యాగింగ్ చేయటం ద్వారా ఆ వ్యక్తికి సంబంధించిన కదలికలు ఎప్పటికప్పుడు సెంట్రల్ సర్వర్‌కి బ్యాక్ గ్రౌండ్‌లో పంపిస్తూ, జియో ఫెన్సింగ్ దాటి అతను బయటకు వచ్చినట్లయితే సంబంధిత అధికారులను అప్రమత్తం చేయడానికి ఇవి ఉపయోగపడతాయి.

**మొబైల్ టవర్ల ద్వారా...**

స్మార్ట్‌ఫోన్ లేని కరోనా వైరస్ పేషెంట్ల గత కదలికలను ట్రాక్ చేయడం కోసం వారు గతంలో చేసిన ఫోన్ కాల్స్ ద్వారా, మొబైల్ టవర్ల ఆధారంగా సిడిఆర్ ఎనాలసిస్ తెప్పించుకుని కొంత వరకు వారు తిరిగిన ప్రదేశాల గురించి సమాచారాన్ని సేకరించవచ్చు. ఇది పూర్తిస్థాయిలో ఉపయోగపడకపోయినప్పటికీ కొంతవరకు ప్రయోజనకరమే.

**ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ**

చైనాలో కరోనా వైరస్ కట్టడిలో ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ బాగా ఉపయోగపడింది. భారీ మొత్తంలో అక్కడ పౌరుల ఫేస్ డేటా ప్రభుత్వాల దగ్గర ఉండడం వల్ల కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తి ఫేస్ మోడల్ సేకరించి, నిఘా కెమెరాల ఫీడ్ పరిశీలించటం ద్వారా వారు ఎక్కడెక్కడ తిరిగారో గుర్తించారు. వారికి సమీపంగా ఇంకెవరు సాధారణ పౌరులు ఉన్నారో గుర్తించి, ఎవరికైతే ప్రమాదం ఉంటుందో వారికి హెచ్చరికలు పంపుతారు. మన దగ్గర ఆ స్థాయిలో నిఘా వ్యవస్థ లేదు కాబట్టి ప్రస్తుతానికి ఈ టెక్నాలజీ ద్వారా ప్రయోజనం లేదు.

ఏదేమైనప్పటికీ సమర్థవంతంగా కరోనా వైరస్ సోకిన వ్యక్తులను ట్రాక్ చెయ్యగలిగితే, వైరస్ వ్యాప్తిని చాలావరకు అడ్డుకోవచ్చు.



**నల్లమోతు శ్రీధర్**
fb.com/nallamothusridhar

---

కరోనా అంతరంగం

# ఉద్యమం... కొత్త రూపంలో..!

"ప్రజా హక్కుల కోసం, మహిళల రక్షణ కోసం నిత్యం పోరాడే నాలాంటి వారికి 'లాక్‌డౌన్'తో చేతులు, కాళ్లు కట్టేసినట్టు అనిపిస్తుంది. అయితే ఈ సంకట స్థితిలో ఇంటిపట్టునే ఉండడం కూడా ఒకరకంగా ప్రజలకు 'అండ'గా నిలబడడమే కదా. కరోనా మహమ్మారి నియంత్రణ మన తక్షణ కర్తవ్యం. అందుకోసం అందరం కలిసి పనిచేయాలి. ఇంటి నుంచి బయటకు రాకుండా ఉండడమే దీని నియంత్రణకు ప్రధాన ప్రత్యామ్నాయం. అయితే ఒక సోషల్ యాక్టివిస్టుగా సుమారు 40 ఏళ్లుగా దేశంలో అనేక ఉద్యమాలలో పనిచేసిన నాకు ప్రజలను ఆదుకోవాల్సిన ఈ సమయంలో వారికి దూరంగా ఉండాల్సి వస్తోందని బాధగా ఉంది. ఇన్నేళ్లలో ఎన్నో సంక్షోభ సమయాలలో ప్రజలతో ఉంటూ పనిచేశా. 1984లో సిక్కులపై దాడులప్పుడు జనాల్లోకి వెళ్లా. నా వంతు తోడ్పాటు అందించా. బాబ్రీ మసీదు ఇష్యూ సందర్భంగా ఢిల్లీలో అల్లర్లు చెలరేగాయి. అప్పుడూ ప్రజలకు అండగా నిలబడ్డా. లక్నోకి వెళ్లినపుడు 'మాకు మందిర్, మసీదు వద్దు... శాంతి కావాల'ని నినదించాం. సీపీఎం తరపున ఎన్ఆర్‌సీ రద్దు చేయాలని పోరాడా. అయితే ఈ సంక్షోభ సమయంలో నేను నిర్వర్తించాల్సిన సామాజిక బాధ్యత 'సోషల్ డిస్టెన్స్' అని భావించి ఇంటికే కట్టుబడి ఉన్నా. లాక్‌డౌన్‌కు ముందు ఇంటి నుంచి పొద్దున్న బయటకు వెడితే సాయంత్రం ఎప్పటికో ఇల్లు చేరేదాన్ని. ఇపుడు 'కర్ఫ్యూ ఎప్పుడు తీసేస్తారా?' అని ఎదురుచూస్తున్నా.

ఒక ఉద్యమకారిణిగా కరోనా మహమ్మారి విస్తరిస్తున్న ఈ వేళలో ప్రజలకు అండగా నిలవాలని, వారిలోని భయం పోగొట్టాలని తపన పడుతున్నా. వారికి వైరస్‌పై అడ్వకసీ వర్కు చేద్దామనిపిస్తోంది. కానీ కరోనా వైరస్ నియంత్రణకు ఐసోలేషన్ ఒక్కటే మార్గం కాబట్టి దాన్ని పాటిస్తున్నా. అంటే ఉద్యమం కొత్త రూపంలో అన్నమాట. తొందరలోనే ఈ వైరస్ అంతరించి అందరం 'చేయి చేయి కలుపుకునే' రోజు కోసం ఆశగా ఎదురుచూస్తున్నా."



**- ఆశాలత**
సిఇసి మెంబర్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా)

---

# రెహమాన్ షేర్ చేశారు!

ప్రపంచమంతటా కరోనా భయాందోళనలు, నిరుత్సాహం నెలకొని ఉన్న సమయంలో సోషల్ మీడియాలో ఒక పాట ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తోంది. భయాందోళనలను దూరం చేస్తూ అందరూ ఒక్కటై పోరాడితే వైరస్‌పై విజయం కష్టమేమీ కాదని ప్రేరణ నింపుతోంది. 'న కరోనా కరో'... పాట ఇప్పుడు సోషల్ మీడియాలో ఓ సంచలనం. పుణేకు చెందిన హిందుస్తానీ క్లాసికల్ సింగర్ సందీప్ రణడే పాడిన ఈ పాట ప్రముఖ సంగీత దర్శకుడు ఎ.ఆర్ రెహమాన్‌ను సైతం ఆకట్టుకుంది. ఎంతగా అంటే ఆ పాటను ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పోస్ట్ చేసి మరీ మెచ్చుకున్నాడు. నిజానికి సందీప్ ఈ పాట పాడే సమయానికి మనదేశంలో లాక్‌డౌన్ విధించలేదు. చైనాలో మాత్రం అప్పుడే వైరస్ వ్యాప్తి విజృంభిస్తోంది. ఆ సమయంలో ప్రజల్లో ఒక భయం నెలకొని ఉంది. అప్పుడే 'న కరోనా కరో' పాటను పాడి సోషల్ మీడియాలో పెట్టాడు. అంతే... ప్రపంచం నలుమూలల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది.

**సంగీతానిదే ఆ శక్తి..**

డిప్రెషన్‌ను, ఒంటరితనాన్ని దూరం చేయడానికి సంగీతం బాగా ఉపయోగపడుతుందని అంటారు సందీప్. విశేషం ఏమిటంటే మహదేవన్, పండిట్ అజయ్ పోహంకర్, పండిట్ సురేష్ తల్‌వాల్కర్, దలేర్ మెహందీ, అద్నాన్ సమీ, నానాపటేకర్ వంటి ప్రముఖులు సైతం సందీప్ ప్రయత్నాన్ని మెచ్చుకున్నారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలలో సందీప్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు. "అంతటా భయాందోళనలు నెలకొన్ని ఉన్న ఈ సమయంలో ప్రజల్లో ఒక చిన్న ఆశను నిప్పు రవ్వలా రేకెత్తించాలనే ప్రయత్నంలో ఈ పాటను పాడాను. ఇప్పుడు ఆ నిప్పురవ్వ అగ్నిగోళంలా మారింది" అని తన మనసులో మాటను పంచుకున్నారు సందీప్.

వైరల్



---

# మారండి బాబూ!

వినూత్నం



'రోగం వస్తుందిరా బాబూ! ఇంట్లోంచి బయటకు రావద్దు' అని చెప్పినా జనం వినడం లేదు. వీధుల్లోకి వచ్చిన వారిని తరిమికొట్టినా, వాహనాలు స్వాధీనం చేసుకున్నా మార్పు లేదు. అవసరం లేకపోయినా వీధుల్లో తిరుగుతున్న ప్రజల్ని అదుపు చేయడానికి బెంగళూరు పోలీసులు అన్ని ఐడియాలనూ వాడేశారు. 'ఇంకేం చెయ్యగలం?' అని తలలు పట్టుకున్న సమయంలో ఓ ఆలోచన ఫ్లాష్‌లా వెలిగింది. సోషల్ మీడియా వినియోగంలో బెంగళూరు సిటీ పోలీసులు చాలా చురుగ్గా ఉంటారు. వాళ్ల ఒక్క ట్విట్టర్ ఖాతాకే పదమూడు లక్షల మంది ఫాలోయర్స్ ఉన్నారు. ఎవరు చెప్పినా వినని జనానికి... ముఖ్యంగా యువతరానికి తెరవేలుపుల మాటల్లో చెబితే మనసుకు పడుతుందన్న ఆలోచనతో సరికొత్త మీమ్స్ తయారు చేసి, ట్విట్టర్‌లోని తమ అధికారిక ఖాతా ద్వారా వదిలారు. ఒక మీమ్‌లో ప్రసిద్ధ కన్నడ నటుడు జగ్గేశ్ ఫొటోను "ఇంట్లోనే ఉంటే సురక్షితం" అంటూ సందేశంతో జోడించారు. ఆ ఫొటో 2009లో వచ్చిన 'ఎద్దేళు మంజునాథ' సినిమాలోది. ఆ చిత్రంలో కొండంత బద్ధకంతో పని చెయ్యకుండా, ఇల్లు కదలని మనిషిగా జగ్గేశ్ నటించారు. అలాగే "నువ్వు బయటకు వెళ్తే, అది ఒక ప్రయాణం ఏమాత్రం కాదు. చివరికి క్వారంటైన్లో తేలుతావ్" అనే సందేశాన్ని మేనకోడలికి మేనమామ చెబుతున్నట్టు వినిపించారు. దానికి 'మాణిక్య' అనే సినిమాలోని బొమ్మను జోడించారు. ఈ మీమ్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నెటిజన్లు అభినందించడంతో పాటు రీ-ట్వీట్లు చేస్తున్నారు.

**• కామిక్ కరోనా** కార్టూన్: చారి పి.ఎస్




---

# 'లాక్‌డౌన్' వంటలివి!



ఆహారం - ఆరోగ్యం

రుచికరంగా ఉంటూనే ఆరోగ్యకరమైన వంటలు కొన్ని ఉన్నాయి. ఈ 'లాక్‌డౌన్' కాలంలో ఖర్చు తక్కువ, అదే సమయంలో పెద్దగా సమయం పట్టని వంటలు ఇవి.

**పచ్చి మిరపకాయ పచ్చడి:** ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మెటబాలిక్ యాక్టివిటీని కూడా ఎక్కువ పరిమాణంలో ఉంచుతుంది. ఒక్క స్పూన్ పచ్చి మిరపకాయ పచ్చడి కలుపుకొని తింటే చాలు... ఎలాంటి ఆహారమైనా రుచిగా మారుతుంది.

*కావాల్సినవి:* వేయించిన పచ్చిమిర్చి అరకప్పు, వేయించిన చింతపండు చిన్న నిమ్మకాయంత, వేయించిన జీలకర్ర అర స్పూను, వెల్లుల్లి 5 రెబ్బలు, కరివేపాకు రెబ్బలు వేయించినవి 6, తగినంత ఉప్పు

*తయారీ:* అన్నీ కలిపి గ్రైండ్ చేసుకుంటే రుచికరమైన పచ్చడి రెడీ.

**మామిడికాయ పచ్చడి:** మామిడికాయ ముక్కలు కొద్దిగా నూనెలో వేగించాలి (ఆప్షనల్), కొబ్బరి పచ్చడి (కొబ్బరి తురిమి మిగిలిన పదార్థాలు కలపాలి), వంకాయ పచ్చడి (వంకాయను మంటపై కాల్చి, తొక్క తీసి గుజ్జును మిగిలిన పదార్థాలతో కలపాలి), దొండకాయ పచ్చడి, క్యాబేజీ పచ్చడి, దోసకాయ పచ్చడి, టొమాటో పచ్చడి)... వీటన్నింటిని పచ్చిమిర్చి పచ్చడిలాగే చేసుకోవాలి.

**పప్పు దినుసుల పొడులు:** కంది పొడి, పుట్నాల పొడి, పెసర పొడి, సెనగ పొడి. వీటిలో ఒక కప్పు పొడికి ఆరు పచ్చి మిర్చి, అర నిమ్మకాయంత చింతపండు వేగించి, గ్రైండ్ చేసి కలుపుకోవాలి. 6 పచ్చి వెల్లుల్లి రెబ్బలను దంచి, తగినంత ఉప్పుకలిపి మిక్స్ చేయాలి.

ఇంట్లోనే ఎక్కువగా కాలక్షేపం చేయాల్సిన ఈ కాలంలో రసం, లేదంటే చారు తరచుగా చేసుకోండి. రసం హైడ్రేషన్‌కి ఉపయోగపడుతుంది. మిరియాలు, కరివేపాకు, జీలకర్రలతో రసం చేసుకొంటే రుచితో పాటు ఆరోగ్యం కూడా. ప్రతి నాలుగు గంటలకు ఒకసారి రసం కప్పులో పోసుకుని తాగొచ్చు. టొమాటో రసం, చింతపండు రసం, శొంఠి రసం, ములక్కాడల రసం, ముల్లంగి రసం, పచ్చి పులుసు, వగైరా కూడా చేసుకోవచ్చు.

**టొమాటో రసం:** రెండు టొమాటోలు, కొద్దిగా చింతపండు, 4 పచ్చిమిర్చి, కొద్దిగా పసుపు, కారం, ఉప్పు, 4 దంచిన వెల్లుల్లి... వీటన్నింటి కలిపి బాగా మరగనివ్వాలి. తర్వాత తాలింపు వేసుకోవాలి. ఇలాగే చింతపండు రసం, శొంఠి రసం, ముల్లంగి రసం వేసుకోవాలి.

**బియ్యపు లడ్డు:** ఒక కప్పు బియ్యం వేగించి పిండి పట్టాలి. ఒక స్పూను శొంఠి, ఒక కప్పు తురిమిన బెల్లం, అరకప్పు నెయ్యి, తగినంత పాలు కలిపి లడ్డూ చేసుకోవాలి.

**పెసర స్వీట్:** ఒక కప్పు పెసర పప్పు, అర కప్పు బెల్లం, తగినంత నీరు, అరకప్పు నెయ్యి, అర స్పూను శొంఠి, అర స్పూను మిరియాల పొడిని కలిపి మెత్తగా అయ్యేదాకా కుక్ చేస్తే రుచికరమైన స్వీట్ రెడీ.

**పెసర లడ్డు:** ఒక కప్పు పెసరపప్పు పిండి (పెసరపప్పు కమ్మటి వాసన వచ్చేదాకా వేగించి పిండి పట్టాలి), అర కప్పు మరిగిన వేడి నెయ్యి, అర కప్పు తురిమిన బెల్లం, అర టీ స్పూను శొంఠి కలిపి లడ్డూ చేసుకోవాలి.



• **డాక్టర్ బి.జానకి,** న్యూట్రిషనిస్ట్
drjanakibadugu@gmail.com

# కరోనాకు 'భారత్ బయో' వ్యాక్సిన్

- ఫ్లూజెన్‌తో భాగస్వామ్యం
- ఏడాది చివరకు హ్యూమన్ క్లినికల్ పరీక్షలు
- 30 కోట్ల డోసుల తయారీ యోచన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన వ్యాక్సిన్ కంపెనీ భారత్ బయోటెక్.. కరోనా వైరస్‌కు వ్యాక్సిన్‌ను తయారు చేస్తోంది. ఇందుకు విస్కాన్సిన్- మాడిసన్ విశ్వవిద్యాలయం, వ్యాక్సిన్ కంపెనీ ఫ్లూజెన్‌తో చేతులు కలిపింది. భాగస్వాములకు చెందిన వైరాలజిస్టులతో కలిసి ఇంట్రానాజల్ వ్యాక్సిన్ 'కోరోఫ్లూ'ను అభివృద్ధి చేసి పరీక్షలు చేస్తున్నట్లు భారత్ బయోటెక్ బిజినెస్ డెవలప్‌మెంట్ అధిపతి రాచెస్ ఎల్లా తెలిపారు. ఫ్లూజెన్ కంపెనీకి చెందిన ఫ్లూ వ్యాక్సిన్ ఆధారంగా కరోనా వ్యాక్సిన్ అభివృద్ధి చేస్తున్నామని.. ఫేజ్ 1, ఫేజ్ 2 క్లినికల్ పరీక్షల దశలో ఉందని వివరించారు. ఈ ఔషధాన్ని ముక్కు ద్వారా తీసుకుంటారు. 'వ్యాక్సిన్‌ను భారత్ బయోటెక్ తయారు చేస్తుంది. క్లినికల్ పరీక్షలు నిర్వహిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేయడానికి 30 కోట్ల డోస్‌లను తయారు చేస్తుంది. ఒప్పందం ప్రకారం ఫ్లూజెన్ ప్రస్తుతం తన వద్ద ఉన్న తయారీ ప్రాసెసస్‌లను భారత్ బయోటెక్‌కు బదిలీ చేస్తుంద'ని రాచెస్ ఎల్లా తెలిపారు. భారత్ బయోటెక్ ఇప్పటి వరకూ 16 వ్యాక్సిన్లను వాణిజ్య పరంగా అభివృద్ధి చేసి మార్కెట్లోకి తీసుకువచ్చిందని, 2009లో ప్రపంచాన్ని బెంబేలెత్తించిన హెచ్1ఎన్1 ఫ్లూ వైరస్‌కు కూడా వ్యాక్సిన్ అభివృద్ధి చేసిందని వివరించారు. 'కోరోఫ్లూ' వ్యాక్సిన్‌పై యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్-మాడిసన్ వైరాలజిస్టులు జంతువులపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందుకు మూడు నుంచి ఆరు నెలల సమయం పట్టొచ్చు. అనంతరం మనుషులపై సేఫ్టీ, ఎఫికసీ పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకు హైదరాబాద్‌లో ఈ వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేస్తారు.

కోరోఫ్లూపై 2020 చివరి నాటికి హ్యూమన్ క్లినికల్ పరీక్షలు జరిగే వీలుంది. శ్వాసకోశ ఇబ్బందులకు ముకోసాల్ ఇమ్యూనిటీ చాలా కీలకం. కోరోఫ్లూ ఇన్‌ఫ్లుయంజా ఆధారిత వ్యాక్సిన్. అందువల్ల హెచ్2ఎన్2 స్ట్రెయిన్‌కు రోగనిరోధక శక్తిని ఇస్తుంది. అందువల్ల కోవిడ్-19 వైరస్‌ను రూపుమాపడంలో కోరోఫ్లూ బాగా పనిచేయగలదని భారత్ బయోటెక్ భావిస్తోంది. ఇతరుల నుంచి సోకే వ్యాధుల వల్ల ప్రజలు చనిపోవడమే కాక.. ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలుతున్నాయని రాచెస్ ఎల్లా అన్నారు.

# 30 ఏళ్ల కనిష్ఠానికి వృద్ధి!

- ఈ ఏడాది భారత్ జీడీపీ వృద్ధి 2 శాతమే..
- లాక్‌డౌన్, ప్రపంచ ఆర్థిక మాంద్యమే కారణం

**కరోనా విజృంభణతో అతలాకుతలమవుతోన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే మాంద్యంలోకి జారుకుందని ఐఎంఎఫ్ ఈమధ్యనే ప్రకటించింది. ఇప్పటికే తిరోగమనంలో పయనిస్తున్న భారత వృద్ధి రేటు ఇక అట్టడుగు స్థాయికి పడిపోనుందని తాజాగా పలు ఆర్థిక సంస్థలు హెచ్చరించాయి.**




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2020-21)లో భారత జీడీపీ వృద్ధి రేటు 2 శాతానికి పరిమితం కానుందని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ ఫిచ్ అంటోంది. 30 ఏళ్ల క్రితం (90వ దశకంలో) తొలి దశ ఆర్థిక సంస్కరణలు చేపట్టిన తర్వాత దేశానికిదే కనిష్ఠ స్థాయి వృద్ధి కానుందని ఫిచ్ పేర్కొంది. కరోనా దెబ్బకు భారత్‌తో పాటు ప్రపంచంలోని 100కు పైగా దేశాలు లాక్‌డౌన్ ప్రకటించాయి. దాంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యం కోరల్లో చిక్కుకుంది. ఈ నేపథ్యంలో పలు ఆర్థిక సంస్థలు, ఏజెన్సీలు భారత వృద్ధి రేటు అంచనాలకు భారీగా కోత పెడుతున్నాయి.

**2020-21 వృద్ధి అంచనా (%)**

| సంస్థ | తాజా | గత |
|---|---|---|
| ఫిచ్ | 2.0 | 5.1 |
| ఏడీబీ | 4.0 | -- |
| ఎస్ అండ్ పీ | 3.5 | 5.2 |
| ఇండియా రేటింగ్స్ | 3.6 | 5.5 |

### తొలుత 5.6%, తర్వాత 5.1%, తాజాగా..

2020-21 ఆర్థిక సంవత్సరం వృద్ధి అంచనాను తగ్గించడం ఇది రెండోసారి. గత ఏడాది డిసెంబరులో 5.6 శాతంగా అంచనా వేసిన ఫిచ్.. ఈ మార్చిలో 5.1 శాతానికి తగ్గించింది. ఇప్పుడు ఏకంగా రెండు శాతానికి కుదించింది. మాంద్యం పరిస్థితుల్లో వినియోగదారుల కొనుగోలు శక్తి భారీగా తగ్గనుందని ఫిచ్ పేర్కొంది. దాంతో ఎంఎస్ఎంఈలు, సేవా రంగాలు అత్యధికంగా ప్రభావితం కానున్నాయని హెచ్చరించింది. గతవారంలో మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ కూడా వృద్ధి అంచనాలకు భారీగా కోత పెట్టింది. 2020 సంవత్సరానికి భారత వృద్ధి రేటు అంచనాను గతంలో అంచనా వేసిన 5.3 శాతం నుంచి 2.5 శాతానికి కుదించింది.

### వచ్చే ఏడాది 6.2% : ఏడీబీ

వచ్చే ఆర్థిక సంవత్సరం (2021-22) లో వృద్ధి భారీగా పుంజుకొని 6.2 శాతానికి చేరుకోవచ్చని ఏడీబీ ఆశాభావం వ్యక్తం చేసింది.

### వృద్ధి 1 శాతానికి!

ప్రస్తుత ఏడాదిలో భారత వృద్ధి రేటు 1 శాతానికి పడిపోవచ్చని లండన్‌కు చెందిన రీసెర్చ్ కన్సల్టెన్సీ 'క్యాపిటల్ ఎకనామిక్స్' అంచనా వేసింది. గడిచిన 40 ఏళ్లకు పైగా కాలంలో దేశానికిదే కనిష్ఠ స్థాయి వృద్ధి కానుందని సంస్థ పేర్కొంది. కరోనా విజృంభణతో భారత్ ఆర్థికంగా తీవ్ర దుష్పరిణామాలు ఎదుర్కోనుందని క్యాపిటల్ ఎకనామిక్స్ హెచ్చరించింది.

### కరోనా మూల్యం రూ.312 లక్షల కోట్లు

అమెరికా, యూరప్ తదితర అగ్రరాజ్యాలన్నీ కరోనా దెబ్బకు విలవిలలాడుతున్నాయి. ఈ మహమ్మారితో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గరిష్ఠంగా 4.1 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.312 లక్షల కోట్లు) మేర గండి పడవచ్చని ఏడీబీ అంచనా వేసింది. ఈ మొత్తం ప్రపంచ జీడీపీలో దాదాపు 5 శాతానికి సమానమని తాజా నివేదికలో పేర్కొంది.

*భారత ఆర్థిక వృద్ధి గడిచిన ఆరు త్రైమాసికాలుగా తగ్గుతూ వస్తోంది. కరోనా దెబ్బకు పూర్తిగా పడకేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర వృద్ధి రేటు 1991 తర్వాత అత్యంత కనిష్ఠ స్థాయిని చవిచూడనుంది. 2024-25 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని 5 లక్షల కోట్ల డాలర్లకు పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యం.. పరిస్థితులు అనుకూలంగా ఉన్నపుడే కష్టసాధ్యమని నా గత అధ్యయనాలు తేల్చాయి. వైరస్ విలయంలో ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి కూరుకుపోయింది. ఎప్పుడు కోలుకుంటుందో స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో 5 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీ సుదూరపు కలే.*

*- ఎన్ ఆర్ భానుమూర్తి, ప్రొఫెసర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ*

## సైయెంట్, హిటాచీ రైల్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ సేవలందించడానికి హిటాచీ రైల్‌తో సైయెంట్ ఒప్పందం కుదుర్చుకుంది. సిగ్నలింగ్ టెక్నాలజీ, ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేసే సామర్థ్యాలను పెంచుకోవడానికి హిటాచీ రైల్‌కు ఈ ఒప్పందం దోహదం చేస్తుంది. ఒప్పందంలో భాగంగా భారత్‌లో హిటాచీ రైల్ కోసం సైయెంట్ సెంట్రల్ డెలివరీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి నిర్వహిస్తుంది. అలానే యూఎస్‌లో ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంది. ఈ రెండు కేంద్రాల ద్వారా అప్లికేషన్ లాజిక్ డిజైన్, హార్డ్‌వేర్ డిజైన్ సేవలను అందిస్తుంది.

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**



| | | | |
|---|---|---|---|
| 3వ తేదీకి.. | | విజయవాడ | 345 |
| హైదరాబాద్ | 335 | విశాఖపట్నం | 345 |
| 4వ తేదీకి.. | | వరంగల్ | 338 |
| చిత్తూరు | 373 | డజను గుడ్లు రూ. | 54 |
| గోదావరి | 345 | | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 72 | విజయవాడ | 62 |
| వరంగల్ | 72 | గుంటూరు | 60 |
| మహబూబ్‌నగర్ | 72 | ఒంగోలు | 58 |
| కరీంనగర్ | 72 | చిత్తూరు | 75 |
| కర్నూలు | 72 | నెల్లూరు | 75 |
| విశాఖపట్నం | 50 | అనంతపురం | 73 |
| గోదావరి | 65 | | |

## పౌల్ట్రీకి రూ.22,500 కోట్ల నష్టం

- ఆదుకోమని ప్రధానికి ఏఐపీబీఏ వినతి

హైదరాబాద్: కరోనా వైరస్ వ్యాప్తి.. ఆ తర్వాత లాక్‌డౌన్ కారణంగా ఫిబ్రవరి ప్రారంభం నుంచి దేశంలోని కోళ్ల పరిశ్రమ దాదాపు రూ.22,500 కోట్ల నష్టాలను చవిచూసింది. ఫిబ్రవరి మొదటి వారంలో చికెన్, గుడ్లు తింటే కరోనా వస్తుందని వ్యాపించిన వదంతుల వల్ల కోళ్ల పరిశ్రమ తీవ్రంగా నష్టపోయింది. ఇది దాదాపు ఆరు వారాల వరకూ కొనసాగిందని ఆల్ ఇండియా పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ (ఏఐపీబీఏ) వైస్ ప్రెసిడెంట్ సురేశ్ చిట్టూరి తెలిపారు. దీనిపై స్పష్టత లభించిన తర్వాత కొద్దిగా కోలుకున్నప్పటికీ లాక్‌డౌన్‌తో రాష్ట్రాల మధ్య చికెన్, గుడ్ల రవాణా నిలిచిపోయిందని ఇది పరిశ్రమకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందన్నారు. నష్టాల్లో కూరుకుపోయిన పరిశ్రమను ఆదుకోవడానికి కేంద్రం జోక్యం చేసుకుని రుణాల పునర్‌వ్యవస్థీకరణ వంటి చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ కోరిందని చెప్పారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి మార్చి 30న అసోసియేషన్ వినతి పత్రం సమర్పించిందని తెలిపారు. సత్వరమే ఆర్థిక సాయాన్ని అందించటమే కాకుండా పరిశ్రమను ఆదుకునే ప్యాకేజీని ప్రకటించాలని కోరినట్లు సురేశ్ వెల్లడించారు.

## ప్రయాణికుల విమానంలో సరుకు రవాణా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రయాణికుల విమానంలో విదేశాలకు నిత్యావసర, అత్యవసర వస్తువులు రవాణా అయ్యాయి. డీజీసీఏ అనుమతులకు లోబడి గురువారం ఖతార్ కార్గోకు చెందిన క్యూఆర్ 8311 విమానం హైదరాబాద్ నుంచి దోహకు ఔషధాలు, ఇతర నిత్యావసర వస్తువులను తీసుకువెళ్లిందని జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సీఈఓ ఎస్‌జీకే కిశోర్ తెలిపారు.

## స్మార్ట్‌ఫోన్ల పరిశ్రమకు కష్టకాలం

- లాక్‌డౌన్‌తో రూ.15,000 కోట్ల నష్టం!
- కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ అంచనా



న్యూఢిల్లీ: కరోనా లాక్‌డౌన్ దెబ్బతో దేశీయ స్మార్ట్‌ఫోన్ల పరిశ్రమ విలవిల్లాడుతోంది. మొబైల్ ఫోన్ల అమ్మకాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. లాక్‌డౌన్ ప్రకటించడానికి ముందు అంటే మార్చి మధ్యకాలం వరకు మొబైల్ ఫోన్ల అమ్మకాలు బాగానే జరిగాయి. లాక్‌డౌన్ తర్వాత పూర్తిగా నిలిచిపోయాయి. ఆన్‌లైన్‌లోనూ అమ్మకాలు జరగడం లేదు. ఏప్రిల్‌లోనూ అమ్మకాలు అంతంత మాత్రంగానే సాగే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలోని స్మార్ట్‌ఫోన్ల పరిశ్రమ 200 కోట్ల డాలర్ల (రూ.15,000 కోట్లు) రాబడిని కోల్పోయే అవకాశం ఉందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ అంచనా వేస్తోంది. గత ఏడాదిలో 15.8 కోట్ల స్మార్ట్‌ఫోన్లు అమ్ముడయ్యాయి. ఈ ఏడాదిలో మాత్రం అమ్మకాలు 3 శాతం తగ్గి 15.3 కోట్ల యూనిట్లకు చేరుకోవచ్చని అంచనా. మార్చిలో అమ్మకాలు గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 27 శాతం తగ్గవచ్చని అంచనా వేస్తున్నామని, ఏప్రిల్ 14వరకు లాక్‌డౌన్ కొనసాగితే అమ్మకాలు దాదాపు 60 శాతం తగ్గే ఆస్కారం ఉందని, ఇదే కంపెనీలు తమ రాబడిని కోల్పోయేందుకు దారితీస్తోందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్ తరుణ్ పాఠక్ తెలిపారు. లాక్‌డౌన్ కొనసాగితే నష్టం మరింత ఎక్కువగా ఉంటుందన్నారు.

కాగా, లాక్‌డౌన్ నేపథ్యంలో కొత్త టెలికాం వినియోగదారుల సంఖ్య తగ్గిపోయింది. నెలవారీగా సగటున 15-30 లక్షల మంది కొత్త వారు చేరుతుంటే.. గత మార్చిలో మాత్రం ఈ సంఖ్య 5 లక్షలకు తగ్గిపోయింది.

## పీఎం-కేర్స్‌కు ఆదిత్య బిర్లా గ్రూప్ రూ.500 కోట్ల విరాళం

హైదరాబాద్: పీఎం-కేర్స్ ఫండ్‌కు భారత పారిశ్రామిక రంగం భారీ ఎత్తున విరాళాలు అందజేస్తున్నాయి. కోవిడ్-19 కట్టడి కోసం ఆదిత్య బిర్లా గ్రూప్ రూ.500 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. కాగా కోవిడ్-19పై పోరాటానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి గంగవరం పోర్టు రూ.3 కోట్ల విరాళం ఇచ్చింది. ఈ మేరకు చెక్‌ను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి గంగవరం పోర్టు ఛైర్మన్ డీవీఎస్ రాజు, సీఈఓ ఎన్ సాంబశివరావు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాక్సిన్ తయారీ కంపెనీ ఇండియన్ ఇమ్యునాలిజికల్ లిమిటెడ్ (ఐఐఎల్) రూ.2.33 కోట్ల సాయం అందించగా యూపీఎల్ రూ.75 కోట్ల విరాళం ఇచ్చింది.

## సోషల్ మీడియాలో అతి చేస్తే వేటు: ఎస్‌బీఐ

కోల్‌కతా : సోషల్ మీడియాలో ఉద్యోగులు ఎవరైనా అతి చేస్తే వారిపై చర్యలు తప్పవని ఎస్‌బీఐ హెచ్చరించింది. ఈ మేరకు ఆయా సర్కిళ్లలోని బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్లు (సీజీఎం) అందరికీ లేఖలు అందాయి. ఇటీవల కొందరు ఉద్యోగులు సోషల్ మీడియాలో బ్యాంకు విధానాలు, మేనేజ్‌మెంట్, శాఖల పనితీరుపై విమర్శలు పోస్టు చేస్తుండడంతో ఎస్‌బీఐ ఈ చర్య తీసుకుంది.

# స్పోర్ట్స్

## సఫారీలకు కరోనా నెగిటివ్



న్యూఢిల్లీ: కరోనా వైరస్ కారణంతో గత నెలలో భారత పర్యటన నుంచి దక్షిణాఫ్రికా జట్టు అర్ధంతరంగా స్వదేశానికి తిరిగి వెళ్లింది. 14 రోజులు స్వీయ నిర్బంధంలో ఉన్న సఫారీ ఆటగాళ్లకు తాజాగా వైద్య పరీక్షలు నిర్వహించగా నెగిటివ్ రిపోర్టు వచ్చిందని క్రికెట్ సౌతాఫ్రికా వైద్యాధికారి షుయబ్ మంజ్రా తెలిపారు.

## జూన్ 29, 2021 ఒలింపిక్స్ అర్హతకు గడువు

**లోసాన్:** టోక్యో విశ్వ క్రీడలకు అర్హత పొందాల్సిన సమయాన్ని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) శుక్రవారం ప్రకటించింది. 2021కి వాయిదా వేసిన ఈ క్రీడలకు అర్హత సాధించే గడువును వచ్చే ఏడాది జూన్ 29గా ఖరారు చేసింది. ఈమేరకు జాతీయ ఒలింపిక్ కమిటీలకు ఐఓసీ డైరెక్టర్ జేమ్స్ మెక్‌లియోడ్ సమాచారం పంపారు. అలాగే టోక్యో క్రీడలకు ఎంట్రీలను పంపేందుకు తేదీని జూలై 5, 2021గా ప్రకటించారు.

## మారథాన్ రన్నర్‌కు జైలు




**నైరోబి (కెన్యా):** లాక్‌డౌన్ ఉన్నా నిబంధనలను ఉల్లంఘించి మద్యం సేవించిన కెన్యా వరల్డ్ రికార్డ్ మాజీ మారథాన్ రన్నర్ విల్సన్ కిప్సాంగ్ జైలు పాలయ్యాడు. ఓ రిసార్ట్‌లో తన స్నేహితులతో కలిసి మద్యం సేవించి, జూదం ఆడుతుండగా కిప్సాంగ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రాత్రంతా జైలులో ఉంచారు. కిప్సాంగ్ కోర్టులో నేరాన్ని అంగీకరించడంతో రూ.4 లక్షల వ్యక్తిగత పూచీకత్తు చెల్లించి బెయిల్‌పై విడుదలయ్యాడు. 2013 బెర్లిన్ మారథాన్ పోటీల్లో ప్రపంచ రికార్డు నెలకొల్పిన కిప్సాంగ్ స్వయంగా పోలీస్ ఇన్‌స్పెక్టర్ కావడం కొసమెరుపు.

## కృష్ణప్రియ 5 లక్షల విరాళం



**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** కరోనా బాధితులను ఆదుకునేందుకు తెలంగాణ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి శ్రీ కృష్ణప్రియ సీఎం సహాయ నిధికి రూ.5 లక్షల విరాళాన్ని అందించింది. తన సంపాదనలో కొంత భాగాన్ని కరోనా బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చానని కృష్ణప్రియ తెలిపింది.

# కరోనాపై పోరులో.. స్ఫూర్తి నింపండి!




- ఐదు అంశాలతో ప్రచారం చేయండి
- క్రీడాకారులకు ప్రధాని మోదీ పిలుపు

**న్యూఢిల్లీ :** కరోనాపై యుద్ధంలో కలిసి రావాలని ప్రధాని మోదీ దేశ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిపై భారత్ యావత్తూ పోరాడుతోందని..ఇందులో ఆటగాళ్ల పాత్ర ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. 21 రోజుల లాక్‌డౌన్ తరుణంలో మీరు (క్రీడాకారులు)నింపే స్ఫూర్తితో కోవిడ్-19పై సమరంలో దేశమంతా మరింత చైతన్యమవుతుందన్నారు. కరోనాపై క్రీడాకారులతో చర్చించేందుకు క్రీడల మంత్రి కిరణ్ రిజిజుతో కలిసి ప్రధాని మోదీ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆటగాళ్ల సలహాలు, సూచనలు కోరారు. సుమారు 40 మంది అథ్లెట్లు ఇందులో పాల్గొన్నారు. అయితే క్రీడాకారుల్లో కొద్దిమందికి మాత్రమే ఒక్కొక్కరికి మూడేసి నిమిషాలు మాట్లాడే అవకాశం ఇచ్చారు. ప్రధానితో మాట్లాడిన వారిలో సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, సౌరవ్ గంగూలీ, పీవీ సింధు, అథ్లెట్ హిమాదాస్, మహిళా హాకీ కెప్టెన్ రాణీ రాంపాల్, టెన్నిస్ క్రీడాకారిణి అంకితా రైనా, కబడ్డీ ఆటగాడు అజయ్ ఠాకూర్, పారా అథ్లెట్ శరద్ కుమార్ తదితరులున్నారు. కాగా..కరోనాపై పోరాటానికి ప్రధాని చేపడుతున్న చర్యలను క్రీడాకారులంతా ప్రశంసించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. 'మీ సూచనలు స్వీకరిస్తాం. టీమిండియా మాదిరి ప్రస్తుతం కరోనాపై పోరాడుతున్నాం. మీ స్ఫూర్తితో భారత్ కొత్త బలం సంతరించుకుంటుందన్న నమ్మకం నాకుంది' అని అన్నారు. 'క్రీడల్లో దేశానికి ఎనలేని పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారు. ఈ ఆపత్కాలంలో దేశ ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపడంలో మీ పాత్ర చాలా కీలకం' అని పేర్కొన్నారు. 'సంకల్పం, సంయమనం, సానుకూలత, గౌరవం, సహకారం అనే ఐదు అంశాలతో ప్రజలకు సందేశాలివ్వండి. అలాగే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాల్సిన విషయాన్ని, భౌతిక దూరాన్ని, పరిశుభ్రతను పాటించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పండి. ఇంకా.. ఆయుష్ మంత్రిత్వ శాఖ సూచనలను పాటించాలని కూడా విజ్ఞప్తి చేయండి' అని ప్రధాని సూచించారు. ఈమేరకు ప్రధాని సమావేశ ఫొటోను స్టార్ షట్లర్ సాయిప్రణీత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. కాగా ధోనీ, కేఎల్ రాహుల్, బైచుంగ్ భూటియా, మేరీకోమ్ తదితరులను ఆహ్వానించినా ఇంటర్నెట్ కనెక్టివిటీ తదితర సాంకేతిక సమస్యలవల్ల పాల్గొనలేకపోయారు.

### మీ చర్యలకు కృతజ్ఞతలు: సింధు

దేశంలో కరోనా విజృంభిస్తోందని, దాని నివారణకు ప్రధాని తీసుకుంటున్న చర్యలకు కృతజ్ఞతలు తెలిపినట్టు పీవీ సింధు వెల్లడించింది. కరోనా కట్టడికి ఆయన తీసుకొనే ఏ చర్యలకైనా మద్దతు ఇవ్వనున్నట్టు తెలిపానని చెప్పింది. ప్రజలందరూ ఇళ్లలోనే ఉండేలా కట్టడిచేస్తున్న పోలీసు శాఖకు ఈ సందర్భంగా సింధు కృతజ్ఞతలు తెలిపింది. అలాగే రైళ్లను ఐసోలేషన్ వార్డులుగా మారుస్తూ తీసుకున్న నిర్ణయం కూడా అద్భుతమని కొనియాడింది.

### 14 తర్వాత కీలకం: సచిన్



కరోనాపై యుద్ధంలో ఈనెల 14 తర్వాతి సమయం ఎంతో కీలకమని సచిన్ అన్నాడు. ఇదే విషయాన్ని ప్రధాని మోదీ కూడా చెప్పినట్టు తెలిపాడు. '14 తర్వాత దేశ ప్రజలు ఎంత సంయమనం పాటిస్తారనేది అత్యంత ముఖ్యమైన అంశం. లాక్‌డౌన్ ఫలితాలు అప్పుడే తెలుస్తాయని నేను చెప్పిన విషయంతో ప్రధాని కూడా ఏకీభవించారు' అని మోదీతో సమావేశం అనంతరం టెండూల్కర్ తెలిపాడు. కరోనా వైరస్ తగ్గుముఖం పట్టాక కూడా షేక్‌హ్యాండ్ కాకుండా.. 'నమస్తే'తోనే ఇతరులను పలకరించాలని సూచించాడు. 'లాక్‌డౌన్‌లో శారీరకంగా, మానసికంగా బలంగా ఉండడం ఎంత ముఖ్యమో ప్రధానికి చెప్పాం. ఫిట్‌గా ఉండేందుకు నేను తీసుకుంటున్న చర్యలను వివరించా' అని సచిన్ తెలిపాడు.

### కోహ్లీలా పోరాడాలి..

కరోనాపై యుద్ధంలో గెలవాలంటే కోహ్లీ మాదిరి పోరాడాలని ప్రధాని పిలుపునిచ్చారని, అలాగే భౌతిక దూరం పాటించాల్సిన అవసరాన్ని ప్రచారం చేయాలని కోరారని వెటరన్ టీటీ ఆటగాడు శరత్ కమల్ వెల్లడించాడు.

### ఆశావహ దృక్పథంతో ఉండాలి..

ఆశావహ దృక్పథంతో ఉండాలని, ప్రజల్లో సానుకూల అంశాలను ప్రచారం చేయాలని మోదీ సూచించారని షూటర్ అభిషేక్ వర్మ తెలిపాడు. కొవిడ్-19పై మరింత సమర్థంగా పోరాడేందుకు కావాల్సిన సూచనలు చేయాలని కోరారని చెప్పాడు.

## విరాట్‌ను వద్దన్న మహీ!




**ముంబై:** దశాబ్ద కాలంగా టీమిండియాకు ధోనీ, విరాట్ కోహ్లీ వెన్నుముకగా ఉన్నారు. మహీ కెప్టెన్సీలోనే శ్రీలంక (2008) టూర్‌లో కోహ్లీ వన్డే అరంగేట్రం చేశాడు. అద్భుత నైపుణ్యం కలిగిన కోహ్లీని సారథిగా మలచడంలో ధోనీ కీలక పాత్ర పోషించాడు. అయితే, 2008 అండర్-19 వరల్డ్‌కప్ విన్నింగ్ కెప్టెన్ విరాట్‌ను శ్రీలంక పర్యటనకు ఎంపిక చేయడానికి సారథి ధోనీ ససేమిరా అన్నట్టు మాజీ చీఫ్ సెలెక్టర్ దిలీప్ వెంగ్‌సర్కార్ తెలిపాడు. 'నైపుణ్యం కలిగిన టీనేజర్ కోహ్లీని టీమిండియాకు ఎంపిక చేయాలని నేను అనుకున్నా. అయితే, ధోనీ, అప్పటి బీసీసీఐ ఛైర్మన్ శ్రీనివాసన్ దీనికి తొలుత ఒప్పుకోలేదు. కోహ్లీని జాతీయ జట్టుకు ఎంపిక చేయాలని నాతో పాటు సెలెక్షన్ కమిటీ నిర్ణయం తీసుకోవడంతో అతడు జట్టులోకి వచ్చాడు. ఆ టూర్‌లోనే విరాట్ వన్డే అరంగేట్రం చేసి అనతి కాలంలోనే కీలక ఆటగాడిగా మారాడు' అని వెంగ్‌సర్కార్ చెప్పుకొచ్చాడు.

## నువ్వు లెజెండ్!

### యువీకి రవి ప్రశంస



**న్యూఢిల్లీ:** ధోనీ సారథ్యంలో భారత జట్టు వన్డే వరల్డ్‌కప్ (2011) అందుకొని తొమ్మిదేళ్లయింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని టీమిండియా ప్రస్తుత కోచ్, అప్పటి కామెంటేటర్ రవిశాస్త్రి..నాడు శ్రీలంకతో ఫైనల్లో 48వ ఓవర్ రెండో బంతికి ధోనీ సిక్సర్ కొట్టి టీమిండియాకు చారిత్రక విజయాన్ని అందించిన వీడియోను ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. 'యువకులకు కంగ్రాట్స్. 1983 ప్రపంచకప్ గెలిచిన సందర్భం మాకు ఎంతో మధురం. అలాగే ఈ అపురూప క్షణాలు మీకు జీవితాంతం గుర్తుండి పోతాయి' అని రాశాడు. సచిన్, కెప్టెన్ కోహ్లీని ట్యాగ్ చేశాడు. అయితే, ఆ ఫైనల్లో ధోనీతో పాటు నాన్‌స్ట్రయికర్ ఎండ్‌లో ఉన్న యువరాజ్ 'థ్యాంక్యూ సీనియర్. ఆ అద్భుత విజయంలో భాగస్వామ్యమైన నన్ను, మహీని మరిచావు' అని రవిశాస్త్రి ట్వీట్‌కు సరదాగా స్పందించాడు. ఇందుకు రవిశాస్త్రి 'వరల్డ్‌కప్ విషయానికి వస్తే నువ్వు జూనియర్‌వి కాదు. లెజెండ్‌వి' అని బదులిచ్చాడు.



చైనాలోని హాంగ్‌ఝులో 2022, సెప్టెంబరులో జరగబోయే ఆసియా క్రీడల మస్కట్‌ను శుక్రవారం నిర్వాహకులు ఆవిష్కరించారు.

# చేయం అంటే కుదరదంతే

## ఎస్మా పరిధిలోకి ప్రభుత్వ, ప్రైవేటు వైద్యం

**అత్యవసర సేవల్లోకి వైద్యులు, నర్సులు, ఆరోగ్య సిబ్బంది**

**వైద్యసేవల రంగంలోని పారిశుద్ధ్య సిబ్బంది కూడా**

**వైద్య పరికరాలు, మందులు, అంబులెన్సులు సైతం**

**అదనంగా మరో ఐదు విభాగాలు.. కరోనా నేపథ్యంలో ఉత్తర్వులు జారీ**

అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎవరికి పడితే వారికి వైద్యం చేయడానికి ఇది ధర్మాస్పత్రి కాదు.. ప్రైవేటు ఆస్పత్రి. ఇక్కడ వైద్యం చేయం.. అని అంటే ఇక కుదరదు. ఎందుకంటే వైద్యంతోపాటు, దాని పరిధిలోకి వచ్చే మరో ఐదు అనుబంధ రంగాలను కూడా ఆంధ్రప్రదేశ్ తప్పనిసరి సేవల నిర్వహణ చట్టం-1971( ఎస్మా) పరిధిలోకి తీసుకొస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వెంటనే వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి గెజిట్ నోటిఫికేషన్ జారీచేశారు. కరోనా వైరస్ నియంత్రణ, నిరోధక చర్యల్లో భాగంగా ఇప్పటికే అత్యవసర వైద్యసేవలకు ప్రైవేటు ఆస్పత్రులు, సంస్థలు సంసిద్ధంగా ఉండాలని ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. కోవిడ్-19 నివారణకు అవసరాన్ని బట్టి పూర్తిస్థాయిలో ప్రైవేటు వైద్యసేవలను వాడుకోవడానికి ఇది వెసులుబాటు కల్పిస్తోంది. దీని తదుపరి చర్యగా ఎస్మాలోని జాబితాలను ప్రభుత్వం సవరించింది. ఇప్పటి వరకు కేవలం ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్యశాలలకే దీనిని వర్తింపజేసేవారు. ఇప్పుడు కొత్తగా ప్రైవేటు ఆస్పత్రులను కూడా దీని పరిధిలోకి తీసుకురావడం గమనార్హం. దీని ప్రకారం వైద్యం కోరుతూ వచ్చే ఏ ఒక్కరికీ సేవలు నిరాకరించకూడదు. ఒక వేళ మేం చేయం అంటే చట్టప్రకారం ఆయా వైద్యులు, ఆస్పత్రులపై చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. కరోనా మహమ్మారి విస్తరిస్తున్న నేపథ్యంలో వైద్యసేవలే కీలకం. దేశవ్యాప్తంగా ఈ నెల 14 వరకు లాక్‌డౌన్ విధించిన సంగతి తెలిసిందే. మరోవైపు కొత్తగా కరోనా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. మరణాలూ పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లోనే ముందు జాగ్రత్తగా ప్రైవేటు వైద్యసేవలను కూడా ఎస్మా పరిధిలోకి తీసుకొచ్చారు.



### అత్యవసర సేవల్లోకి ఇవే..

- రాష్ట్రంలోని అన్ని రకాల వైద్య సేవలు, సదుపాయాలు.
- వైద్యులు, నర్సులు, ఆరోగ్య సిబ్బంది.
- వైద్యసేవల రంగంలోని పారిశుద్ధ్య సిబ్బంది.
- వైద్య పరికరాల కొనుగోళ్లు, నిర్వహణ, రవాణా.
- మందుల తయారీ, అమ్మకాలు, రవాణా.
- అంబులెన్స్ సర్వీసులు.
- నీరు, విద్యుత్ సరఫరా.
- సెక్యూరిటీ సంబంధ సేవలు
- ఆహారం, తాగునీరు వసతి, నిర్వహణ
- బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్

వీటితో ముడిపడ్డ అంశాలకు ఎస్మా చట్టం వర్తిస్తుంది. వైద్యసేవలు, తాగునీరు, ఆహారం, శానిటేషన్, మందుల సరఫరా వంటి సేవలను నిరాటకంగా కొనసాగించేందుకే ఎస్మాను ప్రయోగించారు.



ఇళ్లకు తాళాలు వేస్తున్న తహసీల్దార్

## తహ'సీలు'దారు!

**▸▸ బయటికి రావొద్దంటూ ఇళ్ల గేట్లకు తాళం**

హిందూపురం, ఏప్రిల్ 3: కరోనా కట్టడిలో భాగంగా లాక్‌డౌన్ పాటించాలని రోజూ పదేపదే చెబుతున్నా కొందరు అతిక్రమించి ఇళ్ల నుంచి బయటికి వస్తున్నారు. ఇలాంటి వారికి ముకుతాడు వేయాలన్న ఉద్దేశంతో.. అనంతపురం జిల్లా లేపాక్షి తహసీల్దార్ బలరాం శుక్రవారం పలు ఇళ్ల గేట్లకు ఏకంగా తాళం వేశారు. హజ్‌కు వెళ్లి వచ్చిన వారితో లేపాక్షిలో పదేళ్ల బాలుడికి కరోనా పాజిటివ్ వచ్చింది. మూడు కిలోమీటర్ల మేర కంటోన్మెంట్ జోన్‌గా ప్రకటించి చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. భద్రత కట్టుదిట్టం చేసినా జనం మాత్రం లాక్‌డౌన్‌ను పాటించడంలేదు. తహసీల్దార్ అప్పటికే పలు హెచ్చరికలు చేశారు. శుక్రవారం తహసీల్దార్ లేపాక్షితోపాటు ఆయన ఇన్‌చార్జిగా ఉన్న చిలమత్తూరు మండల కేంద్రాల్లో కొన్ని ఇళ్ల గేట్లకు తాళాలు వేసి ఎట్టి పరిస్థితిలోనూ ఇళ్ల నుంచి బయటికి రావొద్దని హెచ్చరించారు. తాళం చెవి ఇంటి యజమానులకే ఇచ్చారు.

## పేదలందరికీ రూ.1000 సాయం

**▸▸ రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్నా ఇస్తాం: ఆళ్ల నాని**

అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నవారికీ పేదలకు ఇచ్చే రూ.1000 సాయం అందించాలని సీఎం జగన్ ఆదేశించారని ఉప ముఖ్యమంత్రి ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని) అన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కొవిడ్-19పై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 161 కరోనా పాజిటివ్ కేసులు నమోదవగా వీటిలో ఢిల్లీ నుంచి వచ్చినవారే 140మంది ఉన్నారన్నారు. గుంటూరు, కడపలో అదనంగా ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని, సోమవారం నుంచి విశాఖలోనూ ల్యాబ్ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. మంత్రి మోపిదేవి వెంకట రమణ మాట్లాడుతూ గ్రామాల్లో కట్టుబాట్ల కారణంగా వ్యవసాయ, ఆక్వా రంగాలకు కూలీలు దొరకట్లేదన్నారు. కూలీలు పనులకు వెళ్లేందుకు అనుమతించాలని గ్రామాల్లోని పెద్దలను కోరారు.

## పెన్షన్ల తరహాలోనే ఆర్థికసాయం

అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్లు పంపిణీ చేసిన తరహాలోనే ప్రభుత్వం ప్రకటించిన రూ.1000 ఆర్థికసాయం ఇంటింటికీ వెళ్లి అందించనున్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జియో ట్యాగింగ్ విధానంలో ఫొటో తీస్తారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1.29కోట్ల బియ్యం కార్డులకు సుమారు రూ.1,300కోట్లు శనివారం ఒక్కరోజే పంపిణీ చేయనున్నారు.

## రాష్ట్రానికి నిధులొచ్చాయ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి రెండు పద్దుల్లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.1050.64 కోట్లు నిధులు రానున్నాయి. ఇందులో జాతీయ విపత్తుల నిర్వహణ (ఎస్‌డీఆర్ఎంఎఫ్) కోసం 2020-21 సంవత్సరానికి తొలి విడత కింద రూ.559.50 కోట్లు విడుదల కానున్నాయి. దీనికి కేంద్ర హోం శాఖ శుక్రవారం ఆమోదం తెలిపింది. అలాగే 15వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక లోటు భర్తీ చేయడానికి కేంద్ర ఆర్థిక శాఖ 2020-21 సంవత్సరానికి రూ.491.14 కోట్లు విడుదల చేసింది.

## నూజివీడులో కరోనా కలకలం

నూజివీడు, ఏప్రిల్ 3: కృష్ణా జిల్లా నూజివీడులో కరోనా కలకలం సృష్టిస్తోంది. ఢిల్లీ వెళ్లి వచ్చిన పట్టణ వాసుల్లో ఇద్దరికి పాజిటివ్ నిర్ధారణ అయింది. మరో ముగ్గురి ఫలితాలు రావాల్సి ఉంది. వీరిలో ఇద్దరు ప్రముఖ విద్యాసంస్థలో బోధనా సిబ్బంది. ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత వారు ఇక్కడ విధుల్లో చేరారు. ఉపాధ్యాయులతో ముఖ్య సమావేశంలోనూ పాల్గొన్నారని తెలిసింది. అక్కడినుంచి తెచ్చిన ప్రసాదం పంచడంతోపాటు సహచరులతో ఆత్మీయ ఆలింగనం చేసుకున్నట్టు సమాచారం. అనేక మంది విద్యార్థులతో మాట్లాడినట్టు తెలుస్తోంది. తర్వాత లాక్‌డౌన్‌తో విద్యార్థులంతా స్వస్థలాలకు వెళ్లారు. పంజాబ్‌లో చదువుతున్న స్థానిక విద్యార్థి ఒకరు ఢిల్లీ నుంచి వారితో కలసి అదే రైల్లో రాగా, అతనికీ పాజిటివ్ వచ్చింది. ఢిల్లీ వెళ్లి వచ్చినవారు గతనెల 22న జనతా కర్ఫ్యూ రోజు స్థానిక తిరువూరు రోడ్డులోని ఫంక్షన్ హాల్లో విందు ఇచ్చినట్టు తెలుస్తోంది.

## ఇద్దరు కరోనా బాధితులు డిశ్చార్జ్

ఒంగోలు నగరం, కాకినాడ (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 3: కరోనా చికిత్స పొందుతున్న ఇద్దరు యువకులు శుక్రవారం వేర్వేరు ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయ్యారు. ప్రకాశం జిల్లాలో కరోనా తొలి పాజిటివ్ కేసుగా నమోదైన యువకుడి ఆరోగ్యం కుదుటపడటంతో ఒంగోలులోని రిమ్స్ నుంచి డిశ్చార్జి చేశారు. లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఒంగోలుకు చెందిన అతను గతనెలలో ఇంటికి వచ్చాడు. కరోనా అనుమానిత లక్షణాలతో గతనెల మార్చి 16న రిమ్స్‌లో చేరగా 18న పాజిటివ్ నిర్ధారణ అయింది. అప్పటినుంచి రిమ్స్‌లోనే చికిత్స పొందుతున్నాడు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన తొలి కరోనా బాధితుడిని శుక్రవారం కాకినాడ జీజీహెచ్ నుంచి డిశ్చార్జ్ చేశారు. లండన్‌లో చదువుతున్న ఆయన గతనెల 20న స్వస్థలం రాజమహేంద్రవరం వచ్చాడు. కరోనా లక్షణాలు కనబడటంతో చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌లో చేరాడు.

## కరోనా నెగెటివ్ వచ్చిన వృద్ధుడి మృతి

ఒంగోలు నగరం, ఏప్రిల్ 3: ప్రకాశం జిల్లా ఒంగోలులో కరోనా నెగెటివ్ వచ్చిన ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. చీరాలలో వృద్ధ దంపతులకు వారం క్రితం కరోనా నిర్ధారణ అయింది. వీరితో సంబంధాలున్న వారిని అధికారులు రిమ్స్‌కు తరలించి పరీక్షలు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం చీరాల నుంచి ఓ వృద్ధుడిని కూడా ఐసోలేషన్‌లో ఉంచారు. నమూనాలు పరీక్షలకు పంపగా ఫలితాల్లో నెగెటివ్ వచ్చింది. షుగర్, బీపీ, కిడ్నీ సమస్యలు, ఆయాసంతో బాధపడుతున్న అతడిని కరోనా భయం వెంటాడటంతో ఒక్కసారిగా షుగర్ లెవెల్స్ పెరిగాయి. వైద్యులు అతడిని ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో బంధువులు శుక్రవారం ఒక ప్రైవేటు ఆస్పత్రికి, మధ్యాహ్నం తిరిగి రిమ్స్‌కు తీసుకువచ్చారు. మధ్యాహ్నం 3.30గంటల సమయంలో వృద్ధుడు మరణించాడు. కాగా.. రిమ్స్‌లోని క్వారంటైన్‌లో ఉన్న నాలుగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు చెందిన యువకుడు శుక్రవారం పారిపోయాడు. పోలీసులు అమ్మనబ్రోలు వెళ్లి అతడిని పట్టుకొని మళ్లీ ఆస్పత్రికి తీసుకొచ్చారు.

## శ్రీకాళహస్తిలో విదేశీయుడి హల్‌చల్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3: చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో సూడాన్ యువకుడి సంచారం కలకలం రేపింది. మోటారు సైకిల్‌పై ఆ యువకుడు పట్టణ వీధుల్లో చక్కర్లు కొడుతుండగా బేరివారి మండపం సర్కిల్ వద్ద పోలీసులు ఆపబోయారు. అయితే నిలపకుండా దూసుకెళ్లిన అతడ్ని భిక్షాల గాలిగోపురం వద్ద ఆపి మోటారు సైకిల్, పాస్‌పోర్టు స్వాధీనం చేసుకున్నారు. అతను సూడాన్ దేశానికి చెందిన అబ్దుల్ సాదిక్‌గా గుర్తించారు. విజయవాడలో బి.ఫార్మసీ చదువుతున్న ఆ యువకుడు బెంగళూరులో ఉన్న సోదరుడిని చూసేందుకు నెల్లూరు మీదుగా శ్రీకాళహస్తికి చేరుకున్నాడు. కరోనా పరీక్షల నిమిత్తం అతడిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

# చావు కబురు మెల్లగా!

## కరోనా మృతిపై దాగుడు మూతలు

**▸▸ గతనెల 30వ తేదీన వ్యక్తి మృతి**

**▸▸ మరుసటిరోజే కరోనా నిర్ధారణ?**

**▸▸ జాగ్రత్తలు తీసుకోకుండానే ఖననం**

**▸▸ కరోనా మృతిగా కేంద్రం ప్రకటన**

**▸▸ తప్పనిసరై అంగీకరించిన రాష్ట్రం**

**▸▸ ఆ కుటుంబంలో ఆరుగురికి పాజిటివ్**

**▸▸ మృతుడి భార్యా ఆ లక్షణాలతోనే మృతి**



కరోనా దెబ్బకు ప్రతి పనికీ కష్టమే.. కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌లో అయిన వారిని కోల్పోయిన ఓ కుటుంబం శవపేటికను ద్విచక్ర వాహనంపై తీసుకువెళుతున్న దృశ్యం

అమరావతి/విజయవాడ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఏపీలో తొలి కరోనా మరణం సంభవించింది. ఎప్పుడో తెలుసా... మార్చి 30న! కానీ... అధికారులు ప్రకటించింది మాత్రం ఏప్రిల్ 3న! 4 రోజులు దాగుడుమూతలాడి, కేంద్ర ప్రభుత్వం దీనిని కరోనా లెక్కల్లో చేర్చిన తర్వాత... ఇక తప్పదన్నట్లుగా ఒక అధికార ప్రకటన చేశారు. ఈలోపు ఎంత నష్టంగా జరిగిందో తెలియదు! దాని పరిణామాలు ఎలా ఉంటాయో కూడా తెలియదు! ఎందుకంటే... సదరు వ్యక్తి మృతదేహాన్ని ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండానే కుటుంబ సభ్యులకు అప్పగించారు. విజయవాడకు చెందిన ఒక యువకుడు ఢిల్లీలో మర్కజ్‌కు హాజరై... మార్చి 17న తిరిగి వచ్చారు. ఈ యువకుడి తల్లి మార్చి 29 అర్ధరాత్రి సమయంలో తీవ్ర శ్వాసకోశ సమస్యతో మరణించింది. ఆ మరుసటి రోజున ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు. ఆ తర్వాత కొన్ని గంటల్లోనే ఆమె భర్త(55) కూడా అస్వస్థతకు గురయ్యారు. ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండటంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 30వ తేదీ ఉదయం 11.30కు ఆసుపత్రికి తీసుకురాగా... 12.30కు ఆయన చనిపోయారు. కరోనా లక్షణాలు కనిపించడంతో వైద్యులు అప్రమత్తమయ్యారు. మృతుడి నుంచి నమూనాలు సేకరించి కరోనా పరీక్షకు పంపారు. కరోనాతో మరణించారనే సందేహం ఉన్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించకూడదు. నివేదిక వచ్చేదాకా వేచి చూడాలి. 'పాజిటివ్' వచ్చినట్లు తేలితే... వైరస్ ఇతరులకు సోకకుండా మృతదేహాన్ని ప్రత్యేకమైన కవరులో చుట్టి, అధికారుల పర్యవేక్షణలోనే అంత్యక్రియలు నిర్వహించాలి. కానీ... మృతుడి విషయంలో ఇదేదీ చేయలేదు. నమూనాలు సేకరించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేవలం 24 గంటల వ్యవధిలో భార్య, ఆ తర్వాత భర్త కూడా మరణించడంతో కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అదే రోజు(మార్చి 30) సాయంత్రం ఖనన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### దాచి పెట్టారా...

చనిపోయిన వ్యక్తి కుమారుడి నమూనాలు కూడా మార్చి 30నే సేకరించి పరీక్షలకు పంపించారు. అతనికి వైరస్ సోకినట్లు ఆ మరుసటి రోజేనే(మార్చి 31న ) నిర్ధారణ అయ్యింది. అంటే... మృతుడికి కూడా వైరస్ సోకిందని అదే రోజు నివేదిక అంది ఉండాలి. కానీ, ఈ విషయాన్ని బహిర్గతం చేయలేదు. ఆయన ఇతర ఆరోగ్య సమస్యలతో చనిపోయినట్లు ప్రకటించారు. ఆ యువకుడికి పాజిటివ్ వచ్చిన తర్వాత... కుటుంబ సభ్యులందరికీ పరీక్షలు నిర్వహించారు. అదే ఇంట్లో కొత్తగా 5 పాజిటివ్‌లు తేలాయి. అంటే... ఒకే ఇంట్లో ఒకరు కరోనాతో మరణించగా, మరో ఆరుగురికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. మృతుడి భార్య కూడా కరోనా కారణంగానే మరణించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ... దీనిని నిర్ధారించలేని పరిస్థితి. కరోనాతో మృతి చెందిన బాధితుడి విషయంలో వచ్చిన అనుమానాలను అధికారులు తోసిపుచ్చారు. బీపీ, షుగరుతోపాటు శ్వాసకోశ సంబంధ వ్యాధులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు.. మృతుడి అంత్యక్రియల సందర్భంగా దేహాన్ని తాకిన బంధువుల్లోనూ 'కరోనా' భయం మొదలైంది.

### 3 మరణాలపై అనుమానం!

55 ఏళ్ల వ్యక్తి కరోనాతో మరణించినట్లు ఇప్పుడు నిర్ధారించగా... ఆయన భార్య కూడా వైరస్ వల్లే చనిపోయారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఆమె అస్వస్థతకు గురికాగానే, స్థానిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లేలోపే మరణించడం, వెంటనే అంత్యక్రియలు నిర్వహించడంతో వ్యాధి నిర్ధారణకు అవకాశం కలుగలేదు. మరోవైపు విజయవాడకే చెందిన ఒక వ్యక్తి శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతూ మార్చి 28వ తేదీన ఆకస్మాత్తుగా మృతి చెందారు. ఆ తర్వాత రోజునే ఆయన భార్య కరోనా లక్షణాలతో ఆస్పత్రిలో చేరారు.

## కరోనా ముట్టడి

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం కేసుల సంఖ్య 32కు పెరిగింది. తిరుపతి ల్యాబ్‌కు 219 నమూనాలు పంపగా 116 నెగెటివ్ వచ్చాయి. 71రిపోర్టులు రావాల్సి ఉంది. విశాఖ రైల్వే న్యూకాలనీకి చెందిన యువకుడు గతనెల 24న ముంబై నుంచి ఇంటికి చేరుకున్నాడు. దగ్గు, జలుబు, జ్వరంతో 26న కేజీహెచ్‌కు వెళ్లగా అక్కడి వైద్యులు పెదవాల్తేరులోని ప్రభుత్వ అంటువ్యాధుల ఆస్పత్రికి రిఫర్ చేశారు. బాధితుడిలో కరోనా లక్షణాలు కనిపించడంతో అతని కుటుంబ సభ్యులను కూడా ఆస్పత్రిలో చేరాలని వైద్యులు సూచించారు. వారి నమూనాలు సేకరించి వైరస్ నిర్ధారణ కోసం కాకినాడ ల్యాబ్‌కు పంపించారు. యువకుడితో పాటు అతని అత్త(55), బావమరిది(22)కి వైరస్ సోకినట్టు శుక్రవారం నివేదిక వచ్చింది. ఇక విశాఖ నుంచి ఢిల్లీ వెళ్లి వచ్చిన మరో వ్యక్తి(40)కి పాజిటివ్ వచ్చింది. తూర్పు గోదావరి జిల్లాలో ఇద్దరికి, కడప జిల్లాలో ఒకరికి కరోనా నిర్ధారణ అయింది. విజయనగరం జిల్లాలో ఇంతవరకు కరోనా అనుమానితులుగా భావించి నిర్ధారణ పరీక్షలకు పంపించిన 13 కేసుల్లోనూ నెగెటివ్ నివేదికలే వచ్చాయి. తాజాగా శుక్రవారం ముగ్గురి రిపోర్టులు నెగెటివ్ వచ్చాయి.

| జిల్లాల వారీగా కేసుల వివరాలు... | |
|---|---|
| గుంటూరు | 20 |
| కడప | 19 |
| ప్రకాశం | 17 |
| కృష్ణా | 23 |
| పశ్చిమ గోదావరి | 15 |
| విశాఖపట్నం | 15 |
| తూర్పు గోదావరి | 11 |
| చిత్తూరు | 9 |
| నెల్లూరు | 32 |
| అనంతపురం | 2 |
| కర్నూలు | 1 |
| మొత్తం | 164 |



## తబ్లీగీతోనే తంటా

**▸▸ ఆ సమావేశాల్లో పాల్గొన్న వారివల్లే అధికంగా కరోనా పాజిటివ్ కేసులు**

**▸▸ పోలీసుల భాష, కౌన్సెలింగ్ తీరు మారాలి**

**▸▸ యువకుడి ఆత్మహత్యపై విచారణ: సీఎం**

అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో తబ్లీగీ జమాత్‌కు హాజరైనవారు, వారితో సంబంధం ఉన్నవారి వల్లే రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసులు అత్యధికంగా ఉన్నాయని సీఎం జగన్ అన్నారు. ఈ సమావేశాల్లో పాల్గొన్నవారు, వారితో కాంటాక్ట్ అయినవారికి తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్ కరోనా నివారణపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. లాక్‌డౌన్ సందర్భంగా పోలీసులు ఉపయోగిస్తున్న భాష, కౌన్సెలింగ్ తీరు మారాలన్నారు. బాపట్లలో యువకుడి ఆత్మహత్య కేసులో పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డీజీపీని ఆదేశించారు. కరోనాతో ఇబ్బందులకు గురవుతున్న నిరుపేద కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.వెయ్యి వలంటీర్ల ద్వారా డోర్ డెలివరీ సమర్థంగా జరిగేలా చూడాలని జగన్ ఆదేశించారు. వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేపై ఆరా తీశారు. రాష్ట్రంలోని 1.45కోట్ల ఇళ్లకు గాను 1.28కోట్ల ఇళ్లల్లో సర్వే పూర్తయిందని అధికారులు వివరించారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, వార్డుల వారీగా వైద్యుల నియామకాలపై సీఎం ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రతి దుకాణం ముంగిటా భౌతిక దూరం పాటించేలా మార్కింగ్ వేయాలని, అదేవిధంగా ధరల పట్టీ ఉండాల్సిందేనని జగన్ స్పష్టం చేశారు. రాష్ట్రం వెలుపల పెద్దసంఖ్యలో తెలుగువారున్నప్రాంతాలకు ఒక అధికారిని పంపి వారి బాగోగులపై నిరంతరం సమీక్షించాలన్నారు. నిల్వ చేయలేని పంటల విషయంలో తీసుకుంటున్న చర్యలపై సీఎం సమీక్షించారు. మదనపల్లె మార్కెట్లో టమాటా కొనుగోలు చేసి రైతుబజార్లకు పంపడంతో డిమాండ్ పెరిగి కిలో ధర రూ.4నుంచి రూ.8కి పెరిగిందని అధికారులు వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగాలని, ఆక్వా ఎగుమతులు ప్రారంభం కావాలని సీఎం ఆదేశించారు. వరి రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

### పొరుగురాష్ట్రాల్లో చిక్కుకున్నవారిపై సమీక్ష

రాష్ట్రం వెలుపల వివిధ రాష్ట్రాల్లో ఉన్న వారు ఎదుర్కొంటున్న పరిస్థితిపై సీఎం సమీక్షించారు. ఉత్తరప్రదేశ్‌లోని వారాణసిలో చిక్కుకున్న 400 మంది, గోరఖ్‌పూర్‌లో ఉన్న 30 మంది గుంటూరు యాత్రికుల విషయంలో యూపీ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని అధికారులు వివరించారు. అజ్మీర్‌లో కర్నూలుకు చెందిన 20 మంది యాత్రికులు, తమిళనాడులోని కాశీమేడలో చిక్కుకున్న దాదాపు 500 మంది శ్రీకాకుళం మత్స్యకారులు, కోయంబత్తూర్‌లో ఉండిపోయిన 300 మంది మేస్త్రీలు, గోవాలో 20 మంది కడప యాత్రికులు, గుజరాత్‌లోని వెరవల్‌లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన 1200 మంది మత్స్యకారులు, ముంబైలోని వెర్సోవాలో 500 మంది వలస కార్మికులకు లాక్‌డౌన్ వల్ల ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అక్కడి ప్రభుత్వాలు సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.



పీపీఈ కిట్లు తయారు చేస్తున్న మహిళలు

## రూ.1000 కిట్ 4 వందలకే!

**▸▸ తెనాలిలో పీపీఈ కిట్ల తయారీ**

**▸▸ 2 లక్షల తయారీ లక్ష్యంగా పనులు**

**▸▸ సబ్ కలెక్టర్ దినేశ్ చొరవతో శరవేగం**

**▸▸ తయారీ ధరకే అందించనున్న సంస్థ**

తెనాలి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కరోనా రోగులకు సేవలు అందించే వైద్యుల భద్రత కోసం వ్యక్తిగత రక్షణ పరికరాల( పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్-పీపీఈ)ను తెనాలి కేంద్రంగా యుద్ధ ప్రాతిపదికన తయారు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.1000కి లభించే కిట్‌ను తయారీ ధర రూ.400లకే అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలో పాజిటివ్ రోగులకు చికిత్స చేసే విజయవాడ, విశాఖ, తిరుపతి, నెల్లూరు వంటి ప్రధాన ఆసుపత్రుల్లో డాక్టర్లకు పీపీఈల కొరత ఉంది. ఈ నేపథ్యంలో తెనాలి సబ్‌కలెక్టర్ దినేశ్ కుమార్ చొరవ చూపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఇటర్‌నెట్‌లో పరిశీలించి తెనాలి సమీపంలోని బుర్రిపాలెంలో సత్యసాయి డిస్పోజీడ్స్ అనే సంస్థ కిట్‌లను తయారు చేస్తున్నట్టు గుర్తించారు. వెంటనే సంస్థ యజమానులతో మాట్లాడగా, శారద సర్వీసెస్ సొసైటీ స్థాపకురాలు డాక్టర్ శారద తక్కువ ఖర్చుతోనే వీటిని తయారు చేయించి అందించేందుకు ముందుకు వచ్చారు. గత వారం రోజులుగా 24 గంటల పనివిధానంలో వీటిని తయారు చేయిస్తున్నారు. ఈ సంస్థ ఏపీకే కాకుండా తమిళనాడులోని ప్రభుత్వ వైద్యశాలలకు ఈ తరహా కిట్‌లను సరఫరా చేస్తోంది. కరోనా పాజిటివ్ వచ్చిన రోగులకు చికిత్స చేసే వైద్యుల రక్షణకు శరీరం పూర్తిగా కప్పి ఉంచే విధంగా పీపీఈ కిట్‌లను అందించాలి. ప్రస్తుతం డిస్పోజబుల్ యాప్రాన్లనే వాడుతున్నారు. అయితే, ఈ ప్రత్యేక కిట్లలో ఎంతటి సూక్ష్మ వైరస్ కూడా ప్రవేశించలేని విధంగా 90 జీఎస్ఎం మందంతో నాన్ ఓవెన్ ఫ్యాబ్రిక్ యాప్రాన్, తల, మెడభాగం కప్పి ఉంచే హుడ్ క్యాప్, ఫేస్ మాస్క్, షూ కవర్, గ్లౌజ్‌లు, కళ్లకు రక్షణగా ఉండేందుకు కళ్లజోడును అందిస్తున్నారు. సాధారణంగా ఈ కిట్ ఒక్కొక్కటి రూ.1000 వరకు ఉంది. అయితే, సత్యసాయి డిస్పోజీడ్స్ సంస్థ రూ.400లకే అందించేందుకు ముందుకు వచ్చింది.

### ఉచితంగా ఇవ్వాలనుకున్నా

కరోనా విపత్తు సమయంలో లాభాలను ఆశించకుండా ఉచితంగా అందించాలని ఉన్నా, కూలీ, మెటీరియల్ ఖర్చులను భరించే పరిస్థితి లేకపోవడంతో తయారీ ధరలకే వీటిని అందిస్తున్నట్టు డాక్టర్ శారద తెలిపారు. శారద సేవా దృక్పథానికి సబ్ కలెక్టర్ దినేశ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని ఆసుపత్రులకు 10 లక్షల నుంచి 15 లక్షల పీపీఈ కిట్‌ల అవసరముందని, ప్రస్తుత పరిస్థితిలో కనీసం 2 లక్షల కిట్‌లను తయారు చేసి ఇచ్చేందుకు డాక్టర్ శారద అంగీకరించారని తెలిపారు. రోజుకు 10 వేల కిట్‌ల చొప్పున ఏపీఎంఎస్‌డీసీకి అందిస్తున్నామని దినేశ్ వివరించారు.

## ఒంటరిగా అంతిమయాత్ర!



మృతదేహాన్ని తీసుకెళ్తున్న ఒకే ఒక్క కుటుంబ సభ్యుడు

విజయనగరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మనిషి బతికి ఉన్నప్పుడు.. ఎన్ని రాజభోగాలైనా అనుభవించొచ్చు.. కానీ పోయేటప్పుడు ఆ నలుగురూ ఉండాలని అంటారు!.. కానీ.. ఈ చిత్రం చూశారా?.. ఎంత దయనీయం! విజయనగరంలో శుక్రవారంలో కనిపించిన దృశ్యం ఇది. వి.టి.అగ్రహారం నుంచి విజయనగరం పట్టణంలోని బాలాజీ జంక్షన్ మీదుగా ఓ మృతదేహాన్ని కుటుంబ సభ్యుడొకరే శ్మశానికి తీసుకువెళ్తుండడాన్ని చూసిన స్థానికులు కొందరు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

# అరచేతిలో ప్రాణాలు!

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడా ఇంటిలో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. అనారోగ్య సమస్యలున్న వారికి అనుమతి మంజూరు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. తలసేమియా రోగులకు రక్తమార్పిడి చేయాల్సి ఉంటుంది. కిడ్నీ వ్యాధిగ్రస్థులకు రక్తశుద్ధి (డయాలసిస్), కేన్సర్ రోగులకు కీమోథెరపీలు చేయాలి. ఇవన్నీ అత్యవసర సర్వీసుల కిందకు వస్తాయి. రాష్ట్రంలో ఇటువంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు ఎక్కువగా విశాఖ, విజయవాడ, గుంటూరు, తిరుపతి ప్రాంతాల్లో, తెలంగాణలోని హైదరాబాద్‌లో వైద్యం చేయించుకుంటుంటారు. ప్రస్తుతం రాష్ట్రంలో జిల్లాల సరిహద్దులు కూడా మూసివేయడంతో ఇతర జిల్లాలవారు ఈ ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నారు. తాము థెరపీలు చేయించుకుంటున్న ఆస్పత్రుల నుంచి ఫోన్లు వస్తున్నా.. ఏమీ చేయలేని పరిస్థితి.

### మేమేం చేయలేం..

రాష్ట్రంలో చాలా మంది తలసేమియా, కిడ్నీ, కేన్సర్ రోగులు హైదరాబాద్‌లో వైద్యం చేయించుకుంటున్నారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి ప్రధాన ఆస్పత్రులకు వెళ్తున్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో సరిహద్దులు మూసివేయడంతో హైదరాబాద్ వెళ్లడానికి వీల్లేని పరిస్థితులు ఏర్పడ్డాయి. కొంత మంది జిల్లాల్లో పోలీసులను, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను ఆశ్రయించి.. నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీలు) ఇస్తే హైదరాబాద్‌లో చికిత్స చేయించుకుంటామని కోరుతున్నారు. తమకు అలాంటి ఆదేశాలు లేవని జిల్లా అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఇటుంటి అత్యవసర కేసులకు సంబంధించి రెండు ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టాలన్న డిమాండ్ పెరుగుతోంది. మరోవైపు.. కేన్సర్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు సంబంధించిన కీలకమైన మందులను రాష్ట్రంలోని ప్రముఖ ఆస్పత్రులన్నీ హైదరాబాద్ నుంచే కొనుగోలు చేస్తున్నాయి. లాక్‌డౌన్‌తో అవీ వచ్చే పరిస్థితి లేదు.

### ట్రస్టుతో సమన్వయ లోపం

రాష్టంలోని డయాలసిస్ రోగులు కొత్త రకం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా బోధనాస్పత్రులను కరోనా ఐసొలేషన్ ఆస్పత్రులుగా మార్చారు. ఇప్పటి వరకూ అక్కడ చికిత్స పొందుతున్న వారిని ఇళ్లకు పంపించారు. అత్యవసర కేసులను దగ్గరల్లో ఉన్న మరో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇది కిడ్నీ రోగులకు ఇబ్బందిగా పరిణమించింది. వారికి డయాలసిస్ అత్యవసరం. బోధనాస్పత్రులను ఖాళీ చేయించేటప్పుడు వారి సమస్యను అధికారులు దృష్టిలో పెట్టుకోలేదు. వారికి ముందస్తు ఏర్పాట్లు చేయకుండా మీకు దగ్గరల్లో ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకోవచ్చని చెప్పి పంపించేశారు. అధికారుల మాటలు నమ్మి, వారంతా ప్రైవేటు ఆస్పత్రుల వద్ద బారులు తీరుతున్నారు. ఇప్పటికిప్పుడు తాము డయాలసిస్ చేయలేమని ప్రైవేటు ఆస్పత్రులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని ఆస్పత్రులు డయాలసిస్ చేసేందుకు ముందుకొచ్చినా.. ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి అనుమతులు రావడం లేదు. ఆరోగ్యశాఖ అధికారులు, ఆరోగ్యశ్రీ ట్రస్టు మధ్య సమన్వయం లేకపోవడంతో డయాలసిస్ రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని శాఖల అధికారులంతా కరోనా నివారణ, నియంత్రణ చర్యల్లో నిమగ్నమై ఉన్నారు. దీంతో దీర్ఘకాలిక వ్యాధులున్న వారిని ఎవరూ పట్టించుకోవడం లేదు.

## సకాలంలో వైద్యం అందక చిన్నారి మృతి



కనిగిరి టౌన్, ఏప్రిల్ 3 : లాక్‌డౌన్‌తో సకాలంలో వైద్యం అందక ప్రకాశం జిల్లా కనిగిరిలోని శంఖవరానికి చెందిన పాలూరి అక్షిత (2) అనే చిన్నారి మృతి చెందింది. అక్షిత పుట్టినప్పటి నుంచి శ్వాసకోశ సంబంధమైన సమస్యతో బాధపడుతోంది. శ్వాస అందని సమయంలో తల్లిదండ్రులు ఆమెను ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లి నెబులైజర్ పెట్టిస్తుంటారు. గురువారం సాయంత్రం అక్షిత శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండటంతో తల్లిదండ్రులు కనిగిరి తీసుకువచ్చారు. లాక్‌డౌన్‌తో ప్రైవేటు వైద్యశాలలు మూసి వేయడంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. ఒంగోలు తీసుకువెళ్లాలని సిబ్బంది సూచించారు. అందుకు అనుమతులు తీసుకొని ఒంగోలు తరలించే సరికి ఆమె పరిస్థితి విషమించింది. ఒంగోలు జీజీహెచ్ వైద్యుల సూచన మేరకు శుక్రవారం గుంటూరు తరలిస్తుండగానే మృతి చెందింది.

# కరోనా కల్లోలం



## ఊరు పొమ్మంది.. పడవ రమ్మంది!

**కరోనాతో వెలివేసిన గ్రామస్థులు**

మాల్దా, ఏప్రిల్ 3: జ్వరం వచ్చిన ఒక వృద్ధుడికి కరోనా సోకిందన్న భయంతో అతడి కుటుంబంతో పాటు ఊరంతా కలిసి వెలివేసిన ఘటన ఇది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లా హబీబ్‌పూర్‌కు చెందిన నిరంజన్ హాల్దెర్ అనే వృద్ధుడు ఊరూరా తిరిగి కీర్తనలు పాడి, ఆ వచ్చిన డబ్బుతో పొట్ట పోసుకునేవాడు. కొద్ది రోజుల క్రితం అతడు వేరే ఊరి నుంచి స్వగ్రామానికి వస్తుండగా జ్వరం వచ్చింది. దీంతో అతడికి కరోనా సోకిందన్న అనుమానంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు వెలివేశారు. చేసేది లేక.. ఊరి బయట కాలవలో ఉన్న చిన్న పడవనే తన ఇల్లుగా మార్చుకుని నిరంజన్ జీవనాన్ని సాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న అధికారులు, అతడికి అవసరమైనవన్నీ సమకూరుస్తున్నారు.

## వైద్యశాస్త్రంలోనే ఒక అద్భుతం!

**కరోనాపై ముదిమి జంట విజయం**



కొట్టాయం, ఏప్రిల్ 3: కేవలం 50, 60 ఏళ్ల వయసులో ఉన్నవారు కూడా కరోనా బారిన చిక్కితే మరణించడం చూస్తున్నాం. కానీ.. 90ల వయసులో ఉండీ కరోనా కోరల నుంచి బతికి బట్టకట్టిన ఒక కేరళ జంటను చూసి వైద్యులు నోరెళ్లబెడుతున్నారు. వైద్య శాస్త్రంలో ఇదొక అద్భుతమంటూ కొనియాడుతున్నారు. కేరళలోని పతనంథిట్ట జిల్లాకు చెందిన థామస్ అబ్రహం(93)ను, అతడి భార్య మరియమ్మ(88)కు ఇటలీ వెళ్లి వచ్చిన తనయుడు, కోడలు, మనవడి నుంచి కరోనా సోకింది. చికిత్సకై గత నెల 9న ఆస్పత్రిలో చేరారు. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ.. ఇద్దరూ చాలా త్వరితంగా కోలుకున్నారు. వైద్యులు వారిని శుక్రవారం డిశ్చార్జి చేశారు.

# కరోనా కరాళ నృత్యం

## 10.74 లక్షలకు పాజిటివ్ కేసులు

- 58 వేల మందిని బలిగొన్న వైరస్
- 4.1 ట్రిలియన్ డాలర్ల సంపద ఆవిరి

వాషింగ్టన్, ఏప్రిల్ 3: కరోనా కరాళనృత్యం భూగోళాన్ని కుదిపేస్తోంది. గురువారం రాత్రికే పాజిటివ్ కేసుల సంఖ్య ప్రపంచవ్యాప్తంగా 10 లక్షల సంఖ్యను దాటగా.. శుక్రవారంనాడు దాదాపుగా మరో 74 వేల కేసులు నమోదయ్యాయి. మృతుల సంఖ్య 58 వేలకు చేరింది. శుక్రవారం ఒక్కరోజే అమెరికాలో 716 మంది, ఇటలీలో 766 మంది, యూకేలో 684 మంది, స్పెయిన్‌లో 587 మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తం నమోదైన 10.74 లక్షల కేసుల్లో.. 5,03,043 కేసులు అమెరికా, ఇటలీ, స్పెయిన్‌లో పాజిటివ్‌గా వచ్చినవే!! యూకేలోనూ వైరస్ ఉధృతి పెరుగుతోంది. కర్ఫ్యూలు పెట్టి, లాక్‌డౌన్‌లు అమలుచేస్తున్నా ప్రపంచదేశాలు కరోనా వేగాన్ని అడ్డుకోలేకపోతున్నాయి. ప్రపంచ సంపదలో ఐదు శాతం కరోనా దెబ్బకు ఆవిరి అయిపోతోంది. అంకెల్లో చెప్పాలంటే ఈ మొత్తం.. 4.1 ట్రిలియన్ డాలర్లుగా ఆసియా అభివృద్ధి బ్యాంకు అంచనా వేసింది. ఈ ఆపత్కాలాన్ని కలిసికట్టుగా అధిగమించాలని ఐక్యరాజ్యసమితి తీర్మానించింది. ఈ తీర్మానానికి భారత్ సహా 188 దేశాలు మద్దతిచ్చాయి. కాగా.. కొవిడ్-19 పాజిటివ్‌గా తేలి స్వీయ నిర్బంధంలో చికిత్స పొంది బయటపడిన బ్రిటన్ రాకుమారుడు చార్లెస్ కరోనా బాధితుల కోసం తూర్పు లండన్‌లో 4వేల పడకల సామర్థ్యంలో నిర్మించిన తాత్కాలిక ఆస్పత్రిని వీడియోలింక్ ద్వారా ప్రారంభించారు. ఇక, ముందస్తు చర్యలను కాస్త తొందరగా ప్రారంభించిన రష్యా.. లాక్‌డౌన్‌ను ఈ నెల చివరిదాకా పొడిగించింది. అక్కడ 4,149 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. శుక్రవారం నుంచి థాయ్‌లాండ్‌లో కర్ఫ్యూ అమల్లోకి వచ్చింది. భారీగా పరిశ్రమలను మూసివేయాలని, బడులు మూసివేసి పిల్లలను ఇంట ఉంచే బోధన సాగించాలని సింగపూర్ ప్రభుత్వం నిర్ణయించింది. దక్షిణ కొరియాలో పాజిటివ్ కేసులు 10 వేలు దాటాయి.

### ఆపద వేళ ఆస్ట్రేలియా కాఠిన్యం

కరోనాపై యుద్ధానికి అన్ని దేశాలూ ఏకతాటిపైకి వస్తున్న తరుణంలో.. 'మా దేశమే మాకు ముఖ్యం' అన్నట్టు ఆస్ట్రేలియా వ్యవహరిస్తోంది. ఆ దేశం తీరు అక్కడి భారతీయ విద్యార్థులకు కొత్త కష్టాలను తెచ్చింది. వైరస్ కారణంగా చదువులు మూలనపడి, లాక్‌డౌన్‌తో చేయడానికి పని లేక ఇబ్బందులు పడుతున్న విదేశీ విద్యార్థులకు ఆర్థిక మద్దతు ఇవ్వడానికి ఆస్ట్రేలియా ప్రభుత్వం నిరాకరించింది. 'వీసాల మీద వచ్చి వీరంతా మొదటి సంత్సరం కోర్సులు చదువుకొంటున్నారు. ప్రభుత్వం తమ కోసం ఏదో చేస్తుందని మాత్రం వారు ఆశించడానికి లేదు. వారిని ఆపాల్సిన అవసరం మాకు లేదు. ఉండగలిగితేనే ఉండాలి. లేకపోతే ఏదో పద్ధతుల్లో స్వదేశాలకు వెళ్లిపోవాలి" అని ప్రధానమంత్రి స్కాట్ మోరీసన్ తేల్చిచెప్పారు. చైనా తరువాత చదువుల కోసం ఎక్కువగా ఆస్ట్రేలియాకు వెళుతున్న భారతీయ విద్యార్థులే ఈ వైఖరితో ఎక్కువగా నష్టపోనున్నారు.



కరోనా వైరస్ భయంతో అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఏరిస్‌లో ఓ సూపర్‌మార్కెట్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న ప్లాస్టిక్ కర్టెన్ చాటు నుంచే బిల్లింగ్ చేస్తున్న క్యాషియర్

# 'చావు బతుకుల' సమస్య!

(మొదటి పేజీ తరువాయి)

ఇదే పరిస్థితి. మరణించిన వారిని పూర్తి గౌరవ మర్యాదలతో సాగనంపడం పద్ధతి. ఆ బాధ్యతను 'ఫ్యునరల్ హోమ్'లకు అప్పగిస్తారు. అక్కడ మృతదేహానికి స్నానం చేయించి, దుస్తులు తొడిగి, చక్కగా తయారు చేస్తారు. ఆ తర్వాత సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తారు. కరోనా వైరస్ కారణంగా నగరంలో దాదాపు 1400 మంది మరణించారు. మరణాల సంఖ్య పెరుగుతూనే ఉంది. దీంతో... ఫ్యునరల్ హోమ్స్‌పై ఒత్తిడి తీవ్రంగా పెరిగింది. "ఒకేసారి 60 కేసులను డీల్ చేయగలం. గురువారం ఏకంగా 185 మృతదేహాలను అంత్యక్రియలకు సిద్ధం చేయాల్సి వచ్చింది. ఇదో అత్యవసర పరిస్థితి" అని బ్రూక్లిన్‌లోని ఓ ఫ్యునరల్ హోమ్‌కు చెందిన ప్యాట్ మార్మో తెలిపారు. దాదాపు అన్ని ఫ్యునరల్ హోమ్స్ నిర్వాహకులు అదనంగా శీతల గదులను సిద్ధం చేసుకుంటున్నారు. శ్మశాన వాటికలపైనా ఒత్తిడి తీవ్రమైంది. తమ వంతు కోసం వారం, ఒక్కోసారి రెండు వారాలు వేచి చూడాల్సి వస్తోంది. అంత్యక్రియల సేవలు, శ్మశాన వాటికలపై ఈ స్థాయిలో ఒత్తిడి పెరగడం 'సెప్టెంబరు 11' దాడుల తర్వాత ఇదే మొదటిసారి. శ్మశాన వాటికల్లో మృతుల బంధుమిత్రులు గుమికూడకుండా కఠినమైన ఆంక్షలు విధించారు. కుటుంబ సభ్యులనే లోపలికి అనుమతిస్తున్నారు.



బ్రూక్లిన్‌లోని ఓ ఫ్యునరల్ హోమ్ యజమాని ప్యాట్ మార్మో

### లక్ష 'బాడీ బ్యాగ్'లు

కరోనాతో రాబోయే మరణాలను ఎదుర్కొనేందుకు ట్రంప్ సర్కారు సిద్ధమవుతోంది. యుద్ధాలు, దూర ప్రాంతాల్లో సైనికులు మరణించినప్పుడు... వారి మృతదేహాలను తరలించే గోతాలు (బాడీ బ్యాగ్) పౌరులకు ఉపయోగించాలని నిర్ణయించింది. లక్ష బాడీ బ్యాగులను కొనుగోలు చేస్తున్నట్లు 'బ్లూమ్‌బర్గ్' వార్తా సంస్థ తెలిపింది. 'నాలుగు వారాలు ఇంటి నుంచి బయటికి రావొద్దు. ప్రతి ఒక్కరూ భౌతిక దూరం పాటించండి' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు.

### ఊపిరినిచ్చే వెంటిలేటర్లకూ కరువు

ఆస్పత్రుల్లో చావు బతుకుల్లో ఉన్న వారికి ఊపిరినిచ్చేందుకు వెంటిలేటర్లు లేని పరిస్థితి అమెరికాలో తలెత్తింది. కరోనా తీవ్రత నేపథ్యంలో వెంటిలేటర్లకు తీవ్ర కొరత ఏర్పడింది. అన్ని రాష్ట్రాలకు 2వేల మిలిటరీ వెంటిలేటర్లను పంపిస్తామని 'పెంటగాన్' రెండు వారాల కిందట ప్రకటించింది. ఇప్పటికి... వెయ్యి కూడా సరఫరా చేయలేకపోయింది. దేశవ్యాప్తంగా 9వేల వెంటిలేటర్లు కావాల్సి ఉందని అంచనా.

### కొలువు 'క్లోజ్'

కరోనా దెబ్బకు అమెరికా ఆర్థిక వ్యవస్థ అతలకుతలమవుతోంది. అమెరికాలో దాదాపు 90 శాతం మంది ఇళ్లకే పరిమితమయ్యారు. పరిశ్రమలు, కార్యాలయాలు, స్టోర్లు, రెస్టారెంట్లు, ఇతర వాణిజ్య కార్యకలాపాలన్నీ 'క్లోజ్'! రెండు వారాల్లో కోటి మంది అమెరికన్లు తమ ఉద్యోగాలను కోల్పోయారు.

### 600 కోట్ల డాలర్ల సాయం కోరిన భారత్

కరోనావైరస్‌పై పోరుకు ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఆసియా మౌలిక పెట్టుబడుల బ్యాంకుల నుంచి 600 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయాన్ని భారత్ అర్థిస్తోంది. ప్రస్తుతం ఈ రెండు సంస్థలతో చర్చలు సాగుతున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. టెస్టింగ్ కిట్లు, వెంటిలేటర్లు, రక్షణ సామగ్రి, ఆసుపత్రుల నిర్మాణం కోసం భారీగా నిధులవసరమని ఈ వర్గాలు వివరించాయి.

## భారత్‌లో ఒక్క రోజే 500కు పైగా..

- 3వేలు దాటిన కరోనా కేసులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: దేశంలో కరోనా వైరస్ కేసులు 3,034కు పెరిగాయి. మృతుల సంఖ్య 90కు చేరింది. ఇప్పటి దాకా 162 మంది కోలుకున్నారు. దేశంలో కరోనా కేసుల సంఖ్య 2,547కు చేరిందని, 62 మరణాలు నమోదయ్యాయని కేంద్రం శుక్రవారం ప్రకటించింది. వివిధ రాష్ట్రాలు ప్రకటిస్తున్న సంఖ్యలను బట్టి ఒక్క రోజే దాదాపు 500కు పైగా కేసులు పెరిగి... మొత్తం మూడు వేలు దాటాయి. మహారాష్ట్రలో శుక్రవారం ఆరు మరణాలు నమోదయ్యాయి. దీంతో మృతుల సంఖ్య అక్కడ 26కు చేరింది. దేశంలో కరోనాతో ఎక్కువ మంది చనిపోయింది, పాజిటివ్ కేసులు అత్యధికంగా (490) నమోదయింది కూడా ఆ రాష్ట్రంలోనే. మర్కజ్ ప్రాంతంలో గుర్తించి, తరలించిన 259 మందితో కలిపి ఢిల్లీలో వైరస్ బాధితుల సంఖ్య 386కు పెరిగిందని సీఎం కేజ్రీవాల్ వెల్లడించారు. ఢిల్లీలో సమూహ వ్యాప్తి జరగడం లేదని, పరిస్థితి అదుపులో ఉన్నందున ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. తమిళనాడులో వరుసగా మూడో రోజూ పెద్ద సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. తాజాగా 102 కేసులతో మొత్తం 411కు పెరిగాయి. కేరళలో 384, ఢిల్లీ 386, రాజస్థాన్ 166, కర్ణాటక 128, యూపీ 174, మధ్యప్రదేశ్ 129, గుజరాత్ 95, జమ్మూ కశ్మీర్ 75, పశ్చిమ బెంగాల్ 57, పంజాబ్ 53, హరియాణా 43, బిహార్ 29, చండీగఢ్ 18, అసోం 20, లద్దాఖ్ 14, అండమాన్ నికోబార్ 10, ఉత్తరాఖండ్ 10, చత్తీస్‌గఢ్ 9, గోవా 6, హిమాచల్ ప్రదేశ్ 7, ఒడిసా 9, పుదుచ్చేరి 4, జార్ఖండ్ 2, మణిపూర్ 2, మిజోరాం 1, అరుణాచల్ ప్రదేశ్‌లో ఒక కేసు నమోదయ్యాయి. మధ్యప్రదేశ్‌లో ఓ ఐఏఎస్ అధికారికి కరోనా సోకింది.

### అహ్మదాబాద్‌లో పేర్లు వెల్లడి

అహ్మదాబాద్ నగరంలోని కొవిడ్- 19 రోగులు 36 మంది పేర్లు, చిరునామాలను మునిసిపల్ కార్పొరేషన్ వెల్లడించింది. కరోనా వైరస్ పాజిటివ్ అనుమానిత కేసుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఇలా ప్రకటించాల్సి వచ్చిందని తెలిపింది.

# మీడియాపై నిందలు ఆందోళనకరం

- సుప్రీంలో కేంద్రం ప్రకటన సరికాదు
- సుప్రీంకోర్టు ఆంక్షలు అవాంఛనీయం
- సిద్దార్థ కేసుపై ఎడిటర్స్ గిల్డ్ ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: దేశవ్యాప్తంగా భారీ వలసలకు, వలస కూలీల్లో భయాందోళనలకు మీడియాయే కారణమంటూ సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయడం తమకు తీవ్ర కలవరం కలిగించిందని ఎడిటర్స్ గిల్డ్ ప్రకటించింది. ప్రస్తుత సంక్షోభ సమయంలో కేంద్ర ప్రభుత్వ చర్య వార్తల ప్రసారానికి ఆటంకం కలిగిస్తుందని పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం తీవ్ర పదజాలంలో ఒక ప్రకటన జారీ చేసింది. మీడియాపై ప్రభుత్వం నిందలు వేయడం తీవ్ర అననుకూల పరిస్థితుల్లో తాము చేస్తున్న పనిని తక్కువ చేయడమే అవుతుందని వ్యాఖ్యానించింది. కేంద్రం అఫిడవిట్ కారణంగానే సుప్రీంకోర్టు కరోనావైరస్ పరిణామాల్లో ప్రభుత్వ అధికారిక ప్రకటనను తప్పనిసరిగా ప్రచురించాలని ఆదేశించిందని ప్రస్తావించింది. సుప్రీంకోర్టు పట్ల తమకు అత్యంత గౌరవం ఉందని చెబుతూనే, సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం అవాంఛనీయం, అనవసరమని వ్యాఖ్యానించింది. ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్య దేశమూ కరోనావైరస్ మీద యుద్ధంలో మీడియాను వేధించడం లేదని గుర్తు చేసింది. ద వైర్ వెబ్‌సైట్ ఎడిటర్ సిద్ధార్థ వరదరాజన్ మీద ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం క్రిమినల్ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని కూడా ఎడిటర్స్ గిల్డ్ ప్రస్తావించింది. ప్రస్తుత తరుణంలో ఇలాంటి కేసులు పెట్టడం మీడియాను బెదిరించడమే అవుతుందని వ్యాఖ్యానించింది. మీడియాకు ఇలాంటి బెదిరింపులు, దేశవ్యాప్త వలసలకు మీడియాను బాధ్యులను చేయడం ప్రతికూల ఫలితాలను ఇస్తుందని హెచ్చరించింది. అలాంటి చర్యలు మీడియాను పని చేయనీయక పోవడం కిందకే వస్తాయని వ్యాఖ్యానించింది. మీడియా బాధ్యతాయుతంగా, స్వేచ్ఛగా నిష్పాక్షికంగా ఉండాలన్నదే ఎడిటర్స్ గిల్డ్ అభిప్రాయమని చెప్పింది. మీడియాలో జోక్యంవల్ల ఈ లక్ష్యాలు నెరవేరకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేసింది. తప్పుడు వార్తల వల్ల ప్రజల్లో భయాందోళనలు పెరిగిపోయాయని, వార్తలను ధ్రువీకరించుకున్న తర్వాతే మీడియా ప్రసారం చేయాలని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది.

# లైట్లు ఆపి.. జ్యోతులు వెలిగించండి

## రేపు రాత్రి 9 గం.కు 9 నిమిషాలు

- కరోనా చీకటిని జయించే సంకల్పం
- ప్రధాని మోదీ వీడియో సందేశం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): 'దేశవ్యాప్తంగా కరోనా వైరస్(కోవిడ్-19) మహమ్మారిని తరిమికొట్టేందుకు భారత జాతి అంతా ఒకే తాటిపై ఉందన్న సత్యాన్ని మరోసారి రుజువు చేయాల్సిన అవసరం ఉంది. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించి 9 రోజులు గడిచాయి. ఈ కాలంలో మీరు చూపిన క్రమశిక్షణ, సేవా స్ఫూర్తి అపూర్వం. ఇది ఇలానే కొనసాగాలి. సామాజిక దూరంపాటిస్తూ ప్రజలు విశేషంగా సంయుక్తంగా సంకల్పం చాటిచెప్పారు. ఇదే రీతిలో ఏప్రిల్ 5వ తేదీన అంటే ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో 9 నిమిషాలపాటు ప్రతి ఒక్కరూ తమ తమ ఇళ్లవద్దనే ఉండి ఇళ్లల్లోని విద్యుత్ లైట్లన్నీ ఆపేసి, జ్యోతులు వెలిగించి, తమ ధృఢ సంకల్పాన్ని వెల్లడించాలి. చమురు దీపాలు లేదా కొవ్వొత్తులు, టార్చ్‌లైట్లు లేదా సెల్‌ఫోన్ ఫ్లాష్‌లైట్లు... ఏవి వీలైతే అవి వెలిగించి, కరోనా అనే చీకటిని, ఆ మహమ్మారిని తరిమేద్దాం అనే సంకల్పం తీసుకోవాలి. నా కోసం మీ విలువైన సమయంలో ఓ 9 నిమిషాలు కేటాయించండి. జనతా స్ఫూర్తిని మరోమారు చాటండి' అని భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం ఉదయం 9 గంటలకు తన ట్విటర్ వేదికగా ఓ వీడియో సందేశం విడుదల చేశారు. "కరోనా వైరస్‌పై జరుగుతున్న ఈ యుద్ధంలో అహర్నిశలూ తమ శక్తియుక్తులను ధారబోస్తున్నవారికి, ముఖ్యంగా వైద్య సిబ్బందికి జేజేలు పలుకుతూ మార్చి 22న మీరంతా కృతజ్ఞత చూపిన విధానమే నేడు అన్నిదేశాలకూ ఆదర్శమైంది" అన్నారు. దేశంలోని 130కోట్ల మంది భారతీయు సమష్టి శక్తి మనకు అండగా ఉన్నదని, అది మనలో ప్రతిఒక్కరి బలానికి ప్రతిరూపమని వ్యాఖ్యానించారు. ఈ సామూహిక శక్తి గొప్పతనం, ఘనత, దివ్యత్వాలను ఎప్పటికప్పుడు అనుభవంలోకి తెచ్చుకోవడం దేశవాసులందరికి అవసరమని చెబుతూ అందుకే రెండోసారి ఈ ప్రయత్నమని చెప్పుకొచ్చారు. రాబోయే రోజులు అత్యంత కీలకమని ప్రధాని హెచ్చరికగా అన్నారు. ఇది ఖచ్చితంగా లాక్‌డౌన్ సమయమే. మనమంతా ఇళ్లకు పరిమితం కావాల్సిందే. ఒక్కరం ఏం చేయగలం అనుకోవద్దు. సమష్టిగా చేయగలం. ఎన్నాళ్లీ నిర్బంధం అన్న ఆందోళన ఉండొచ్చు. కానీ అనివార్యం. ఓ మహమ్మారిని ఎదుర్కొనాలంటే ఇది అవసరం. మనం ఒక్కరమే కాదు. ప్రజలంతా మన తోడున్నారన్న భావన కలగాలి. అందుకే ఈ ప్రతిన' అని ప్రధాని అన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్లవద్దనే ఉంటే, భౌతిక దూరం పాటిస్తే కరోనాను జయించినట్లేనని ఆయన సూచించారు. 'అహం బ్రహ్మస్మి అన్న భావన మనదేశంలో ఏనాటి నుంచో ఉంది. దేశం ఓ పెద్ద యుద్ధం చేస్తోంది. సమైక్య శక్తి ప్రజల రూపంలో ఆవిష్కృతమవుతోందన్న అనుభూతి మీకు మరింత ఆత్మస్థైర్యాన్నిస్తుంది. అందుకే ఈ జ్యోతి ప్రజ్వలన.. రాబోయే 5వ తేదీన అంటే ఆదివారం రాత్రి తొమ్మిదింటికి తమ ఇళ్లల్లోని విద్యుత్ దీపాలన్నీ ఆపేసి గుమ్మాల వద్ద, ప్రవేశ ద్వారాల వద్ద లేదా బాల్కనీల వద్ద నిలబడి జ్యోతులను వెలిగించాలి. ఎవరూ ఒక చోట గుమిగూడొద్దు. వీధుల్లోకి రావొద్దు. ఒకరికొకరు దూరం పాటించాల్సిందే. భౌతిక దూరమనే లక్ష్మణరేఖను దాటొద్దు. కరోనా చైన్‌ను తెంపేయగలిగేది ఈ లక్ష్మణరేఖే...' అని ప్రధాని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఇతిహాసాల్లోని ఓ శ్లోకాన్ని చదివారు.

### దీపాలతో వైరస్ పోతుందా?: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: ఐదో తేదీన లైట్లు ఆర్పేసి దీపాలు వెలిగించాలన్న ప్రధాని మోదీ పిలుపును విపక్షాలు హేళన చేశాయి. అలా చేస్తే కరోనా వైరస్ పోతుందా? అని ప్రశ్నించాయి. 'ఇది ఆర్థికాన్ని పునరుజ్జీవింప చేయాల్సిన సమయం. అది వదిలేసి ప్లేట్లు కొట్టండి.. లైట్లు ఆర్పండి... జ్యోతులు వెలిగించండి అని కోరడం అసంబద్ధం' అని కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధురి దుయ్యబట్టారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతా బెనర్జీ మాత్రం నేరుగా స్పందించలేదు. అది ప్రజల ఇష్టం... ఇష్టమున్న వారు చేస్తారు, లేని వారు లేదంటూ దాటవేశారు. మహమ్మారి కట్టడికి మందులు, వెంటిలేటర్ల సంగతి చూడాలని సీపీఐ పేర్కొనగా, శాస్త్రీయంగా ఆలోచించి ప్రజలను సమాయత్తం చేయాలని సీపీఎం కోరింది.

### గ్రిడ్ కుప్పకూలుతుంది!

- ఒకేసారి లైట్లు ఆఫ్‌పై నిపుణులు

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రధాని పిలుపు ఇచ్చినట్లు ఒకేసారి దేశం మొత్తం లైట్లు ఆఫ్ చేస్తే విద్యుత్ గ్రిడ్ కుప్పకూలే ప్రమాదం ఉందని విద్యుత్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదాన్ని ఇప్పటికే విద్యుత్ ఇంజనీర్ల సంఘాలు ప్రధాని కార్యాలయానికి తెలిపినట్లు సమాచారం. ఇళ్లలోని మొత్తం లైట్లు అందరూ ఒకేసారి ఆఫ్ చేస్తే విద్యుత్ వినియోగం ఒకేసారి తగ్గిపోతుంది. విద్యుత్ వినియోగం ఒకేసారి పెరిగిపోయినా, లేదా బాగా తగ్గిపోయినా గ్రిడ్ పనిచేయడం నిలిచిపోతుంది. వినియోగంలో నలభై శాతం ఒకేసారి తగ్గిపోతే గ్రిడ్ కుప్పకూలడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ అంశం శుక్రవారం రాష్ట్రాల విద్యుత్ ఇంజనీర్ల సంఘాల మధ్య చర్చకు వచ్చిందని ఏపీ విద్యుత్ ఇంజనీర్ల సంఘం నేత వేదవ్యాస్ తెలిపారు. ఆ సమయంలో ఇళ్లలో ఏసీలు వేసి ఉంచడం లేదా ఇతర విద్యుత్ ఉపకరణాలను ఆన్‌లో ఉంచితే ఈ సమస్యను నివారించవచ్చని కొందరు నిపుణులు చెబుతున్నారు.

## తెలంగాణలో మరో 75 కేసులు!

హైదరాబాద్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కరోనా కరాళ నృత్యం చేస్తోంది. 24 గంటల వ్యవధిల్లో ఏకంగా 75 కేసులు నమోదయ్యాయి. ప్రతి గంటకు 3 కొత్త కేసులు నమోదవడం వైద్య ఆరోగ్య శాఖకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. శుక్రవారం నమోదైన 75 కేసులతో కలి పి రాష్ట్రంలో కేసుల సంఖ్య 229కి చేరింది. 4 రోజుల వ్యవధిలోనే 147 కేసు లు నమోదు కావడం గమనార్హం. శుక్రవారం కరోనాతో ఇద్దరు చనిపోయారు. ఒకరు రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చేగూర్ గ్రామానికి చెందిన మహిళ(55) కాగా మరొకరు సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి. దీంతో రాష్ట్రంలో కరోనా మరణాల సంఖ్య 11కు చేరింది. శుక్రవారం ఆరు ల్యాబ్‌లలో 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో సుమారు 400 నమూనాలు సేకరించారు. దాంట్లో 75 కేసులు పాజిటివ్‌గా తేలాయి. అంటే, సేకరించిన న మూనాల్లో పాజిటివ్ కేసుల శాతం 18.75గా నమోదైంది. అవన్నీ కూడా మర్కజ్‌తో సంబంధమున్నవేనని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. చేగూరు కిరాణం దుకాణం మహిళ ఇంట్లో అద్దెకు ఉండే బిహారీలు గత నెల 18న స్వగ్రామం నుంచి రైల్లో హైదరాబాద్‌కు వచ్చారు. అదే రైల్లో మర్కజ్ నిజాముద్దీన్ యాత్రికులు ఉన్నారని, వారి నుంచి రైల్లో ఉన్న బిహారీ కార్మికులకు, బిహారీల నుంచి ఇంటి యజమానురాలికి కరోనా అంటి ఉండవచ్చని చెబుతున్నారు. వారంతా చేగూరు పక్కనే ఉండే కన్హ ఆశ్రమంలో పని చేస్తున్నారు. ఆమె కుమారుడు కూడా ఆశ్రమంలో పని చేస్తున్నారు. కన్హ ఆశ్రమంలో కరోనా పాజిటివ్ కేసులు ఇంతవరకు వెలువడలేదు. సికింద్రాబాద్ మృతుడు జీహెచ్ఎంసీ ఉద్యోగి. పలు అనారోగ్య సమస్యలు ఉండటంతో మూడు నెలలుగా విధులకు రావడం లేదు. ఆరోగ్యం బాగోలేక పోవడంతో గాంధీ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఉస్మానియాకు తరలించారు. అక్కడ అనుమానంతో పరీక్షలు చేయగా, కరోనా ఉన్నట్లు తేలింది. ఆయనకు ఢిల్లీ మర్కజ్ నిజాముద్దీన్‌తో ఎలాంటి సంబంధమూ లేదు. కరోనా ఎక్కడి నుంచి వచ్చిందో తేలాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం శనివారం మరో 600 మందికి పరీక్షలు నిర్వహించనుంది. విదేశాల నుంచి వచ్చిన కేసులు కేవలం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు పరిమితం అయ్యాయి.

## వూహాన్.. మళ్లీ మొదటికొచ్చిందా?

- ప్రజలను గడప దాటొద్దంటున్న ప్రభుత్వం

బీజింగ్, ఏప్రిల్ 3: వూహాన్‌లో పరిస్థితి మళ్లీ మొదటికొస్తోందా? కొవిడ్ పుట్టిల్లు.. మళ్లీ లాక్‌డౌన్ దిశగా అడుగులేస్తోందా? అంతా సద్దుమణిగి.. తిరిగి సాధారణ పరిస్థితులు ఏర్పడుతున్నాయని అనుకుంటున్నంతలోనే ఇప్పుడిప్పుడే పెరుగుతున్న కేసులు ప్రజల్లో ఈ అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. నగరంలో కరోనా మళ్లీ విజృంభించే అవకాశాలున్నాయని, అత్యవసరమైతే తప్ప.. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని శుక్రవారం అధికారులు చేసిన ప్రకటన వారిని మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఏప్రిల్ 8 నుంచి వూహాన్‌లో రైళ్లు, విమానాల రాకపోకలను పునరుద్ధరించాలని చైనా ప్రభుత్వం నిర్ణయించిన తరుణంలో.. అధికారులు ఈ ప్రకటన చేయడంతో అంతటా అయోమయం నెలకొంది. బుధవారం నుంచి వూహాన్‌లో అనూహ్యంగా.. లక్షణాలు కనిపించని కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. దీంతో జనాభా మొత్తానికి పరీక్షలు చేయించాలని అక్కడి ప్రభుత్వం భావిస్తోంది. కాగా, కరోనా వైరస్‌పై పోరాటం చేసి అమరులైన తమ దేశ వైద్యులకు, సిబ్బందికి 4న నివాళి అర్పించాలని చైనా నిర్ణయించింది.

## కరోనాపై సాయుధ దళాల పోరు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 : కరోనా రోగులకు చికిత్స అందించేందుకు సాయుధ దళాలకు చెందిన 51 ఆస్పత్రులు సిద్ధమవుతున్నాయి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేయడంపై సంబంధిత ఉన్నతాధికారులు దృష్టిసారించారు. ఈవిధంగా సేవలు అందించనున్న సాయుధ దళ హాస్పిటళ్లు హైదరాబాద్(దుండిగల్), విశాఖపట్నం, బెంగళూరు, కొచ్చి, కాన్పూర్, గోరఖ్‌పూర్, జైసల్మీర్, జోర్హాత్, కోల్‌కతా తదితర నగరాల్లో ఉన్నాయి. ఇంతేకాకుండా ఆయా రాష్ట్రాల్లో నిత్యావసరాలు, ఔషధాలు, వైద్య ఉపకరణాల సరఫరా కోసం సాయుధ దళాలు రవాణాపరమైన సేవలనూ అందించనున్నాయి.

## వలస జీవుల వెతలపై సుప్రీం ఆందోళన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ వల్ల జీవనోపాధి కోల్పోయి ఇబ్బంది పడుతున్న వలస కార్మికులు, ఇతర అసంఘటితరంగ కార్మికుల దుస్థితిపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వీరికి కనీస వేతనాలు చెల్లించేలా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని దాఖలైన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. 7వ తేదీలోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ప్రముఖ సామాజిక, హక్కుల కార్యకర్తలు హర్ష్ మందేర్, అంజలి భరద్వాజ్ దాఖలు చేసిన ఈ ప్రజాహిత దావాను, వారి వినతిని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అడ్డుకున్నారు. "ఈ ప్రజాప్రయోజనాల వాజ్యాల(పిల్) దుకాణాలను మూసివేయాలి. నిజమైన వ్యక్తులు క్షేత్రస్థాయిలో ప్రజలకు సాయం చేస్తున్నారు. ఏసీ గదుల్లో కూర్చొని పిల్‌లు దాఖలు చేయడం వల్ల ఉపయోగం లేదు." అని ఆయన వాదించారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదిస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అనేక మందిని పనుల్లోంచి తీసేశారని జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన బెంచ్ దృష్టికి తెచ్చారు.

## జూన్ 30 వరకు డ్రైవింగ్ లైసెన్స్‌ల చెల్లుబాటు

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కరోనా నేపథ్యంలో డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన ఫిట్‌నెస్, పర్మిట్ల చెల్లుబాటును జూన్ 30 వరకు పొడిగిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఫిబ్రవరి 1-జూన్ 30 మధ్య గడువు ముగిసే డ్రైవింగ్ లైసెన్సులు, పర్మిట్లు, ఫిట్‌నెస్‌ను జూలై నుంచి రెన్యూవల్ చేసుకోవాలని వాహనదారులకు సూచించింది.

### సీజీహెచ్ఎస్ కార్డుల గడువు 30 వరకు..

సీజీహెచ్ఎస్ కార్డుల కాలపరిమితిని ఈ నెల 30 వరకు పొడిగించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ కార్డుల గడువును మార్చి 31తో ముగిసింది.

## ఐఏఎస్ అధికారుల బదిలీ

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని ఉత్తర్వులు జారీ చేశారు. ఫుడ్‌ప్రాసెసింగ్, చక్కెర పరిశ్రమ కార్యదర్శిగా ఉన్న కాంతిలాల్ దండేను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయమని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఫుడ్ ప్రాసెసింగ్, చక్కెర పరిశ్రమ కార్యదర్శి పోస్టు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్యకు అప్పగించారు. ఏపీ ఆగ్రోస్, మార్క్‌ఫెడ్ ఎండీగా ఉన్న లత్కర్ శ్రీకేష్ బాలాజీరావును కేవలం ఆగ్రోస్ ఎండీ పోస్టుకే పరిమితం చేసి, మరో ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్నకు మార్క్‌ఫెడ్ ఎండీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఆదేశాలు జారీ చేశారు.

# మాస్కులు హైజాక్

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా చైనా అధికారులకు నచ్చచెప్పింది. చివరకు చైనా విధిలేక ఆ కార్గో మొత్తాన్ని అమెరికాకు పంపేసింది. అలా ఫ్రాన్స్‌కు వెళ్లాల్సిన మాస్కులన్నింటినీ అమెరికా ఆఖరినిముషంలో గద్దలా తన్నుకుపోయింది. విశేషమేమంటే ఈ డీల్ పూర్తయ్యేదాకా.. ఆ వచ్చిన నలుగురూ అమెరికన్లని, అమెరికా ప్రభుత్వమే ఈ వ్యవహారాన్ని నడిపించిందని ఎవరికీ తెలియకపోవడం!

**కొవిడ్-19 బారిన పడి తేరుకున్న తొలి దేశం చైనా. అత్యుత్తమ శ్రేణి మాస్కులు తయారయ్యేది చైనాలోనే!**

**దుమారం:** ఈ హైజాక్ ఘటన అంతర్జాతీయంగా తీవ్ర దుమారం రేపింది. ఫ్రాన్స్ ఇది అనైతికమంటూ నిరసించింది. ప్రాణం ఎవరిదైనా ఒకటేనంటూ ఒక్క అమెరికన్ ప్రాణాలకే విలువుంటుందా ... అని నిలదీసింది. తమ దేశం నుంచి కూడా పెద్ద సంఖ్యలో మాస్కుల కన్‌సైన్‌మెంట్లు దారిమళ్లించారని, దీని వెనుక ఎవరన్నది తేలాలని కెనడా ప్రధాని ట్రూడో చెప్పారు.

అయితే అమెరికా మాత్రం ఈ ఆరోపణలను ఖండించింది. 'మేం చైనా నుంచి ఫ్రాన్స్ కొనుక్కున్న ఏ కన్‌సైన్‌మెంట్‌నూ మేం హైజాక్ చేయలేదు. ఎక్కువ డబ్బిచ్చి వాటిని మేం కొనుక్కోలేదు' అని విదేశాంగ శాఖ సీనియర్ అధికారి ఒకరు స్పష్టం చేశారు. అయితే మాస్కులు, ఇతర ఉపకరణాల నిమిత్తం అమెరికా చైనాకు 23 పెద్ద కార్గో విమానాలను పంపినమాట నిజమని బ్రెజిల్ ఆరోగ్యమంత్రి లూయిూ హెన్రిక్ మండేటా వెల్లడించారు. బ్రెజిల్, చెక్ రిపబ్లిక్ దేశాలు కూడా తమ దేశాలకు రావాల్సిన మాస్కులు, వెంటిలేటర్లు దారిమళ్లాయని ఫిర్యాదు చేశాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.